www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



11 నుంచి అసెంబ్లీ
11 రోజులు జరిగే అవకాశం
బీఏసీ భేటీలో తుది నిర్ణయం
తొలి రోజే బడ్జెట్ పెట్టనున్న ప్రభుత్వం
వైసీపీ ఎమ్మెల్యేల హాజరుపై లేని స్పష్టత
13

శారదాపీఠం భూ కేటాయింపు రద్దు
15 ఎకరాలు వెనక్కి తీసుకోవాలని సర్కారు ఉత్తర్వులు
నేరుగా విశాఖ కలెక్టర్‌కు రెవెన్యూ శాఖ ఆదేశం
అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు 3

ఒక్కో ప్రాంతానికి ఒక్కో మెనూ
మారనున్న మధ్యాహ్న భోజనం లిస్టు 14
ఇకపై రాష్ట్రంలో నాలుగు రకాల మెనూలు!
ప్రాథమికంగా నిర్ణయించిన అధికారులు


మంగళవారం | 5-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 200 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: చవితి రా. 12.17 తదుపరి పంచమి; నక్షత్రం: జ్యేష్ఠ ఉ. 9.45 తదుపరి మూల; వర్జ్యం: రా. 6.10-7.51; దుర్ముహూర్తం: ఉ. 8.34-9.20, రా. 9.48-10.37; అమృతఘడియలు: తె. 4.16-5.57; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.18; సూర్యాస్తమయం: 5.38 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మళ్లీ టెండర్లు!



అమరావతి పనులపై కీలక నిర్ణయం
పాత టెండర్లు క్లోజ్.. కొత్తవాటికి ఆహ్వానం

హైకోర్టు, అసెంబ్లీకి జనవరిలోపు
మిగిలిన పనులకు డిసెంబరు 31లోపే టెండర్లు
మూడేళ్లలో అభివృద్ధి పనుల పూర్తే లక్ష్యం
సీఆర్డీయే సమావేశంలో కీలక నిర్ణయాలు



సీఎం కీలక సమీక్షలు

ఐదేళ్లలో ప్రపంచంలోనే ఐదు ఉత్తమ నగరాల్లో అమరావతి
15 వేల కోట్లు ఇచ్చేందుకు ప్రపంచబ్యాంకు ఓకే
వరద నివారణ చర్యలపై దృష్టి.. నెదర్లాండ్స్ సంస్థ నివేదిక
మినీ రిజర్వాయర్ల నిర్మాణం... రాజధాని పరిధిలో మూడు కాల్వలు
అమరావతి రైల్వేలైన్‌కూ ల్యాండ్ పూలింగ్.. మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి పనులకు కొత్తగా టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటిదాకా పనుల కొనసాగింపునకు అడ్డంకిగా మారిన పాత టెండర్లను రద్దు చేసి, త్వరలోనే కొత్తగా టెండర్లను ఆహ్వానించనుంది. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీయే 39వ సమావేశం జరిగింది. ఇందులో

మిగతా 14వ పేజీలో...

ఆటలకు అందలం
క్రీడా రిజర్వేషన్లు 3 శాతానికి పెంపు
ఒలింపిక్స్, ఆసియా గేమ్స్ విజేతలకు గ్రూప్-1పోస్టు
ఒలింపిక్ స్వర్ణానికి రూ.7 కోట్ల భారీ నజరానా
రజతానికి 5 కోట్లు, కాంస్యానికి 3 కోట్లు ప్రోత్సాహం
ఆసియా క్రీడల్లో గోల్డ్ సాధించిన వారికి 4 కోట్లు
రజతానికి 2 కోట్లు, కాంస్యానికి కోటి బహుమానం
నూతన పాలసీలో ప్రతిపాదనలకు ఆమోదం

ఐదేళ్లలో అర్హులందరికీ ఇళ్లు
డిసెంబరులో లక్ష గృహ ప్రవేశాలకు సన్నాహాలు

గంజాయి కట్టడికి గట్టి చర్యలు
ఐదుగురు మంత్రులకు మరిన్ని బాధ్యతలు

మార్కెట్ సెస్ ఒక శాతానికి తగ్గింపు?
ధరల స్థిరీకరణకు రూ.500 కోట్లతో నిధి
12 13 14



తప్పు చేస్తే వదలొద్దు
కులం, మతం, ప్రాంతం చూడొద్దు
రాష్ట్రాభివృద్ధికి శాంతి భద్రతలు కీలకం
హోం మంత్రి అనిత కూడా బాధ్యత తీసుకోవాలి
వైసీపీ హయాంలో నియంత్రణ లేకుండా వదిలేశారు
ఇప్పుడు ధర్మబద్ధంగా పని చేయాలంటున్నా మీనమేషాలు
క్రిమినల్స్‌ను వెనకేసుకొచ్చేలా కొందరు ఐపీఎస్‌ల తీరు
నేను 'హోం' తీసుకుని ఉంటే పరిస్థితులు ఇలా ఉండవు!
చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడే వాళ్లు నీచులు
ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టీకరణ

కాకినాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): "పోలీసులు అలసత్వం వీడడం లేదు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ బలంగా ఉండాలి. గతంలో పూర్తిగా నియంత్రణ లేకుండా వదిలేశారు. ఇప్పుడు.. ధర్మబద్ధంగా చేయాలంటున్నా పోలీసులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు. ఎందుకో అర్థం కావడంలేదు! కొందరు ఐపీఎస్‌లు క్రిమినల్స్‌ను వెనకేసుకొచ్చేలా వ్యవహరిస్తున్నారు. ధైర్యం లేని వారు పోలీసులుగా ఉండడం ఎందుకు?" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మండిపడ్డారు. గత

మిగతా 13వ పేజీలో...

ఉత్తరాంధ్ర సిగలో మరో ఉక్కు!
1.5 లక్షల కోట్ల పెట్టుబడులు.. 55 వేల ఉద్యోగాలు



నక్కపల్లిలో భారీ పరిశ్రమ స్థాపనకు ప్రతిపాదన
దిగ్గజ సంస్థలు ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ జాయింట్ వెంచర్‌గా ఏర్పాటుకు సుముఖత
ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు
సీఎం చంద్రబాబుకు చేరిన స్టేటస్ రిపోర్టు
కేబినెట్ ఆమోదం కోసం ప్రతిపాదనలు రెడీ
ప్రాజెక్టు కోసం 2,164 ఎకరాలు సిద్ధం
విశాఖ స్టీల్‌కు దీటుగా ఏర్పాటుకు ప్రణాళిక
అనుబంధంగా కో-టెర్మినస్ క్యాప్టివ్ పోర్ట్
మరో 11,199 కోట్ల పెట్టుబడి..
8 వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం

AM/NS INDIA

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్రకు మరో భారీ ఉక్కు పరిశ్రమ రానుంది. ఇప్పటికే విశాఖ తీరాన ఉన్న దేశంలోనే మొట్ట మొదటి పోర్ట్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ (వైజాగ్ స్టీల్)కు దీటుగా పక్కనే ఉన్న అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో భారీ ప్రైవేటు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయనున్నారు. రెండు దశల్లో మొత్తం రూ.1,50,000 కోట్ల పెట్టుబడులు, 55 వేలమందికి ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యంగా భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రపంచంలోనే ప్రముఖ ఉక్కు తయారీ సంస్థలుగా పేరున్న ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కార్పొరేషన్ జాయింట్ వెంచర్ ప్రాజెక్టు కింద పోర్టు ఆధారిత ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పడానికి ముందుకు వచ్చాయి. దీనికి సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ప్రతినిధులు ఇప్పటికే ప్రభుత్వంతో పలు దఫాలు సంప్రదింపులు జరిపారు. మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో విడివిడిగా చర్చలు నిర్వహించారు. ఈ రెండు సంస్థల నుంచి అందిన ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (ప్రి ఫీజిబిలిటీ రిపోర్టు) ఆధారంగా ఏపీఐఐసీ అధికారులు అనకాపల్లి జిల్లా కలెక్టరుతో

మిగతా 14వ పేజీలో...



2

ఉత్తరాఖండ్‌లో ఘోరం
200 మీటర్ల లోయలో పడిన బస్సు
36 మంది దుర్మరణం.. నలుగురు విషమం
24 మందికి గాయాలు.. హెలికాప్టర్‌లో ఆస్పత్రికి
అధిక భారం వల్లే ప్రమాదమని అంచనా

నలుగురి ప్రాణాలు తీసిన ఫ్లెక్సీ
విద్యుత్ వైర్లకు తగలడంతో తూర్పుగోదావరిలో ఘోరం 9

పార్టీకి ఉపయోగపడని మీకు రాజకీయాలెందుకు?
మంత్రి సుభాష్‌పై చంద్రబాబు ఆగ్రహం
పట్టభద్ర ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో అలసత్వంపై అసహనం
పనితీరు మార్చుకోకుంటే ప్రత్యామ్నాయం చూస్తానని హెచ్చరిక 13

టెట్‌లో 50.79% ఉత్తీర్ణత
1,87,276 మందికి అర్హత
పేపర్1బీలో తక్కువ మంది
ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్ 3

త్వరలో రైల్వే సూపర్ యాప్
ఇక సేవలన్నీ ఒకే చోట అందుబాటులో.. 2



హోరాహోరీ..!
స్వింగ్ రాష్ట్రాల్లో ట్రంప్‌నకు స్వల్ప మొగ్గు.. కమల వెనుకబాటు

గెలుపునకు 7 రాష్ట్రాలే కీలకం
సర్వేలు మాజీ అధ్యక్షుడి వైపే
ఉత్కంఠగా అమెరికా ఎన్నికలు
నేడు అగ్రరాజ్యంలో పోలింగ్
11వ తేదీలోగా ఫలితాలు
రూ.6 లక్షల కోట్లు ఉఫ్
భారీగా పతనమైన మార్కెట్ 2

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో క్షణక్షణం ఉత్కంఠ నెలకొంటోంది..! 'నువ్వా-నేనా' అన్నట్లుగా రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ అభ్యర్థి కమలాహ్యారిస్ మధ్య పోరు హోరాహోరీ కొనసాగుతోంది. చివరి రెండ్రోజుల్లో స్వింగ్ రాష్ట్రాలపై ఇరువురు అభ్యర్థులు దృష్టి సారించగా.. ఓటర్లు స్వల్పంగా ట్రంప్ వైపు మొగ్గుచూపుతున్నట్లు సర్వేలు పేర్కొంటున్నాయి. తాజా సర్వేలతోపాటు, నేట్ సిల్వర్ వంటి ఎన్నికల వ్యూహకర్తలు ట్రంప్‌కే స్వింగ్ అని చెబుతుండగా.. ఆయన ఆధిక్యం 1-4% వరకే ఉందని, కమల తిరిగి పుంజుకోవచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు సోమవారం ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. ముంబైలోని దలాల్ స్ట్రీట్ కూడా బేర్‌మనడంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలను చవిచూశాయి.

అమెరికా ఎన్నికలు పడేశాయ్
రూ.6 లక్షల కోట్లు ఉఫ్.. భారీగా పతనమైన మార్కెట్ 10

న్యూయార్క్, నవంబరు 4: ఎన్నికల్లో పార్టీల అనుకూల-ప్రతికూల-తటస్థ అంశాలకు అనుగుణంగా అమెరికాలోని రాష్ట్రాలను మూడుగా విభజించారు. అవి.. రెడ్, బ్లూ, స్వింగ్ రాష్ట్రాలు. 1980 నుంచి రిపబ్లికన్లు విజయం సాధిస్తూవస్తున్న రాష్ట్రాలను రెడ్ స్టేట్స్ అంటారు. 1992 నుంచి డెమొక్రాట్లకు కంచుకోటలుగా ఉన్న రాష్ట్రాలను బ్లూ స్టేట్స్ అని పిలుస్తారు. అయితే.. ఓటర్లు ఏ పార్టీకి మద్దతిస్తారనే అంచనాకు అందని అరిజోనా, జార్జియా, మిషిగాన్, నెవడా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్ రాష్ట్రాలను స్వింగ్ స్టేట్స్‌గా చెబుతారు. స్వింగ్ రాష్ట్రాల్లో మెజారిటీ సాధించే పార్టీకే అధికార పీఠం దక్కుతుంది. రెడ్ స్టేట్స్‌లో కమలకు 226 స్థానాలు దక్కుతాయని, బ్లూ స్టేట్స్‌లో 219 స్థానాలు ట్రంప్ ఖాతాలోకి చేరుతాయని అంచనా. అయితే.. మ్యాజిక్ ఫిగర్ 270 సీట్లను సాధించేందుకు స్వింగ్ రాష్ట్రాల్లో కమల 44, ట్రంప్ 51 సీట్ల దూరంలో ఉన్నారు. దాంతో.. ట్రంప్, కమల ఈ ఏడు



మిగతా 2వ పేజీలో...

మరో జగన్ దెబ్బ
జనంపై మరోసారి ఇంధన సర్దుబాటు భారం!

రూ.11,826 కోట్లు ప్రతిపాదించిన డిస్కమ్‌లు
ఇది ఎన్నికల నోటిఫికేషన్ ముందటి పిటిషన్
2023-24కు గాను వైసీపీ సర్కారులో సమర్పణ
నాడు పరిష్కరించని ఈఆర్సీ.. 90 రోజుల రూల్‌కూ బ్రేక్
దీంతో కూటమి సర్కారుకు శాపంగా జగన్ పాపం
ఆ పిటిషన్‌ను తాజాగా తెరపైకి తెచ్చిన డిస్కమ్‌లు
19 లోపు అభ్యంతరాలు తెలపాలంటూ ప్రకటన
ఆ వెంటనే ప్రజాభిప్రాయ సేకరణకు ఈఆర్సీ సిద్ధం!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్‌ను ఎన్నికల్లో ప్రజలు వదిలించుకున్నారు. కానీ, ఐదేళ్ల పాలనా పాపాల బాదుడును మాత్రం ఇప్పటికీ వదిలించుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వ శాపాలు ఇంకా విద్యుత్తు చార్జీల రూపంలో ప్రజలను పట్టి పీడిస్తూనే ఉన్నాయి. 2022-23 ఇంధన సర్దుబాటు భారం రూ.8,114 కోట్లకుగాను రూ.6,072 కోట్లకు రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి ఆమోదించింది. ఈ భారం ఈ నెల నుంచే ట్రూఅప్ కింద జనం భరించడం మొదలైంది. ఇది చాలదన్నట్టు.. వైసీపీ పాలన నాటి మరో పీడ కత్తిలా వేలాడుతోంది. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే, 2023-24 సంవత్సరానికిగాను డిస్కమ్‌లు రూ.11,826.47 కోట్ల ఇంధన సర్దుబాటు



మిగతా 14వ పేజీలో...

సత్యనారాయణ అక్రమాలపై
మీనమేషాలు!
నివేదిక ఇస్తారా.. నీరుగారుస్తారా?
జీఏడీకి ఇంకా రిపోర్టు ఇవ్వని ఆర్థిక శాఖ 14
మాజీ కార్యదర్శికి ఇప్పటికీ పెద్దలు, అధికారుల అండ!
సీఎఫ్‌ఎంఎస్‌లో పనిచేస్తున్న ఆయన సోదరుడు



ట్యాక్స్ కట్టకుండానే తోలేశారు
అడ్డదిడ్డంగా అంబులెన్స్‌లు నడిపిన అరబిందో
గత మూడేళ్లు ప్రభుత్వానికి రోడ్ ట్యాక్స్ ఎగవేత
అయినా వైసీపీ హయాంలో అరబిందోకు రైట్‌రైట్
సర్కారు మారినా మాయని మమకారం 12
అరబిందో ఒక్కో ఎత్తుకు ఉన్నతాధికారుల సాయం
ట్యాక్స్ మినహాయింపు కోరిందే తడవుగా ఫైల్

వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్ల తర్వాత ఆకస్మికంగా 'రాజ్యాంగం' గుర్తుకొచ్చింది. భావప్రకటన స్వేచ్ఛ అనేది ఒకటి ఉంటుందని తెలిసొచ్చింది. అధికారంలో ఉండగా 'చంద్రముఖి'లాగా అక్రమ అరెస్టులతో సామాన్యుల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీల వరకు భయభ్రాంతులకు గురి చేశారు. గద్దె దిగి విపక్షంలోకి రాగానే 'గంగ'లాగా మారిపోయి నీతి సూత్రాలు వల్లెవేస్తున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, వారి కుటుంబ సభ్యులపై అతి నీచంగా, అసభ్యంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు పెట్టి.. అరెస్టులు చేస్తుండడంతో గగ్గోలు పెడుతున్నారు.

రోత పత్రిక.. నీతి చంద్రిక!
రాజ్యాంగం, హక్కులు అంటూ గగ్గోలు

గత ఐదేళ్లలో జరిగిన దారుణాలు ఎన్నెన్నో
పత్రికేయులు, ప్రతిపక్షాలపై ఉక్కుపాదం
41 నోటీసులు ఇవ్వకుండా చంద్రబాబు అరెస్టు
సామాన్యుడి నుంచి ఎంపీ వరకు అక్రమ కేసులు
ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు, వేధింపులు
సీఎం, డిప్యూటీ సీఎం, మహిళా హోంమంత్రిపై అభ్యంతరకర పోస్టులు పెట్టినవారికి వత్తాసు
గుంటూరు వైసీపీ మీడియా కన్వీనర్ అరెస్టు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"రాష్ట్రంలో ఎక్కడికక్కడ వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెడుతున్నారు. ఎప్పుడెప్పుడి పోస్టులో బయటకు తీస్తున్నారు. ప్రభుత్వ తప్పులను ప్రశ్నించే అధికారం పౌరులకు ఉంది. అవినీతి, పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తే ఇంత దుర్మార్గమా! వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసుల

మిగతా 12వ పేజీలో...

కమలపై యూదుల్లో ఆగ్రహం

- పిట్స్‌బర్గ్‌లో ఆమె ప్రచార బృందంలో ఇజ్రాయెల్ వ్యతిరేకుల ప్రసంగాలు
- ముస్లిం, అరబ్ ఓట్ల కోసం యత్నం
- ఆమెకు ఓటేయబోమంటున్న యూదులు



పిట్స్‌బర్గ్: ఒక వర్గం ఓట్లను ఆకర్షించడానికి రాజకీయం చేస్తే.. అది అడ్డం తిరిగి మరో వర్గం మొత్తానికే దూరమై, మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది! అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇది మరోమారు రుజువు కాబోతోందా? అంటే.. అవుననే సమాధానమే వినిపిస్తోంది! ముస్లింలు, అరబ్బుల ఓట్ల కోసం.. ఇజ్రాయెల్ వ్యతిరేక యాక్టివిస్టులతో కలిసి పెన్సిల్వేనియాలో కమలా హ్యారిస్ చేస్తున్న ప్రచారం యూదుల్లో కోపానికి కారణమవుతోంది. దీనివల్ల ఆమె ఆ రాష్ట్రానికి ఉన్న 19 ఎలక్టోరల్ ఓట్లనూ కోల్పోయే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఇటీవల పెన్సిల్వేనియా రాష్ట్రంలోని పిట్స్‌బర్గ్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆమెతోపాటు ఉండి, ప్రసంగాలు చేసినవారిలో.. పిట్స్‌బర్గ్ మేయర్ ఎడ్ గెయినీ, ఎలిఘెనీ కౌంటీ ఎగ్జిక్యూటివ్ సారా ఇనమొరాటో ఉన్నారు. వారిద్దరూ ఇజ్రాయెల్ వ్యతిరేకులే. 2023 అక్టోబరు 7న హమాస్ టెర్రరిస్టులు ఇజ్రాయెల్‌పై జరిపిన దాడి గుర్తుందా? ఆ దాడికి జవాబుదారీ ఇజ్రాయెలేనన్నది వారి వాదన. ఈమేరకు.. స్థానిక డెమొక్రాటిక్ పార్టీ ప్రజాప్రతినిధి సమ్మర్‌లీతో కలిసి వారొక ప్రకటన కూడా విడుదల చేశారు. అసలే వారి ప్రకటనతో రగిలిపోతున్న యూదుల కోపం.. వారిని వెంటబెట్టుకుని ప్రచారానికి వచ్చిన కమలపైకి మళ్లింది. అధికారిక గణాంకాల ప్రకారం.. పెన్సిల్వేనియా రాష్ట్రంలో 4 లక్షల మందికి పైగా యూదులున్నారు. అక్కడ గెలవాలంటే వారి ఓట్లు చాలా కీలకం. తాజా పరిణామాల నేపథ్యంలో వారంతా ట్రంప్‌కే ఓటు వేయాలని నిర్ణయించుకున్నట్టు స్థానిక వార్తాసంస్థల కథనాల సమాచారం. యూదు ఓటర్లే కాదు.. డెమొక్రాటిక్ పార్టీలో ఉన్న పలువురు యూదు ప్రతినిధులు కూడా పార్టీ తమను మోసం చేసినట్టు భావిస్తున్నారు. నిజానికి.. 1924 నుంచి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మెజారిటీ యూదు ఓటర్ల మద్దతు డెమొక్రాటిక్ పార్టీకే. ఇప్పుడు కమల తీరుతో ఆ ఆనవాయితీ తప్పే ప్రమాదం కనిపిస్తోంది. ఈ ప్రభావం ఒక్క పెన్సిల్వేనియా రాష్ట్రానికే పరిమితమవుతుందా? లేక అన్ని రాష్ట్రాల్లోనూ యూదు ఓటర్ల కోపం ట్రంప్‌కు వరంగా మారుతుందా? అంటే.. వేచి చూడాల్సిందే!!

రికార్డు స్థాయి గాలి కాలుష్యంతో

లాహోర్ నగరం ఉక్కిరిబిక్కిరి

- భారత్ నుంచి వీస్తున్న గాలులతోనే కాలుష్య కారకాలు వచ్చాయన్న పాక్.. లాహోర్‌లో స్కూళ్లకు వారం సెలవులు

న్యూఢిల్లీ, నవంబరు 4: పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం అత్యంత తీవ్రమైన వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతోంది. స్విట్జర్లాండ్‌కు చెందిన ఐక్యూ ఎయిర్ సంస్థ ప్రకటించిన గాలి నాణ్యత సూచీ(ఏక్యూఐ) లాహోర్‌లో రికార్డు స్థాయిలో 1900గా నమోదైంది. దీంతో, లాహోర్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరంగా నిలిచింది. గాలి నాణ్యత సూచీ 200వరకు ఉంటేనే అనారోగ్యకరమైన వాతావరణ పరిస్థితిగా భావిస్తారు. అలాంటిది 1900గా నమోదైందంటే లాహోర్‌లో వాతావరణ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే, లాహోర్‌లో ఈ పరిస్థితికి భారత్ నుంచి పాకిస్థాన్ వైపునకు బలమైన గాలులు వీయడమేనని పాక్ పర్యావరణశాఖ కార్యదర్శి జహంగీర్ అన్నారు. బలమైన గాలులతో పాటు కాలుష్య కారకాలు పాకిస్థాన్‌కు వస్తున్నాయన్నారు. దీనికి భారత్‌దే బాధ్యత అని తాము అనడం లేదని, ఇది భౌగోళిక పరంగా జరిగే సహజ ప్రక్రియ అని చెప్పారు. కాలుష్య తీవ్రత నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం లాహోర్‌లో ప్రాథమిక పాఠశాలలకు వారం రోజులు సెలవులు ప్రకటించింది. ఆటోలు, నిర్మాణాలపై కొద్ది రోజులు నిషేధం విధించింది. ఆస్పత్రుల్లో స్మాగ్ కౌంటర్లను ఏర్పాటు చేసింది. ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని ఆదేశించింది. ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని, తలుపులు, కిటికీలు మూసి పెట్టుకోవాలని, అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని సూచించింది. కాగా, ఢిల్లీలో సోమవారం గాలి నాణ్యత 276గా ఉంది.

హోరాహోరీ..!



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాల్లో కాళ్లకు బలపం కట్టుకున్నట్లు తిరుగుతూ.. ప్రచారాన్ని వేగవంతం చేశారు. గత నెలాఖరు వరకు కమలకు అనుకూలంగా ఉన్న స్వింగ్ రాష్ట్రాలు ఇప్పుడు ట్రంప్ వైపు మళ్లాయని తాజా సర్వేలు చెబుతున్నాయి. అయితే.. ట్రంప్ సాధించేది స్వల్ప ఆధిక్యమేనని స్పష్టం చేస్తున్నాయి. గత నెలాఖరులో స్వింగ్ రాష్ట్రాల్లో కమలకు 44%, ట్రంప్‌నకు 43% ఓట్లు దక్కుతాయని సర్వేలు వెలువడగా.. ఇప్పుడు ట్రంప్‌తో పోలిస్తే.. కమల 1.8% వెనకబడ్డట్లు చెబుతున్నాయి. అట్లాస్-ఇంటెల్ ఈ నెల 1, 2 తేదీల్లో నిర్వహించిన సర్వే గణాంకాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ సర్వే ప్రకారం.. స్వింగ్ రాష్ట్రాల్లో 48% మంది ఓటర్లు ట్రంప్ వైపు మొగ్గు చూపుతున్నారు. కమలకు 46.2% ఓట్లు దక్కే అవకాశాలున్నాయి. మరో సర్వేలో ట్రంప్-కమల మధ్య హోరాహోరీ పోరు జరుగుతున్నా.. రిపబ్లికన్లదే పైచేయిగా వెల్లడైంది. నెవెడాలో ట్రంప్ 51.4%, కమల 45% ఓట్లను సాధిస్తారని ఆ సర్వే తేల్చింది. ట్రంప్ నార్త్ కరోలినాలో 50.4%, నెవడాలో 51.4% ఓట్లతో ముందంజలో ఉంటారని తెలిపింది. అదే సమయంలో.. పెన్సిల్వేనియాలో కమల స్వల్పంగా వెనకంజలో ఉన్నట్లు వివరించింది. డెమొక్రాట్లకు 1948 నుంచి పెన్సిల్వేనియా అత్యంత కీలకమైన రాష్ట్రంగా ఉంది. ఆ ప్రాంతంలో పాగా వేయకుండా.. ఆ పార్టీ వైట్‌హౌస్‌లోకి అడుగు పెట్టిన దాఖలాలు లేవు. దీంతో డెమొక్రాట్లకు పెన్సిల్వేనియా ఓ సెంటిమెంట్‌గా కొనసాగుతోంది. 'ఫైవ్‌థర్టీఎయిట్' సర్వే కూడా స్వింగ్ రాష్ట్రాల్లో ఓటర్లు ట్రంప్ వైపే ఉన్నట్లు స్పష్టం చేసింది. అయితే.. ట్రంప్-కమల మధ్య తేడా చాలా స్వల్పమని పేర్కొంది. మరోవైపు ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త నేట్ సిల్వర్ 'హోరా-హోరీ' పోరు జరుగుతుందని చెబుతూనే.. ట్రంప్‌నకు విజయావకాశాలున్నట్లు వెల్లడించారు. ట్రంప్ 51.5%, కమల 48.1% ఓట్లను సాధిస్తారని ఆయన అంచనా వేశారు. నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, నెవడా, జార్జియా, అరిజోనాల్లో ట్రంప్ స్వల్ప ఆధిక్యంలో ఉన్నారని, మిషిగాన్, విస్కాన్సిన్‌లో హ్యారిస్ ఆధిక్యాన్ని చూపుతున్నట్లు వివరించారు. అయితే.. ఏబీసీ న్యూస్, న్యూయార్క్ టైమ్స్, సైనా కాలేజ్ సర్వేలు మాత్రం కమలకు జైకొట్టాయి. పెన్సిల్వేనియాలో కమల వెనకబడ్డారని న్యూయార్క్ టైమ్స్ స్పష్టం చేసింది. కాగా.. ట్రంప్ కంచుకోటగా పేరున్న ఐయోవాలో కమలాహ్యారిస్ దూసుకుపోతున్నారని సెల్జెర్ అండ్ కో, డెస్-మోయిన్స్ మీడియా కామ్ సర్వేలు స్పష్టం చేశాయి. ఇక్కడ కమలకు 47%.. ట్రంప్‌నకు 44% ఓట్లు దక్కుతాయని ఈ సర్వేలు వెల్లడించాయి.

మ్యాజిక్ ఫిగర్ దక్కకుంటే..?

538 స్థానాలకు గాను.. మ్యాజిక్ ఫిగర్– 270 సీట్లు సాధించిన వారే అమెరికా అధ్యక్ష పదవిని చేజిక్కించుకుంటారు. అయితే.. ఇరువురు అభ్యర్థుల్లో ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ దక్కకుంటే..? అమెరికా ఎన్నికల్లో ఇలా జరగడం చాలా అరుదు. 1824లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. దిగువ సభ(హౌస్ ఆఫ్ రిప్రెజెంటేటివ్స్) అధ్యక్షుడిని ఎన్నుకుంటుంది. ఎగువ సభ(సెనేట్)కు ఈ ఎన్నికతో సంబంధం ఉండదు. అయితే.. ఉపాధ్యక్షుడు/ఉపాధ్యక్షురాలిని సెనేట్ ఎన్నుకుంటుంది. దిగువ సభలో అధ్యక్ష ఎన్నికకు 26 రాష్ట్రాల ప్రతినిధుల మద్దతు ఉండాలి. 1924లో సంఖ్యాపరంగా ఆండ్రూ జాక్సన్‌కు అధిక స్థానాలు దక్కినా.. ఆయన ప్రత్యర్థి జాన్ క్విన్సీ ఆడమ్స్‌ను దిగువ సభ ఎన్నుకుంది.



హోరాహోరీ ఇలా..

రాష్ట్రం	ట్రంప్	కమల
అరిజోనా	49.1%	46.5%
విస్కాన్సిన్	48.2%	47.4%
జార్జియా	48.2%	47.1%
మిషిగాన్	47.9%	47.1%
నెవడా	47.9%	47.3%
పెన్సిల్వేనియా	47.9%	47.7%
నార్త్‌కరోలినా	48.4%	47.2%

ట్రంప్.. బెటర్ చాయిస్: నిక్కీ హేలి

భారతీయ అమెరికన్, ఐక్య రాజ్య సమితి(ఐరాస)లో అమెరికా మాజీ ప్రతినిధి నిక్కీ హేలి ట్రంప్ బెటర్ చాయిస్ అంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో ఆదివారం ఓ వ్యాసం రాశారు. "నేను ట్రంప్‌తో ఎన్నడూ 100% ఏకీభవించలేదు. అయితే.. కొన్ని సార్లు ఆయన విధానాలతో ఏకీభవించాను. కానీ, కమలా హ్యారిస్‌తో నేను 100% విభేదిస్తాను" అని అందులో పేర్కొన్నారు. ట్రంప్ వల్ల అమెరికాకు మేలు జరుగుతుందని, తటస్థ ఓటర్లు ఈ విషయాన్ని గుర్తించి, ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. కాగా, కమలకు మద్దతుగా వస్తున్న ఓ యాడ్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఇది మహిళా ఓటర్లు స్వతంత్రంగా ఓటుహక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో చిత్రీకరించినా.. ట్రంప్ మద్దతుదారులు దీనిపై విమర్శలు చేస్తున్నారు.


ఫలితాలు ఎప్పుడు?

మంగళవారం(5వ తేదీ) ఎన్నికలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియగానే.. కౌంటింగ్ ప్రారంభమవుతుంది. భారత్ మాదిరిగా అమెరికాలో దేశమంతటికీ ఒకే ఎన్నికల సంఘం ఉండదు. అమెరికాలో.. సమాఖ్య వ్యవస్థలో భాగంగా ప్రతి రాష్ట్రానికి ఎన్నికల ఏజెన్సీలుంటాయి. ఆ ఏజెన్సీలే రాష్ట్రాల వారీగా ఎన్నికలను నిర్వహిస్తాయి. అయితే.. కొన్ని సందర్భాల్లో మినహాయిస్తే.. చాలా వరకు ఫలితాలు ఎన్నికల రోజు అర్ధరాత్రిలోగా.. లేదంటే తర్వాతి రోజు మధ్యాహ్నం వరకు వస్తాయి. ఈ సారి మాత్రం ఈ నెల 11వ తేదీ వరకు పూర్తిస్థాయి ఫలితాలు వస్తాయని అంచనా. కొత్త అధ్యక్షుడు వచ్చే ఏడాది జనవరి 20న ప్రమాణ స్వీకారం చేస్తారు.

బ్యాలెట్‌లో బెంగాలీ

న్యూయార్క్ నగరంలో బ్యాలెట్‌పై ఇంగ్లిష్‌తోపాటు.. చైనీస్, స్పానిష్, కొరియన్, బెంగాలీ భాషలకు చోటు కల్పించారు. ఈ విషయాన్ని న్యూయార్క్ రాష్ట్ర ఎన్నికల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ రియాన్ వెల్లడించారు. గతంలో ఓ కోర్టు కేసు సందర్భంగా వచ్చిన తీర్పునకు అనుగుణంగా.. ఈ సారి బ్యాలెట్‌పై బెంగాలీకు చోటు దక్కింది. ఈ తరహా వెసులుబాటు న్యూయార్క్ నగరానికి మాత్రమే పరిమితం.

లోకం తీరు



ఐఎస్ఏ అధ్యక్ష స్థానంలో

మళ్లీ భారత్

రెండేళ్ల పదవీ కాలానికి ఎన్నిక

న్యూఢిల్లీ, నవంబరు 4: అంతర్జాతీయ సౌర విద్యుత్తు కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్-ఐఎస్ఏ) ప్రెసిడెంట్‌గా భారత్ మళ్లీ ఎన్నికయింది. 2026 వరకు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనుంది. ఉపాధ్యక్ష పదవికి ఫ్రాన్స్ ఎన్నికయింది. సోమవారం ఇక్కడ జరిగిన ఐఎస్ఏ ఏడో జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ విషయాన్ని ప్రకటించారు. సౌర విద్యుత్తు రంగానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి కారణంగానే ఈ గుర్తింపు సాధ్యమయిందని తెలిపారు. స్టాండింగ్ కమిటీకి చెందిన ఎనిమిది వైస్‌ప్రెసిడెంట్ స్థానాలు కూడా భర్తీ అయ్యాయి. ఆఫ్రికా ప్రాంతం నుంచి వైస్ ప్రెసిడెంట్లుగా ఘనా, సీషెల్స్ ఎన్నిక కాగా, వాటికి సహకరించే వైస్ చైర్స్ దేశాలుగా దక్షిణ సూడాన్, కామరూన్ దేశాలు ఎన్నికయ్యాయి. ఆసియా-పసిఫిక్ ప్రాంతం నుంచి ఆస్ట్రేలియా, శ్రీలంక వైస్ ప్రెసిడెంట్లుగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, పపువా న్యూ గినియా వైస్ చైర్స్‌గా ఎన్నికయ్యాయి. యూరోప్ ప్రాంతం నుంచి గ్రీస్, నార్వే వైస్‌ప్రెసిడెంట్లుగా, జర్మనీ, ఇటలీలు వైస్ చైర్స్‌గా; దక్షిణ అమెరికా, కరేబియన్ ప్రాంతం నుంచి గ్రెనెడా, సురినామ్ వైస్ ప్రెసిడెంట్లుగా, జమైకా, హైతీలు వైస్ చైర్స్‌గా ఎన్నికయ్యాయి. ఐఎస్ఏ డైరెక్టర్ జనరల్‌గా ఆశీష్ ఖన్నా ఎన్నికయ్యారు. ప్రస్తుత డైరెక్టర్ జనరల్ అజయ్ మాథుర్ వచ్చే ఫిబ్రవరిలో పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

కెనడాలో ఆలయంపై దాడి

మరోసారి రెచ్చిపోయిన ఖలిస్థానీలు.. కాన్సులర్ క్యాంపు వద్దా విధ్వంసం

- ఒక్కరినీ అరెస్టు చేయని పోలీసులు
- తీవ్రంగా నిరసన తెలిపిన భారత్
- ఇది పిరికిపందల చర్య: మోదీ



కాన్సులర్ క్యాంపు వద్ద ఖలిస్థానీల దాడి

ఒట్టావా/న్యూఢిల్లీ, నవంబరు 4: కెనడాలో ఖలిస్థానీలు మరోసారి హిందువుల ఆలయంపై దాడికి తెగబడ్డారు. టొరొంటోకు సమీపంలోని బ్రాంప్టన్ నగరంలో ఉన్న హిందూ సభ మందిరం వద్ద ఆదివారం విధ్వంసం సృష్టించారు. ఆలయానికి వచ్చిన భక్తులపై దాడి చేశారు. భారతీయుల కోసం కాన్సులర్ సేవలు అందించేందుకు ఆలయ ఆవరణలో స్థానికుల సహకారంతో భారత హైకమిషనర్ కార్యాలయం నిర్వహిస్తున్న కాన్సులర్ క్యాంప్‌పైనా ఖలిస్థానీలు దాడి చేశారు. అయితే, ఆ క్యాంపు వద్ద నియమించిన పోలీసులు ఇప్పటి వరకూ నిందితులెవరినీ గుర్తించలేదు. ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిందితులు ఖలిస్థానీ జెండాలతో అక్కడికి రావడం, భారత జెండాలు పట్టుకున్నవారితో ఘర్షణకు దిగడం ఆ వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. ముష్టిఘాతాలు కురిపించడం, కొందరి చేతుల్లో కర్రలున్న దృశ్యాలు కూడా వీడియోల్లో కనిపించాయి. దీనిపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలనే డిమాండ్‌లు వెల్లువెత్తుతున్నాయి. ఘటనపై తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తూ ఒట్టావాలోని భారత హై కమిషనర్ కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కాన్సులర్ క్యాంప్‌నకు హాజరైన దరఖాస్తుదారుల భద్రతపైనా తాము ఆందోళన చెందామని ఆ ప్రకటనలో పేర్కొంది. భారత వ్యతిరేక శక్తులు విధ్వంసం సృష్టించినప్పటికీ ఆ క్యాంపులో వెయ్యి మందికి లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేశామని తెలిపింది. దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది కెనడాలోని భారత దౌత్యవేత్తలను భయపెట్టడానికి పిరికిపందలు చేసిన ప్రయత్నమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. 'భారత సంకల్పాన్ని ఇలాంటి హింసాత్మక చర్యలు బలహీనపరచలేవు. కెనడా ప్రభుత్వం న్యాయం చేస్తుందని, చట్ట పాలనను అమలు చేస్తుందని మేం ఆశిస్తున్నాం' అని 'ఎక్స్'లో మోదీ పోస్టు చేశారు. అది తీవ్రవాదులు, వేర్పాటువాదులు చేసిన దాడిగా భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ అభివర్ణించారు. 'ఇలాంటి ఘటనలు జరుగకుండా అన్ని ప్రార్థనాలయాలకూ రక్షణ కల్పించాలని కెనడా ప్రభుత్వానికి మేం పిలుపునిస్తున్నాం. హింసకు పాల్పడినవారిని ప్రాసిక్యూట్ చేస్తారని కూడా మేం ఆశిస్తున్నాం. కెనడాలోని భారతీయుల భద్రత విషయంలో మేం తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం' అని జైశ్వాల్ పేర్కొన్నారు. ఘటనను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ప్రతిపక్ష నేత పియేరీ పొలివ్రే కూడా ఖండించారు. ఈ దాడి ఆమోదయోగ్యం కాదని 'ఎక్స్'లో ట్రూడో పేర్కొన్నారు. కాగా, కెనడాలో ఖలిస్థానీ తీవ్రవాదుల ముప్పు పెరుగుతోందని ట్రూడోకు చెందిన లిబరల్ పార్టీ ఎంపీ చంద్ర ఆర్య 'ఎక్స్'లో పేర్కొన్నారు. కెనడాలోని రాజకీయ, చట్ట వ్యవస్థలను కూడా ఖలిస్థానీ తీవ్రవాదులు ప్రభావితం చేస్తున్నారని నిందించారు. 'ఈరోజు ఖలిస్థానీ తీవ్రవాదులు రెడ్‌లైన్‌ను కూడా దాటేశారు' అని ఆక్షేపించారు. ఘటనను అంటారియో సిక్స్ అండ్ గురుద్వారా కౌన్సిల్ కూడా ఖండించింది. ఘటనపై విచారణ జరపాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది.

భక్తులపై పోలీసుల దాడి వీడియో వైరల్..

కెనడాలో హిందూ భక్తులపై కెనడా పోలీసులు దాడి చేసిన వీడియోను కెనడా జర్నలిస్టు ఒకరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆలయానికి వెళ్తున్న హిందువులపై పోలీసులు దాడి చేయడం ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. భక్తుల్లో చాలామంది చేతుల్లో భారత జెండా ఉంది. దీపావళి రోజు ఆలయాలకు వెళ్తున్న భక్తులను ఖలిస్థానీలు వేధించడాన్ని నిరసిస్తూ హిందువులు ప్రదర్శన నిర్వహిస్తుండగా పోలీసులు దాడికి పాల్పడ్డారు. ఒక నిరసనకారుడిని ఒక పోలీసు అనేకసార్లు కొట్టిన దృశ్యాలు కూడా వీడియోలో ఉన్నాయి. 'అతను లాఠీతో కొడుతున్నాడు' అంటూ వీడియోను చిత్రీకరించిన మహిళ మాట్లాడటం, 'అతన్ని బయటికి తీసుకెళ్లండి' అని నిరసనకారులు చేసిన నినాదాలు వీడియోలో వినిపిస్తున్నాయి.

బంగ్లా చొరబాటుదారులకు

జేఎంఎం, కాంగ్రెస్ మద్దతు

ఓట్ల కోసం జార్ఖండ్‌వ్యాప్తంగా వారికి నివాసం కల్పిస్తున్నారు

- ఇలాగైతే ఆదివాసీలు తగ్గిపోతారు
- ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఫైర్



గర్వా, నవంబరు 4: జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వం రాష్ట్రమంతటా బంగ్లాదేశ్ చొరబాటుదారులకు నివాసం కల్పిస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. వారికి పాలక కూటమి జేఎంఎం-కాంగ్రెస్-ఆర్‌జేడీ పార్టీలు అండగా ఉన్నాయన్నారు. బుజ్జగింపు రాజకీయాలే వాటి ప్రధాన ఎజెండా మారిందని ధ్వజమెత్తారు, ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన గర్వా, చాయిబాసాల్లో జరిగిన ర్యాలీల్లో ప్రసంగించారు. 'బుజ్జగింపులు పతాకస్థాయికి చేరాయి. ఈ మూడు పార్టీలూ సామాజిక సామరస్యాన్ని నాశనం చేస్తున్నాయి. చొరబాటుదార్ల ఓట్ల కోసం వారికి రాష్ట్రవ్యాప్తంగా నివాసం కల్పిస్తున్నారు. పాఠశాలల్లో సరస్వతీ వందనాన్నే అనుమతించడం లేదంటే ఎంత ప్రమాదకర పరిస్థితో ఊహించండి. పండుగల సందర్భంగా రాళ్ల దాడులు చేస్తున్నారు. ఇది చూపి అమ్మవారి వేడుకలు ఆపేస్తున్నారు. కర్ఫ్యూ విధిస్తున్నారు. చొరబాట్ల వ్యవహారం కోర్టుకెళ్తే.. అధికార యంత్రాంగం అదేమీ లేదని చెబుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలోకి కూడా వారు చొరబడ్డారు. ప్రజల రోటీ, బేటీ, మాటీలను తీసుకెళ్లిపోతున్నారు. ఈ మూడు పార్టీల చెడు విధానాల వల్ల ఆదివాసీ జనాభా తగ్గిపోతుంది. నకిలీ సర్టిఫికెట్లతో చొరబాటుదారులకు అవకాశాలిస్తూ గిరిజనుల గుర్తింపు, గౌరవం, ఉనికినే హేమంత్ సర్కారు ప్రశ్నార్థకం చేసింది. చొరబాటుదార్లు మీ బిడ్డలను తీసుకెళ్లిపోతున్నారు. భూములు కబ్జా చేస్తున్నారు. మీ ఆహారాన్ని తస్కరిస్తున్నారు. జార్ఖండ్ జనసంఖ్యలో మార్పులకు పెద్దఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి. బీజేపీకి అధికారమిస్తే.. చొరబాటుదార్లు కబ్జాచేసిన భూమిని తిరిగి తీసుకునేందుకు కఠిన చట్టం తెస్తాం' అని ప్రకటించారు. గిరిజనుల రిజర్వేషన్‌ను కాంగ్రెస్ గుంజుకుంటుందని హెచ్చరించారు. దానిని తన ఓటుబ్యాంకైన ముస్లింలకు ఇస్తుందని చెప్పారు. గిరిజనులను గౌరవించే పార్టీ బీజేపీయేనని.. పలు రాష్ట్రాల్లో సీఎంలు, గవర్నర్లుగా నియమించిందని గుర్తుచేశారు. పార్టీ అధ్యక్ష పదవి గానీ, రాష్ట్రపతి పదవి గానీ కాంగ్రెస్ ఎప్పుడూ గిరిజనులకు ఇవ్వలేదని.. రాష్ట్రపతిగా తొలి గిరిజన మహిళ ఎన్నికనూ వ్యతిరేకించిందని చెప్పారు. ఆదివాసీల ముద్దుబిడ్డయిన మాజీ సీఎం చంపై సోరెన్‌ను అవమానించారని.. తనకు బెయిల్ రాగానే హేమంత్ ఆయన్ను ముఖ్యమంత్రిగా తొలగించి తాను గద్దెనెక్కారని, హేమంత్‌కు తన కుటుంబం కంటే ఎవరూ ఎక్కువ కాదన్నారు.

14 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల తేదీ మార్పు

ఉత్తరప్రదేశ్(9), పంజాబ్(4), కేరళ(1) రాష్ట్రాల్లోని 14 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల పోలింగ్ తేదీ మారింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఆయా స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరగాల్సి ఉండగా.. వివిధ పండుగల నేపథ్యంలో 20వ తేదీకి మార్పు చేసినట్లు ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. అఖండ్ పథ్, కల్పతి రస్తోల్, కార్తీక పూర్ణిమ పండుగల నేపథ్యంలో పోలింగ్ తేదీని మార్చాలంటూ కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఆర్ఎల్‌డీ సహా పలు పార్టీలు అంతకుముందు ఈసీని కోరాయి.

ఫిర్యాదుల నేపథ్యంలో మహారాష్ట్ర డీజీపీ బదిలీ

ఎన్నికల సంఘం ఆదేశాలు.. పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాల ఆరోపణ

ముంబయి, నవంబరు 4: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మహారాష్ట్ర డీజీపీ రష్మీ శుక్లాను బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఆమె స్థానంలో మరొకరని నియమించేందుకు ముగ్గురు అత్యంత సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను మంగళవారంలోగా పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుజాత సౌనిక్‌కు సూచించింది. అధికార మహాయుతి కూటమికి అనుకూలంగా రష్మీ వ్యవహరిస్తున్నారని విపక్షాలు ఆరోపించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకొంది. ఆమె ప్రత్యక్షంగానే బీజేపీ పక్షాన పనిచేస్తున్నారని, విపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసి ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు సమాచారం అందిస్తున్నారని శివసేన (ఠాక్రే) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఝార్ఖండ్ డీజీపీని బదిలీ చేసినట్టుగానే ఆమెను కూడా మార్చాలని డిమాండు చేశారు. 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి అయిన రష్మీ శుక్లా మహారాష్ట్ర తొలి మహిళా డీజీపీగా గుర్తింపు పొందారు.



ఉత్తరాఖండ్‌లో ఘోరం

200 మీటర్ల లోయలో పడిన బస్సు

- 36 మంది దుర్మరణం.. 24 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం

మర్చులా (ఉత్తరాఖండ్), నవంబరు 4: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. 60 మందితో ప్రయాణిస్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి 200 మీటర్ల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 36 మంది దుర్మరణం పాలవగా.. మిగిలిన వారంతా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో చిన్నారులు, మహిళలు ఉన్నారు. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో సోమవారం ఉదయం 8 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గర్వాల్ ప్రాంతంలోని పౌరి నుంచి ఆదివారం రాత్రి ఈ బస్సు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుమావున్‌లోని రామ్‌నగర్‌కు బయల్దేరింది. మరో 35 కి.మీ. ప్రయాణిస్తే గమ్యం చేరుకుంటుందనగా.. అల్మోరాలోని మర్చులా ప్రాంతంలో అదుపుతప్పి 200 మీటర్ల లోయలో పడిపోయింది. దీంతో ప్రయాణికులను బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈ బస్సు సీటింగ్ సామర్థ్యం 43 మందే. కానీ.. ప్రమాద సమయంలో దీనిలో 60 మంది ఉన్నారు. ఓవర్‌లోడ్ కారణంగానే బస్సు అదుపుతప్పి లోయలో పడి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. క్షతగాత్రులను రామ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నలుగురిలో ముగ్గురిని హెలికాప్టర్ ద్వారా రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించగా.. ఒకరిని హల్ద్వానీలోని సుశీలా తివారీ ఆస్పత్రికి పంపినట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో మృతులు, క్షతగాత్రులను గుర్తించాల్సి ఉందని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం ప్రకటించిన ప్రధాని మోదీ

ఈ ప్రమాద వార్త తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ.. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.4 లక్షలు, గాయపడిన వారికి రూ.1 లక్ష చొప్పున అందిస్తామని ప్రకటించారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఈ బస్సులో ఉన్నవారిలో ఎక్కువ మంది దీపావళికి స్వగ్రామాలకు చేరుకుని.. సెలవులు ముగియగానే తిరిగి విధుల్లో చేరేందుకు ఆదివారం రాత్రి బస్సు ఎక్కారు.

త్వరలో 'రైల్వే సూపర్ యాప్' ఆవిష్కరణ

- ఇక సేవలన్నీ ఒకే చోట అందుబాటులో...

న్యూఢిల్లీ, నవంబరు 4: రైల్వే సేవలన్నీ ఒకే చోట లభ్యమయ్యే 'సూపర్ యాప్' త్వరలో అందుబాటులోకి రానుంది. టిక్కెట్ల బుకింగ్, రిజర్వేషన్లు, ప్లాట్‌ఫారం టిక్కెట్లు, కేటరింగ్.. తదితర సేవలన్నింటినీ సమన్వయపరిచి ఒకే యాప్ రూపంలో ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. 'క్రిస్' సంస్థ ఈ నూతన యాప్ రూపకల్పనలో నిమగ్నమయింది. ఈ సమగ్ర మొబైల్ అప్లికేషన్ వచ్చే నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ల ద్వారా ప్రయాణికులకు సేవలు అందుతున్నాయి. ఒక్కో సేవకు ఒక్కో అప్లికేషన్ ఉండడంతో వాటన్నింటినీ సమన్వయపరిచి సమగ్రమైన యాప్‌ను రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌తో 2023-24లో ఐఆర్‌సీటీసీ రూ.4,270.18 కోట్ల రెవెన్యూను ఆర్జించగా అందులో రూ.1,111.26 కోట్లు లాభంగా మిగిలింది. 45.30 కోట్ల టికెట్ బుకింగ్‌లు జరిగాయి.

'అంబటి' అత్యుత్సాహం

▸ నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో జగన్ ఫొటో బ్యాడ్జీతో ఆలయ ప్రవేశం


ఛాతీపై జగన్ బ్యాడ్జీతో తిరుమల ఆలయం ముందు అంబటి రాంబాబు

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తిరుమలలో అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఫొటో, నవరత్నాల లోగోతో కూడిన బ్యాడ్జీని ధరించి శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే వారు రాజకీయ పార్టీల గుర్తులు, వ్యక్తుల ఫొటోలు, జెండాలు, కరపత్రాలతో తిరుమలకు రాకూడదు. కానీ, అలిపిరి చెక్‌పాయింట్‌లో సిబ్బందిని ఏమార్చి అంబటి కొండపైకి చేరుకున్నారు.

టీటీడీకి ఫిర్యాదు చేస్తా: సీఎం రమేష్

అంబటి తీరుపై శ్రీవారి దర్శనానికి వచ్చిన సెంట్రల్ రైల్వే స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు సీఎం రమేష్ మాట్లాడుతూ.. అంబటి రాంబాబు భగవంతుడిపై గౌరవంలేని ఇలాంటి వారిని తిరుమల కొండపైకే రానియ్యకుండా చేయాలన్నారు. అంబటి చొక్కాకు ధరించిన ఆ బ్యాడ్జీని ఫొటో తీసే ప్రయత్నం చేయగా కండువా కప్పి దాచుకున్నాడన్నారు. ఈ అంశంపై టీటీడీకి ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

అంబటికి బుద్ధి, జ్ఞానం లేదు: భానుప్రకాష్

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత అంబటి రాంబాబుకు బుద్ధీ జ్ఞానం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమితుడైన భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. పుణ్యక్షేత్రమైన తిరుమల శ్రీవారిని నియమాలను ఉల్లంఘించడం మహాపాపమన్నారు. జగన్మోహన్ రెడ్డి బొమ్మ ఉన్న చొక్కా వేసుకొని ఆలయంలోకి వెళ్లి నియమాలు ఉల్లంఘించినందుకు తక్షణమే అంబటిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం గుంటూరుకు వచ్చిన భానుప్రకాష్‌రెడ్డి బీజేపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆంబోతుల రాంబాబుకు జగన్మోహన్ రెడ్డి అంటే అంత ఇష్టంగా ఉంటే తాడేపల్లి కోటకు వెళ్లి ప్రదక్షిణ చేసి డాన్స్ చేసుకోమని హితవు పలికారు.


శ్రీశైలంలోని పుష్కరిణి వద్ద లక్ష దీపోత్సవం

శ్రీగిరిలో లక్షదీపోత్సవం

శ్రీశైలం, నవంబరు 4 ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒక్కటైన శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని క్షేత్రానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరణికి దశవిధ హారతులు కార్యక్రమాలను దేవస్థానం వైభవంగా నిర్వహించింది. సోమవారం రాత్రి స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణ చేసి ఊరేగింపుగా తీసుకొచ్చారు.

శారదాపీఠం భూ కేటాయింపులు రద్దు

▸ 15 ఎకరాలు వెనక్కి తీసుకోవాలని సర్కారు ఉత్తర్వులు
▸ నేరుగా విశాఖ కలెక్టర్‌కు రెవెన్యూ శాఖ ఆదేశం
▸ ఆ భూముల విలువ 225 కోట్లకు పైనే
▸ జగన్ ప్రభుత్వంలో 15 లక్షలకు కేటాయింపు
▸ అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ గురువు, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందకు కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. జగన్ ప్రభుత్వం 2021లో శారదాపీఠానికి చేసిన భూ కేటాయింపులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లా భీమిలి మండలం కొత్తవలసలో శారదాపీఠానికి 15 ఎకరాల భూ కేటాయింపు ఉత్తర్వును రద్దు చేస్తున్నట్లుగా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూ కేటాయింపు రద్దు ఉత్తర్వును నేరుగా విశాఖ కలెక్టర్‌కు పంపించారు. శారదా పీఠం వద్ద ఉన్న ఆ 15 ఎకరాల భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని విశాఖ కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో 225 కోట్లపైమాటే. అయితే నాటి జగన్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా కారుచౌకగా 15 లక్షల రూపాయలకే కట్టబెట్టింది. దీనిపై గత నెలలో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. ఈ భూ కేటాయింపులు రద్దు చేయాలన్న రెవెన్యూ శాఖ ప్రతిపాదనను ఇటీవల మంత్రివర్గం చర్చించి ఆమోదించింది. ఇప్పుడు తాజాగా భూ కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేస్తూ భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రజాప్రయోజనాలు, హేతుబద్ధత, న్యాయ సమ్మతమైన కారణాలు లేకుండా భూ కేటాయింపులు చేశారని, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు విధానానికి వ్యతిరేకంగా లాభార్జనకు వీలుగా ఆ భూములను వినియోగించుకోవచ్చన్న ఉత్తర్వులు ఇవ్వడం అనైతికం, అక్రమం అని, అందుకే భూమి కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ తన ఆదేశాల్లో పేర్కొంది.

లోగుట్టు విప్పిన రెవెన్యూ శాఖ

శారదాపీఠానికి భూమి కావాలన్న వినతిని ఆంధ్రప్రదేశ్ భూమి నిర్వహణా వ్యవస్థ (ఏపీఎల్ఎమ్ఏ) ముందుకు దేవాదాయ శాఖ 2021లో తీసుకొచ్చింది. శారదాపీఠం పరిధిలో సంస్కృత పాఠశాల ఏర్పాటుకు భూమిని కోరారు. ఈ వినతిపై నాటి రెవెన్యూ శాఖ విశాఖ కలెక్టర్‌ను నివేదిక కోరింది. ఎకరా రిజిస్ట్రేషన్ విలువ సగటున 1.89 కోట్లు. శారదాపీఠానికి భూమిని ఎకరా 1.89 కోట్ల చొప్పున కేటాయించాలని నాటి విశాఖ కలెక్టర్ రెవెన్యూ శాఖకు నివేదించారు. అంటే... 15 ఎకరాల భూమిని 28.35 కోట్ల ధరకు ఇవ్వొచ్చు అని కలెక్టర్ ప్రతిపాదించారు.

ఈ ప్రతిపాదన సీసీఎల్ఏ నేతృత్వంలోని ఏపీఎల్ఎమ్‌కు వచ్చాక ఎకరా భూమిని లక్షకు ఇస్తే సరిపోతుందని తీర్మానించారు. 15 లక్షల రూపాయలకు 15 ఎకరాల భూమిని ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు మంత్రివర్గానికి ఫైలు పంపించి ఆమోదం తీసుకొని 2021 నవంబరు 29న జీఓ 343 జారీ చేశారు అప్పటి రెవెన్యూ కార్యదర్శి.

ప్రభుత్వ లేదా ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు భూములు కేటాయించాలన్న ప్రతిపాదనలు వస్తే విధిగా ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు విధానం (జీఓ 571)ని ప్రామాణికంగా తీసుకోవాలి. భూ కేటాయింపు అనేది కచ్చితంగా ప్రజాప్రయోజనంతో ముడిపడినదై, శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా ఉండాలని జీఓ 571లోని 3(ఏ) చెబుతోంది. అయితే, భూ కేటాయింపు ఉత్తర్వు (343)లో ప్రజాప్రయోజనం అన్న పదమే చేర్చలేదు. కాబట్టి ఇది అన్యాయమైన, అక్రమమైన భూ కేటాయింపు అని రెవెన్యూ శాఖ పేర్కొంది.

జీఓ 343లో కేటాయించిన సర్వే నంబర్లలోని భూమి కాకుండా మరో సర్వే నంబర్లలోని భూమిని పీఠానికి ఇచ్చారు. ఈ మేరకు జీఓ 64ను 2022 ఫిబ్రవరి 8న నాటి రెవెన్యూ కార్యదర్శి ఇచ్చారు. 64 జీఓను శారదాపీఠం ఉత్తరాధికారి పేరిట ఇచ్చారు. అంటే.. ఓ ప్రైవేటు వ్యక్తికి భూమిని కేటాయించినట్లుగానే పరిగణించాలని రెవెన్యూ శాఖ చెబుతోంది.

గత ఏడాది నవంబరులో పీఠం నుంచి మరో లేఖ వచ్చింది. తమకు కేటాయించిన భూమిని ఆదాయార్జనకు కూడా వినియోగించుకునేలా అనుమతి ఇవ్వాలన్నది ఆ లేఖ సారాంశం. అందులోనే బోర్డింగ్ హౌజ్, ఆశ్రమం, ఇతర నిర్మాణాలు చేపట్టుకుంటామని అనుమతి కోరారు. ఈ ఏడాది జనవరి 19న విశాఖ కలెక్టర్‌తో ప్రతిపాదన తెప్పించుకొని 20వ తేదీన ఏపీఎల్ఎమ్ఏలో ఆమోదించారు. ఫిబ్రవరి 6వ తేదీన జీఓ 47 జారీ చేశారు.

తొలుత 2021లో ఇచ్చిన జీఓ 343లో శారదాపీఠం పేరిట భూమిని కేటాయించారు. ఆ తర్వాత సవరించిన జీఓ 64లో శారదాపీఠం ఉత్తరాధికారి పేరిట భూమిని కేటాయిస్తున్నట్లుగా మార్చారు. ఇది నిబంధనలను ఉల్లంఘించడమే.

ఆదాయార్జనకు అనుమతి ఇవ్వడం, ఇంకా ఉత్తరాధికారి పేరిట భూములు కేటాయించడం అనేది ఆంధ్రప్రదేశ్ భూ కేటాయింపు విధానంలోని సెక్షన్ 3(ఏ)కు పూర్తి విరుద్ధమైనది. ఆ క్లాజు ప్రకారం భూ కేటాయింపు జీఓలేవీ చెల్లవు.

భూ కేటాయింపు విధానం ప్రకారం ప్రజా ప్రయోజనాలున్నప్పుడే భూములను తక్కువ ధరకు ప్రభుత్వ విచక్షణ మేరకు కేటాయించవచ్చు. అలా కాకుండా ప్రజాప్రయోజనమే లేని ఈ కేటాయింపులో కలెక్టర్ సిఫారసును బుట్టదాఖలు చేయడం అన్యాయమైనదిగా, అక్రమమైనదిగా పరిగణిస్తున్నారు.

భూ కేటాయింపు పాలసీలో సెక్షన్ 3(ఏ)లో పేర్కొన్నట్లుగా పీఠానికి ఇచ్చిన భూమి శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా లేదు. కాబట్టి భూకేటాయింపును రద్దు చేయాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈమేరకు మంత్రివర్గం ఆమోదించింది.

టెట్‌లో 1,87,276 మందికి అర్హత

▸ ఉత్తీర్ణత శాతం 50.79%.. ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షలో 1,87,256 మంది అర్హత సాధించారు. పరీక్షలు రాసిన వారిలో 50.79శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అక్టోబరులో జరిగిన టెట్‌కు 4,27,300 మంది దరఖాస్తు చేసుకున్నారు. 3,68,661 మంది పరీక్షలు రాశారు. ఫలితాలను మంత్రి లోకేశ్ సోమవారం ఎక్స్ ద్వారా విడుదల చేశారు. పేపర్-1ఏ ఎస్జీటీ తెలుగు, మైనర్ మీడియాలో 1,04,785 (65.48శాతం), పేపర్-1బి ఎస్జీటీ స్పెషల్ స్కూల్స్‌లో 767 (35.3శాతం), పేపర్-2ఏ స్కూల్ అసిస్టెంట్ అన్ని భాషలు విభాగంలో 22,080 (39.58శాతం), పేపర్-2ఏ స్కూల్ అసిస్టెంట్ గణితం, సైన్స్‌లో 33,525 (37.97శాతం), పేపర్-2ఏ స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 24,472 (40.49శాతం), పేపర్-2బీ స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ స్కూల్స్‌లో 1627 (83.09శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలను పాఠశాల విద్య కమిషనర్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. 150 మార్కులకు జరిగిన టెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత మార్కులు ఓసీలకు 60శాతం, బీసీలకు 50శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు 40శాతంగా నిర్ణయించారు. టెట్‌లో అర్హత సాధించిన వారికి డీఎస్సీలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

జిల్లాకో పశువుల హాస్టల్

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పశువుల హాస్టళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అంతరిస్తున్న పశుసంపదను కాపాడేందుకు ఈమేరకు చర్యలు తీసుకోనుంది. గ్రామాల్లో పశువులకు మేత వేసి పోషించలేని స్థితిలో ఉన్న వారికి ఈ హాస్టల్ ఉపయోగపడుతుందంటున్నారు. పలు గ్రామాల్లో పశువులకు ఆదరణ కరువై రోడ్లపై తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అలాంటి పశువులను ఈ హాస్టళ్లలో చేర్చుతారు. ప్రతి జిల్లాకు ఒక హాస్టల్ చొప్పున మొదటగా 26 జిల్లాల్లో 26 హాస్టళ్లను నిర్మించాలని నిర్ణయించారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఒక్కో హాస్టల్ నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలిచ్చింది.

డిసెంబరు 5న గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి డిసెంబరు 5న పోలింగ్ జరగనుంది. ఈ మేరకు సోమవారం ఈ నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. '2024 నవంబరు 11న నోటిఫికేషన్ విడుదల. ఈ నియోజకవర్గంలో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 19వ తేదీన పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. డిసెంబరు 5న పోలింగ్ ప్రక్రియ సాగుతుంది. డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు. డిసెంబరు 12తో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది' అని కేంద్ర ఎన్నికల సంఘం వివరించింది.

28న విజయనగరం స్థానిక ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 28న పోలింగ్ జరగనుంది. ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటుపడడంతో జరుగుతున్న ఈ ఉప ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నామినేషన్ల స్వీకరణకు నవంబరు 11 ఆఖరు తేదీ. 12న నామినేషన్ల పరిశీలన, 14న ఉపసంహరణకు తుది గడువుగా పేర్కొంది. నవంబరు 28న, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. డిసెంబరు 1న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

నీటి సంరక్షణతో కరువుకు చెక్!

కరువు మండలాలపై ఉపముఖ్యమంత్రి పవన్ ప్రత్యేక దృష్టి

▸ ఉపాధి నిధులతో 10 రకాల నీటి సంరక్షణ పనులు చేపట్టేందుకు చర్యలు
▸ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు



అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 54 కరువు మండలాలపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి, ప్రజలు వలస పోకుండా నివారించాలని అధికారులను ఆదేశించారు. వర్షాభావం ఉన్న ఆయా ప్రాంతాల్లో ఉపాధి నిధులతో నీటి సంరక్షణ పనులు పనులు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక బృందాలు పర్యటించి.. కరువును అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాలన్నారు. దీంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గత ఐదేళ్లలో వైసీపీ సర్కార్ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందనే వాదనలు వినిపిస్తున్నాయి. నీటి వనరులను సమకూర్చే పనులు చేపట్టకపోవడం, చేసిన పనులే మళ్లీ చేపట్టడంతో నిధులు నిర్వీర్యమైపోయాయని అధికారులు చెబుతున్నారు.

ఇంకుడు గుంతలు, కందకాలు..

వర్షాలు పడకపోవడంతో శ్రీసత్యసాయి, అన్నమయ్య, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని 54 మండలాలను తీవ్ర దు ర్భిక్ష ప్రాంతాలుగా ప్రభుత్వం పేర్కొంది. కమిషనర్ కృష్ణతేజ ఆయా జిల్లాల్లో చేపట్టాల్సిన పనులపై మార్గదర్శకాలు జారీచేశారు. పంటకుంటలు, అమృత్ సరోవర్ పనులు, కాంటూర్ కందకాలు, నీటి నిల్వ కందకాలు, ఇంకుడు గుంతలు, అంతర్గత కందకాలు, రింగ్ కందకాలు, భూగర్భజల సంరక్షణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి గ్రామా ల్లో ఒక రోజు ముందు దండోరా వేయించి గ్రామసభలో పనులను ఆమోదించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ఉపాధి పనుల్లో పాల్గొనేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కరువు నివారణ చర్యలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఉపాధి హామీ డైరెక్టర్ షణ్ముక్ కుమార్ నాయకత్వంలో జాయింట్ కమిషనర్ జె.సునీత, స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బాలాజీ, డీఎల్‌డీఓ అనూరాధను సభ్యులుగా నియమించారు.

నీటి సంరక్షణ పథకాలపై దృష్టి

ప్రత్యేక నీటి సంరక్షణ పనులు చేపట్టి వీలైనంత త్వరగా కరువు నివారణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. పంటకుంటలు తవ్వి రైతుల పొలాల్లో, ప్రభుత్వ స్థలాల్లో భూగర్భ జల మట్టం పెరిగేలా చర్యలు తీసుకుంటారు. పశువుల కోసం తాగునీటి చెరువులను నిర్మిస్తారు. ప్రజల కోసం తాగునీటి చెరువును ఉపాధి నిధులతో చేపడతారు. ఊట చెరువులు, బోరుబావుల వద్ద నీటి రీచార్జ్ పిట్‌లు, ప్రభుత్వ భవనాల పైకప్పుపై పడిన వర్షపు నీటి సంరక్షణ, కందకాల నిర్మాణం, చెక్‌డ్యాం మరమ్మతులు, చెక్‌డ్యాంల నిర్మాణం, మంచి నీటి చెరువుల పునరుద్ధరణ, పశువుల చెరువుల పునరుద్ధరణ, వ్యక్తిగత భూముల్లో 25 రకాల పండ్ల తోటల పెంపకం, మునగ నర్సరీలు, పూలతోటలు, మల్బరీ తోటల పెంపకం, వ్యక్తిగత రైతుల భూముల్లో బహువార్షిక గడ్డి పెంపకం, వ్యక్తిగత సోక్‌పిట్‌ల నిర్మాణం, గ్రామ పంచాయతీ, ప్రభుత్వ స్థలాల్లో గ్రామ వనం, కాలువ గట్లపై, కొండ ప్రాంతాల్లో మొక్కల పెంపకం, రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని నిర్ణయించారు.

2రోజుల్లో 1.72 లక్షల మందికి శ్రీవారి దర్శనం

తిరుమల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గత రెండురోజుల్లో 1,72,565 మంది భక్తులు దర్శించుకున్నారు. వరుస సెలవుల నేపథ్యంలో భక్తులు భారీగా తిరుమలకు రావడంతో వీఐపీ బ్రేక్ దర్శనాలను కే వ లం స్వయంగా వచ్చే ప్రొటోకాల్ వీఐపీలకే కేటాయించారు. దీంతో అత్యధిక సంఖ్యలో సామాన్య భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. శనివారం 88,076 మంది, ఆదివారం 84,489 మంది శ్రీవారిని దర్శించుకున్నారు.

ఎకో టూరిజం పాలసీ ఖరారుకు కమిటీ

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎకో టూరిజం విధానాన్ని ఖరారు చేసేందుకు ఎకో టూరిజం వర్కింగ్ గ్రూప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి అటవీశాఖ అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియ పాండేను చైర్‌పర్సన్‌గా, అదనపు పీసీసీఎఫ్ రాహుల్‌పాండే, పర్యాటకశాఖ డైరెక్టర్ ఆమ్రపాలి, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధిశాఖ(పీఆర్‌అండ్‌ఆర్డీ) కమిషనర్ కృష్ణతేజ, పీఆర్‌అండ్‌ఆర్డీ ఈఎన్‌సీ బాలూనాయక్, అటవీశాఖ సహాయ కన్జర్వేటర్(ఏసీఎఫ్) ఎన్వీ శివరామప్రసాద్‌లను సభ్యులుగా నియమించింది.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో స్వర్ణాంధ్ర సాధన

▸ 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు కేంద్ర ప్రయోజిత పథకాలను అనుసంధానం చేసి, రాష్ట్రంలో పేదరిక నిర్మూలన ద్వారా స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తామని 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్ చెప్పారు. సోమవారం అమరావతి సచివాలయంలోని తన చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 20 సూత్రాలకు, నీతి ఆయోగ్ నిర్దేశించిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్వర్ణాంధ్ర సాధనకు సీఎం చంద్రబాబు నిర్దేశించిన 12 సూత్రాలను అనుసంధానం చేస్తామని చెప్పారు. ప్రధాని మోదీ సంకల్పం వికసిత భారత్, సీఎం చంద్రబాబు తలపెట్టిన వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని అమలు చేయడం ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రయోజిత పథకాల ద్వారా నిధులు, కేంద్ర పథకాల నిధులు మరిన్ని రాబట్టి, రాష్ట్ర వాటానిధులు సమకూర్చి, ప్రజలకు ప్రయోజనాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

కృష్ణా ప్రాజెక్టులపై.. ఆంధ్ర వ్యాజ్యం..

తెలంగాణ పిటిషన్‌తో జత

▸ సుప్రీంకోర్టు ఆదేశం.. ఎల్లుండి విచారణ!

న్యూఢిల్లీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా ప్రాజెక్టులపై తెలుగు రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లను కలిపే విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని.. తెలంగాణ పిటిషన్‌ను విచారిస్తున్న ధర్మాసనానికి బదిలీచేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి తెస్తూ 2021లో కేంద్రం గెజిట్ విడుదల చేసింది. విద్యుత్ కేంద్రాలను కూడా బోర్డు పరిధిలోకి తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం అదే ఏడాది జూలై 14న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బోర్డు అనుమతి లేకుండా తెలంగాణ తన పరిధిలోని ప్లాంట్లలో విద్యుదుత్పత్తి చేస్తోందని తెలిపింది. ఆ పిటిషన్‌పై విచారణ జరుగుతుండగానే.. కేంద్రం తెచ్చిన ఈ గెజిట్‌ను రద్దు చేయాలంటూ తెలంగాణ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సోమవారం ఈ రెండు పిటిషన్లు వేర్వేరు ధర్మాసనాల ముందు విచారణకు వచ్చాయి. తొలుత.. తెలంగాణ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. దీనిపై విస్తృత వాదనలు వినాల్సి ఉందంటూ విచారణను వాయిదా వేసింది. తర్వాత ఆంధ్రప్రదేశ్ పిటిషన్ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది జోక్యం చేసుకుని.. 'కేఆర్ఎంబీ పరిధికి సంబంధించిన అంశంపైనే తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ రోజు వాదనలు జరుగలేదు. విచారణ ఈ నెల 7కి వాయిదా పడింది' అని తెలిపారు. రెండు రాష్ట్రాల పిటిషన్లను కలిపే విచారిస్తే సరిపోతుందని కోర్టు అభిప్రాయపడింది. ఆంధ్రప్రదేశ్ పిటిషన్‌ను.. తెలంగాణ పిటిషన్‌ను విచారిస్తున్న ధర్మాసనానికి బదిలీ చేయాలని.. విషయాన్ని సీజేఐ దృష్టికి తీసుకెళ్లాలని రిజిస్ట్రీని ఆదేశించింది. రెండు పిటిషన్లు గురువారం మధ్యాహ్నం విచారణకు వచ్చే అవకాశముంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విజయ్ గెలిచేనా...?

సినీరంగం నుంచి రాజకీయరంగంలోకి ప్రవేశించిన మరో తమిళ నటుడు విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆదివారం నాటి కార్యవర్గ సమావేశంలో పాతికకుపైగా తీర్మానాలు చేసింది. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలోని భారతీయ జనతాపార్టీ, రాష్ట్రంలో స్టాలిన్ నేతృత్వంలోని ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకె) లక్ష్యంగా ఈ తీర్మానాలు ఉన్నాయి. జమిలి ఎన్నికల ఆలోచన ఉపసంహరించుకోవాలని, నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)నుంచి తమిళనాడు బయటకు రావాలని, అటు కేంద్రం, ఇటు రాష్ట్రం కూడా తమిళనాట కులగణన ఊసెత్తకపోవడం ఇత్యాదివి ఈ తీర్మానాల్లో ఉన్నాయి. కేంద్రం తెస్తున్న వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగానూ, రాష్ట్రంలో ద్విభాషా విధానమే ఉండాలనీ, హిందీకి రాష్ట్రంలో చోటులేదంటూ కూడా తీర్మానాలు జరిగాయి. అధికారంలోకి వచ్చేందుకు స్టాలిన్ అబద్ధపు హామీలు ఇచ్చారని, ప్రజలను మోసం చేశారని కూడా ఆ పార్టీ తప్పుబట్టింది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్టీ ఆరంభం నిర్ణయాన్ని ప్రకటించిన తరువాత, కొద్దినెలలపాటు వ్యవహారం వేగం పుంజుకోలేదు కానీ, ఇటీవల విజయ్ తన జోరుపెంచారు. వారం క్రితం పార్టీ ప్రారంభ మహాసభ లక్షలమందితో కిటకిటలాడిపోయింది. గ్లామర్ ఉన్న నటులకు అభిమానులతోపాటుగా ఆ పాటి జనం రాకపోరన్నమాట నిజమే కానీ ఆ సభను ఎంతో పకడ్బందీగా, క్రమశిక్షణతో నిర్వహించడం విశేషం. విజయ్‌లో మంచి వక్త ఉన్నాడని ఆ సభ రుజువుచేసింది. అనవసరపు పంచ్ డైలుగులు, అర్థంలేని ఆవేశపూరిత వ్యాఖ్యలు లేకుండా ఆకట్టుకొనే రీతిలో చక్కని ప్రసంగం చేశారు. బీజేపీని సైద్ధాంతిక శత్రువుగా, డీఎంకెని రాజకీయ ప్రత్యర్థిగా ప్రకటించారు. దానిని మతతత్వ ఫాసిస్టు పార్టీగా, దీనిని అవినీతిమయమైన కుటుంబపార్టీగా నిర్వచించారు. ద్రవిడ పదాన్ని అడ్డంపెట్టుకొని, ఈ కుటుంబపార్టీ రాష్ట్రప్రయోజనాల విషయంలో రాజీపడుతూ, కొందరితో లాలూచీకి వచ్చి రాజ్యాన్ని ఏలుకుంటోందని విజయ్ విమర్శలు చేశారు. కామరాజ్, అంబేడ్కర్, వేలు నాచ్చియార్ సహా తనకు ఎందరో ఆదర్శమని, సామాజికన్యాయం, మహిళా సాధికారత ఇత్యాది లక్ష్యాలకు కట్టుబడివున్నామని, దేవుడు లేడన్న వాదన మినహా పెరియార్‌ను మిగతా అన్ని విషయాల్లో అనుసరిస్తామని విజయ్ చెప్పుకొచ్చారు. ఆ సందర్భంగా ఆయన ప్రకటించిన పార్టీ విధానాలమీద తమిళనాడును దశాబ్దాలుగా ఏలుతున్న అన్నాడీఎంకె, డిఎంకె వంటి పార్టీలనుంచి విమర్శలు రావడం సహజం.

కొత్తసీసాలో పాతసారా, కలగూరగంప, కాపీ పేస్ట్ ఎజెండా, కాక్‌టెయిల్ వంటి విమర్శలు ఈ కొత్తపార్టీ ఎదుర్కొంటోంది. రాజకీయాల్లోకి కొత్తయినా ఏ దశలోనూ తాను వెనక్కుతగ్గేది లేదని విజయ్ కాస్తంత గట్టిగా చెబుతున్నారు. ఆరంభం బాగుంది అంటూ రజనీకాంత్ అందించిన శుభాకాంక్షల సందేశంలో కొనసాగింపే కష్టమన్న ధ్వని చాలామందికి తోచింది. రాజకీయరంగ ప్రవేశానికి సర్వమూ సిద్ధం చేసుకున్న తరువాత, దశాబ్దాలుగా సినీరంగంనుంచి పోగేసుకున్న ఆస్తులు, అభిమానాలు పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ, వయసు, ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని రజనీ ఆఖరునిముషంలో వెనకడుగువేసిన విషయం తెలిసిందే. కమలహాసన్ సైతం సొంతంగా పార్టీ ఆరంభించి బొక్కబోర్లాపడ్డారు. గత తమిళ అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా ఆర్నెల్లముందు పార్టీని ప్రకటించి, సిద్ధాంతాలు ఆదర్శాలు అంటూ ఏవో కొన్ని ప్రజలముందు ఉంచిన రజనీకాంత్, నిర్భయంగా రాజకీయ రంగప్రవేశం చేసివుంటే డీఎంకె ఇంత సులభంగా అధికారంలోకి రాగలిగివుండేదా అన్నది కొందరి అనుమానం. ఇప్పుడు, విజయ్ కొత్తపార్టీ ఎవరికి మేలుచేస్తుందన్న చర్చ విస్తృతంగా జరుగుతోంది. ద్రవిడ మున్నేట్ర కళగంను దెబ్బతీయడానికే ఈ తమిళగ వెట్రి కళగం పుట్టుకొచ్చిందని స్టాలిన్ విమర్శలు చేస్తున్నారు. కుమారరత్నం ఉదయనిధిని సీఎం కుర్చీలో కూచోబెట్టాలని ఆయన ఆశపడుతున్న తరుణంలో దాదాపు అంతే వయసున్న విజయ్ రాజకీయాల్లోకి రావడం విశేషమైన పరిణామం. అయితే, తమిళరాజకీయాల్లో విజయ్ ప్రవేశం డీఎంకెను కాక అంతకంటే అధికంగా దానికి బలమైన ప్రత్యర్థిగా ఉన్న అన్నాడీఎంకెను దెబ్బతీస్తుందని ఒక విశ్లేషణ. తమిళ ఓటర్లు ప్రధానంగా ఈ రెండుపార్టీల మధ్యా చీలిపోయివున్న నేపథ్యంలో, కరుణానిధి పార్టీ వ్యతిరేకులైన జయలలిత పార్టీ అభిమానులను విజయ్ పెద్ద ఎత్తున తనవైపు తిప్పుకోవచ్చును. జయలలిత మరణానంతరం ముక్కలై, ఆధిపత్యపోరుతో క్రమంగా బలహీనపడుతున్న జయలలితపార్టీనుంచి ఓటర్లు విజయ్ వైపు మళ్ళిపోవడం అనూహ్యమేమీ కాదు. ఎంతో ఘనంగా తన రాజకీయప్రస్థానాన్ని ఆరంభించిన విజయ్ తమిళరాజకీయాల్లో ఎటువంటి ప్రభావం చూపగలరో 2026లో తేలుతుంది.

కాబోయే విజేతకు విజయ హారతి!

అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నిక జీవిత సదృశమైనది. ఆ మహా ప్రజాస్వామిక సమర తీరుతెన్నులు తరచు మారిపోతుంటాయి. అంతిమ విజయం ఎవరిదనే విషయమై మనం ఊహలు చేస్తాం. నిర్దిష్ట అంచనాలకు వచ్చేందుకు ఆరాటపడతాం. అయితే తడబడతాం. మన పిచ్చా పాటీలో ప్రత్యామ్నాయ సంవాదాల వైపు మొగ్గు చూపుతాం. రాజకీయ పండితులు తెలివైన కథనాలు నివేదిస్తారు, అయితే పోరు పూర్తయిన తరువాతనే సుమా! అయితే ఇందుకు వారు విజేత ఎవరో నిర్ణయమవక ముందే క్రియాశీలంగా ప్రతిస్పందించవలసి ఉంటుంది. ఎవరు గెలుస్తారు లేదా గెలవరు అనే విషయమై నిరాకరించదగిన, అంగీకార యోగ్యమైన అభిప్రాయాలను సేకరించవలసి ఉంటుంది. ఆఖరుకు 'నేను ముందే చెప్పలేదా?' అంటూ తమ సర్వజ్ఞతను సగర్వంగా ప్రదర్శిస్తారు!

ఎన్నిక ఫలితాలు వెలువడిన తరువాత ఎవరు గెలిచారు అనే విషయం ఆధారంగా పాత్రికేయులు తాము ముందే తయారు చేసుకున్న కథనాలలో విజేత కనుగుణమైనదానిని ఎంపిక చేసుకుంటారు. డోనాల్డ్ ట్రంప్ గెలిచినట్టయితే అమెరికాకు అధికారికంగా, అనధికారికంగా వలస వచ్చిన, వస్తున్న వారు, ముఖ్యంగా మెక్సికన్ల పట్ల కఠిన వైఖరితో కూడిన విధానాన్ని అనుసరించాలన్న వాదన కారణంగా ఆయన విజయం సాధించారని తప్పక వక్కాణిస్తారు. ట్రంప్ ఓడిపోయారనుకోండి. అందుకు అధిక సంఖ్యాక వర్గం – శ్వేత జాతీయులు– వారే కారకులు అవుతారు. మిన్నెసోటా, మోంటానా లాంటి రాష్ట్రాల ఓటర్లు వలసల వ్యతిరేక వైఖరిని పట్టించుకోకపోవడమే కారణమవుతుంది. ఇంతకూ ఆ రాష్ట్రాల వారు చూసిన, చూస్తున్న మెక్సికన్లు వెండితెరపై కనిపించేవారు మాత్రమే. మరి వారు హాలీవుడ్ నటుడు క్లింట్ ఈస్ట్‌వుడ్‌కు సరిపోలరు కదా.

కమలా హారిస్ గెలవడం జరిగితే అందుకు ప్రధాన కారకులు నల్ల జాతివారే (ఆఫ్రికన్ అమెరికన్లు). అందునా ఓప్రాహ్ విన్ ఫ్రే, మిషెల్ ఒబామా లాంటి ప్రముఖ ఆఫ్రికన్ అమెరికన్ ప్రముఖులు ఆమె పక్షం వహించడమే కమలాహారిస్‌కు కలిసివచ్చింది. అయితే నల్ల జాతీయుల మద్దతులో మరో కోణాన్ని కూడా మనం చూడవలసి ఉంది. నల్ల జాతి పురుష ఓటర్లు ప్రభావశీలమైన వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తూ, ఎటువంటి సవాళ్ళనైనా సదా సమర్థంగా ఎదుర్కోగల ధీర ఒక అగ్రగామిగా ఉండడాన్ని ఇష్టపడరు. సరే, కమలా హారిస్ కూడా ఒక నల్ల జాతీయురాలే అని వారు భావించరు. మరి డోనాల్డ్ ట్రంప్ తన ప్రత్యర్థి గురించి నిరంతరం ఘోషిస్తోంది ఇదే కదా!

ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశంగా ఉన్న గర్భస్రావం విషయాన్ని చూద్దాం. ప్రతిష్ఠాత్మక అధ్యక్ష పదవికి తమ అభ్యర్థిగా కమలా హారిస్‌ను ఎంచుకున్న డెమొక్రాట్లలో అత్యధికులు గర్భ స్రావాన్ని చట్టబద్ధం చేయాలని వాదిస్తున్నారు. అయితే దీనివల్ల మహిళలకు, తగినంత మంది పురుషులకు మాత్రమే ప్రయోజనముంటుంది. కమలాహారిస్ గెలిచినపక్షంలో అందుకు కారణం అమెరికన్లలో కనీసం సగం మంది మహిళలు కావడమే. పిల్లలను కనే వయస్సుదాటిన వారు సైతం గర్భస్రావాన్ని చట్టబద్ధం చేయాలని పట్టుబడుతున్నారు. వీరంతా 1970ల నాటి రో వెర్సెస్ వేడ్ కేసులో గర్భస్రావం అనుకూల తీర్పుకు పోరాడినవారే. ఆ తీర్పు విషయంలో డోనాల్డ్ ట్రంప్ వైఖరి సానుకూలంగా లేదు.



అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ మధ్య తీవ్ర పోటీ ఉందని, ఎవరు విజేత అవుతారన్నది అసందిగ్ధంగా చెప్పలేమని రాజకీయ పండితులు ముక్తకంఠంతో అంటున్నారు. సంభావ్య విజేత గురించి పాత్రికేయులు ముందుగా తయారు చేసుకున్న కథనాలు ఈ ఏకాభిప్రాయం ప్రాతిపదికనే ఉన్నాయి. గెలిచిన అభ్యర్థి ఎవరు అన్న దానిపై ఆధారపడి ఆ పూర్వరచిత కథనాలలో వాస్తవ విజేతకు అనుగుణంగా ఉన్న వాటిని వారు ప్రచురిస్తారు!

కమలా హారిస్ గెలిచిన పక్షంలో కచ్చితంగా ఒక కారణం అందుకు ప్రధానంగా దోహదం చేస్తుంది: ఆమె తన భావాలు, అభిప్రాయాలను, అనుసరించబోయే విధానాలను ప్రశాంతంగా, ఎటువంటి తడబాటు లేకుండా స్పష్టంగా విశదంగా చెప్పడమే, సందేహం లేదు. అయితే ఓడిపోయిన పక్షంలో ఆమె వివరణలు, విధానాలు, నినాదాలు ఏవీ హాంబర్గర్, హాట్ డాగ్ స్టాండ్ (అమెరికాలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లు, స్నాక్స్ క్యాంటీన్‌లు)ల లోనివారిని ఎటువంటి ఉద్వేగాలకు లోనుచేయదు. ఆ రాజకీయ పరిణామాన్ని పట్టించుకోవడంపై వారు శ్రద్ధ చూపరు. విజితురాలుపై వారిలో ఎటువంటి సానుభూతి జనించదు. మహిళా ఓటర్లలో అత్యధికులు తన పక్షానే ఉన్నారని కమలా హారిస్ భావిస్తున్నారేమో కానీ శక్తిమంతుడైన డోనాల్డ్ జాన్ ట్రంప్ తమ సమక్షంలో నిలబడినప్పుడు వారిలో ఎంత మంది ఆయను అనురాగ దృక్కులతో చూస్తారో ఆమెకు తెలుసా?

డోనాల్డ్ ట్రంప్ ఓడిపోయిన పక్షంలో కారణమేమవుతుంది? ఆయన తన రాజకీయ ప్రత్యర్థులను తరచు తీవ్రంగా విమర్శిస్తుండడం, వలసవచ్చినవారిని దూషించడమే; అంతే కాదు, తీవ్ర శిక్షలకు అర్హమైన మహాపరాధాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఎన్నో కేసులు ఉండడం కూడా. అంతేనా? ఎన్నికల ప్రచారానికి ఓటర్లు సమకూర్చిన నిధుల నుంచి ఒక సెక్స్ వర్కర్‌కు, తన ప్రతిష్ఠను కాపాడుకునే నిమిత్తం చెల్లింపులు జరిపారన్న తీవ్ర అప్రతిష్ఠను మూటగట్టుకోవడమూ ఆయన ఓటమికి దారితీసిందని చెప్పడం అనివార్యమవుతుంది. ట్రంప్ గెలిచారే అనుకోండి అప్పుడు ఆయన ఒక శక్తిశాలి పురుషపుంగవుడు కావడమేనని తప్పక చెప్పుతారు. మహిళల కంటే పురుషులనే ఎక్కువగా ఆకట్టుకునే వ్యక్తిత్వ వైనాలు ఆయనలో బాగా ఉన్నాయని ఘోషిస్తారు.

డోనాల్డ్ ట్రంప్ మళ్లీ శ్వేత సౌధం (అమెరికా అధ్యక్షుని అధికార నివాసం) ఆసామీ అయితే అందుకు తోడ్పడిన కారణం ఆయన అధ్యక్ష పదవీ కాలం (2017–21)లో ద్రవ్యోల్బణం తక్కువగా ఉండడమే. అలాగే నిరుద్యోగిత స్వల్ప స్థాయిలో ఉండడమే. అయితే ట్రంప్ పదవీకాలం ఆఖరులో ద్రవ్యోల్బణమూ పెరిగింది, నిరుద్యోగిత సైతం పెచ్చరిల్లింది. అయినా అందుకు ట్రంప్‌ను మీరు తప్పుపట్టలేరు. ఎందుకని? కోవిడ్ విలయాన్ని గుర్తు చేసుకోండి. ట్రంప్ హయాంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉన్నట్టు కన్పించడానికి కారణమేమిటో ఆయనకు తక్షణ పూర్వం అధ్యక్షుడుగా ఉన్న బరాక్ ఒబామా ఇలా చెప్పారు: 'జార్జి బుష్ చిందరవందర చేసిన ఆర్థిక వ్యవస్థను తాను బాగు చేసి దాన్ని మళ్లీ శీఘ్ర పురోగతి బాటలోకి తీసుకువెళ్లడమే'. కనుక దేశ ఆర్థిక వ్యవస్థను మళ్లీ శక్తిమంతం చేసిన ఘనత నిస్సందేహంగా డెమొక్రాట్లదేనని ఒబామా ఘంటాపథంగా అన్నారు.

దిగుమతులపై అత్యధిక స్థాయిలో సుంకాలు విధించడానికి తాను వెనుకాడనని ట్రంప్ ఇప్పుడు గట్టిగా చెప్పుతున్నారు. అమెరికన్ల ఉద్యోగాలను కాపాడేందుకు ఈ చర్య తప్పనిసరి అని ఆయన వాదిస్తున్నారు. ట్రంప్ ప్రతిపాదిత సుంకాలు ఎవరూ ఎప్పుడూ కలలో కూడా కనీవినీ ఎరుగని స్థాయిలో హెచ్చుగా ఉన్నాయి. ట్రంప్ సరళంగా తన విధానాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్న సమస్యలు అన్నిటినీ మటుమాయం చేసే అఖండ పరిష్కారమది. కమలా హారిస్ సైతం ఆర్థిక వ్యవస్థను మళ్లీ చక్కదిద్దేందుకు తన ప్రణాళికలను వివరిస్తున్నారు. ఆమె ఎన్నో అంకెలు ఏకరువు పెడుతున్నారు. నోబెల్ ఆర్థిక పురస్కార గ్రహీతలు (అమెరికాలో వీరి సంఖ్య తక్కువేమీ కాదు సుమా!) ఆమె ఆలోచనలు, ప్రతిపాదనలను ప్రశంసిస్తున్నారు. అయితే అసాధారణ మేధావంతుల, హాస్యదాయక రేఖా చిత్రకథలు చదివి ఆనందించేవారి ప్రపంచాలు పూర్తిగా భిన్నమైనవి. అవి పరస్పరం చాలా సుదూరమైనవి మరి.

డోనాల్డ్ ట్రంప్‌ను కమలా హారిస్ ఓడించిన పక్షంలో ఆమె ప్రతిపాదించిన ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానానికి ఆ ప్రతిష్ఠ దక్కుతుంది. ఆమె ఎటువంటి శాఖా చంక్రమణం చేయకుండా ఆ ఓటర్లకు నివేదించిన విధానమది. మరి డోనాల్డ్ ట్రంప్ ఫిలడెల్ఫియా టౌన్ హాల్‌లో తన విధానాలను వివరించిన తీరు పూర్తిగా భిన్నమైనది. వ్యాపారవేత్తగా డోనాల్డ్ ట్రంప్ దివాళా, ఇతర వ్యాపార సంబంధిత చట్టాలను ఉపయోగించుకున్న తీరుతెన్నులపై ఆక్షేపణలు, అభ్యంతరాలు తక్కువేమీ కాదు. అయినప్పటికీ సామాన్య అమెరికన్ పౌరుడు (సిఎన్ఎన్ చర్చలు లేదా 60 మినిట్స్ లేదా అటువంటి టీవీ కార్యక్రమాలను వీక్షించే సమయం లేని శ్రమజీవి) ఒకటే మాట చెప్పుతాడు: 'దేశ సమస్యలను ఎలా పరిష్కరించాలో ట్రంప్‌కు తెలుసు'.

ముస్లింలను తన పక్షానికి తిప్పుకోవడం ట్రంప్‌కు కష్టమేకావచ్చుకాని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ చర్యలను ఆయన ఎట్టి పరిస్థితులలోను పూర్తిగా అనుమతిస్తారన్న విషయమై యూదు ఓటర్లకు ఎటువంటి సందేహం లేదు. ఈ విషయంలో ట్రంప్‌పై వారికి పూర్తి భరోసా ఉన్నది. అమెరికా విదేశాంగ విధానానికి సంబంధించిన ఈ కీలక అంశంపై కమలా హారిస్ నిక్కచ్చిగా, అస్పష్టంగా మాట్లాడడం లేదు. ఈ విషయంలో ట్రంప్‌దే పైచేయి. పాలస్తీనా సంక్షోభంపై డెమొక్రాట్లు ద్వంద్వ నీతితో వ్యవహరించడాన్ని ముస్లింలు నిరసిస్తున్నారు. కమలా హారిస్ గెలిచినప్పటికీ ముస్లింలు ఆమెకు మద్దతు నిచ్చారని భావించనవసరం లేదు. కాకపోతే ఆమెను, ట్రంప్ కంటే తక్కువ హానికరమైన నేతగా చూస్తున్నారని అర్థం చేసుకోవాలి.

మొత్తం మీద 2024 అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ మధ్య తీవ్ర పోటీ ఉందని, ఎవరు విజేత అవుతారన్నది అసందిగ్ధంగా చెప్పలేమని రాజకీయ పండితులు, ఓటర్ల అభిప్రాయాలు విశ్లేషించే నిపుణులు ఏకీభవిస్తున్నారు. సంభావ్య విజేత గురించి పాత్రికేయులు ముందుగా తయారు చేసుకున్న కథనాలు ఈ ఏకాభిప్రాయం ప్రాతిపదికనే ఉన్నాయి. అంతిమ ఫలితం వెలువడిన వెన్వెంటనే వాస్తవ విజేతకు అనుగుణమైనవి ప్రచురితమవుతాయి. నెలల తరబడి తాము తదేక దీక్షతో ఎన్నికల ప్రచార తీరుతెన్నులు, ప్రజల ప్రతిస్పందనల విషయమై తమ నిశిత పరిశీలనను అవి ప్రతిబింబిస్తున్నాయని పాత్రికేయులు చెప్పుతారు. అయితే ప్రజాభిప్రాయం మారిపోయి, గెలిచిన అభ్యర్థి స్వల్ప మెజారిటీతో కాకుండా భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన పక్షంలో ఓటర్ల అభిప్రాయాల విశ్లేషణ నిపుణులు, పాత్రికేయులు తమ వాదనలు, మార్చుకోవలసి ఉంటుంది. తాము పొరపడ్డామని ఒప్పుకోవడం అనివార్యమవుతుంది.

▪ దీపాంకర్ గుప్తా
సామాజిక శాస్త్రవేత్త
జేఎన్‌యూ విశ్రాంత ఆచార్యులు

ప్రాణాంతక 'గడ్డిమందు' నిషేధం అవశ్యం

గడ్డిమందుగా రైతులు పిలుచుకొనే పెరాక్విట్ డైక్లోరైడ్‌ను వారు కలుపు నాశనానికి వాడడం పరిపాటి. ప్రస్తుత వ్యవసాయ కూలీల ఖర్చుల దరిమిలా ఈ మందును రైతులు ఆశ్రయించడంలో ఆశ్చర్యం లేదు. కానీ, గత పదేళ్లలో దేశవ్యాప్తంగా ఈ మందు దుర్వినియోగ మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. వర్షాధారిత భారతావనిలో అతివృష్టి, అనావృష్టి వల్ల పంటనష్టం వాటిల్లి, తీర్చలేని అప్పుల బారిన పడిన రైతన్నలు తమకు అందుబాటులో ఉన్న పురుగు మందులు, కలుపు నాశినులు సేవించి ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇందులో ఈ గడ్డిమందు ప్రథమస్థానం ఆక్రమించింది. దీనికి కారణం– ఈ మందుకు ఎటువంటి విరుగుడు లేకపోవడం. అలాగే కొన్ని మిల్లీలీటర్లు తీసుకున్నా మరణం తథ్యమన్న నమ్మకం జనబాహుళ్యంలో నాటుకుపోవడం.

అసహజ మరణాలకు కారణాలు కనుక్కోవడానికి చేస్తున్న శవపరీక్షలలో 15–20 శాతం పురుగు మందులు, కీటక నాశినులు, కలుపు నాశినులు సేవించి మరణించిన వారివే ఉంటున్నాయి. ఈ గడ్డిమందును హత్యలకు, బంధువులను బెదిరించి పనులు సాధించేందుకు కూడా వాడటం చూస్తున్నాం. ప్రతినిత్యం సరైన రక్షణ తొడుగులు లేక, మూతికి గుడ్డ కట్టుకోకుండా పొలంలో గడ్డిమందును పిచికారీ చేసే రైతులు కూడా ప్రమాదవశాత్తూ దీని బారిన పడుతున్నారు. ఇటువంటి వారిలో పార్కిన్‌సన్ వ్యాధి, కాళ్లూ–చేతులు మంటలు రావడం లేదా స్పర్శ తగ్గడం వంటివి సంభవిస్తున్నాయి.



తక్కువ సాంద్రతలలో మాత్రమే గడ్డిమందును అనుమతిస్తున్నామని, వాడకాన్ని చాలావరకు నియంత్రిస్తున్నామని కేంద్రప్రభుత్వం వల్లెవేస్తున్నా, వాస్తవంలో నిర్దేశిత పంటలు దాటి రైతులు దీనిని వాడుతున్నారు. అలాగే ఆత్మహత్యల కోసం దీనిని వాడడం చూస్తూనే ఉన్నాం. ప్రపంచ దేశాల పరిశోధకులు గడ్డిమందును అత్యంత ప్రమాదకర పురుగుల మందుగా నిర్ధారించారు. భారత్ కూడా దీనిని నిషేధించాల్సిన సమయం ఆసన్నమైంది.

స్విట్జర్‌లాండ్‌కి చెందిన ఒక సంస్థ 1960వ దశకం నుంచి గడ్డిమందును తయారుచేసి విపణిలో ఉంచింది. ఈ మందు వల్ల సంభవించే స్వల్పకాలిక, దీర్ఘకాలిక విషప్రభావాలు, పర్యావరణంపై దీని దుష్ప్రభావాలను అంచనా వేసి ఆ దేశంతో సహా 60 అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు దీనిని నిషేధించాయి. ఈ సంస్థకు గడ్డిమందు ప్రభావం గురించి ముందుగానే తెలుసని, అయినా ఆ పరిశోధన పత్రాలను దాచిపెట్టి, వ్యాపార కాంక్షతో ఈ మందును తయారుచేసి ప్రపంచ జనాభాను బలి చేసిందని 'ది గార్డియన్' పత్రిక 'పెరాక్విట్ ఫైల్స్' అన్న శీర్షికతో గత ఏడాది ప్రచురించింది. ప్రస్తుతం ఈ గడ్డిమందు వాడకంలో అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, అర్జెంటీనా, జపాన్ ఉన్నాయి. చైనా, ఇంకా చాలా దేశాలు వారి భూభాగంపై దీనిని వినియోగించడాన్ని అనుమతించకపోయినా, ఎగుమతులకు ఉత్పత్తి చేయడం వారి ద్వంద్వ వైఖరికి తార్కాణం. అమెరికాలో ఈ గడ్డిమందు వల్ల పార్కిన్సన్ వ్యాధి బారిన పడినవారు చాలా రాష్ట్రాల్లో సామూహిక దావాలు వేశారు.

ఈ గడ్డిమందు సేవించినప్పుడు నోటిలో, గొంతులో కాలిన గాయాల వలె పుండ్లు పడి మింగడానికి ఇబ్బంది కావడం, వాంతులు–విరేచనాలు అవడం, కామెర్ల బారిన పడడం, శరీరం పసుపు పచ్చగా మారడం, మూత్రం పసుపురంగులో రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. క్రమేపీ కాలేయం, మూత్రపిండాలు చెడిపోవడం, చివరకు ఊపిరితిత్తులు పనిచేయక మనిషి మరణిస్తాడు. దీనికి ప్రత్యేక విరుగుడు మందు లేదు. మరో విషయం ఏమిటంటే తొలుత విష ప్రభావం విరామం ఇచ్చినట్లు కనిపించినా, తర్వాత వారి ఆరోగ్యం క్రమేపీ క్షీణిస్తుంది. ఇది వైద్యులకు ఓ పెను సవాలు. ప్రమాదం నుంచి బయటపడ్డాడు అని వైద్యులు చెప్పిన తరువాత కూడా ఆకస్మిక మరణం పాలయిన అనేక సందర్భాలున్నాయి. ఇది వైద్యులపై దాడులకు కూడా కారణమయింది. ప్రతి ఏడాది వేల సంఖ్యలో సంభవిస్తున్న గడ్డిమందు ఆత్మహత్యలు వైద్యులను కూడా భయాందోళనలకు గురిచేశాయి. దీంతో ఈ మందును సంపూర్ణంగా నిషేధించాలని ఒరిస్సాలోని వైద్యులంతా పెద్దయెత్తున ఉద్యమించారు.

మన దేశంలో కీటకనాశినుల తయారీ, అమ్మకాలని 'కీటకనాశిని చట్టం–1968' నియంత్రిస్తుంది. అయితే విష ప్రభావంపై ఎటువంటి అంచనా లేకుండా, పర్యావరణం, జంతుజాలం, మనుషులపై ఇది చూపించే ప్రభావాలను విశ్లేషించకుండా ఈ గడ్డిమందును సురక్షితంగా పరిగణిస్తూ భారత్‌లో వినియోగించడానికి అనుమతించారు. తరువాత కేరళలో దీని విషప్రభావంపై అధ్యయనం జరిపి, అక్కడి ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారం కొంతకాలం ఈ మందును నిషేధించారు. అయితే కీటకనాశినుల నియంత్రణలో కేంద్రానిదే పైచేయి కావడం, 90 రోజులకు మించి ఒకసారి వీటిని నిషేధించే అధికారం రాష్ట్రాలకు లేకపోవడం గడ్డిమందును నిషేధించాలన్న సంకల్పంతో ఉన్న రాష్ట్రాలకు సమస్యాత్మకంగా మారింది. అంతేకాక కొత్త పురుగుమందుల యాజమాన్య చట్టం–2020 చాలాకాలంగా పార్లమెంటులో మగ్గుతుండడానికి గల కారణం ఈ మొత్తం వ్యవస్థపై పురుగు మందు సంస్థల గుత్తాధిపత్యం.


చాలా కొన్ని సాంద్రతలలో మాత్రమే గడ్డిమందును అనుమతిస్తున్నామని, వాడకాన్ని చాలావరకు నియంత్రిస్తున్నామని కేంద్రప్రభుత్వం వల్లెవేస్తున్నా, వాస్తవంలో నిర్దేశిత పంటలు దాటి రైతులు దీనిని వాడుతున్నారు. అలాగే సేద్యానికి మించి ప్రాణహానికి వాడడం చూస్తూనే ఉన్నాం. ప్రపంచ దేశాల పరిశోధకులు గడ్డిమందును అత్యంత ప్రమాదకర పురుగుల మందుగా నిర్ధారించారు. వారి పరిశోధనను గౌరవిస్తూ భారత్ కూడా ఈ మహమ్మారిని నిషేధించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి లక్షల కోట్లు గడించిన గడ్డిమందు తయారీ సంస్థ దీని విరుగుడు కోసం ఒక్క రూపాయి అయినా ఖర్చుపెట్టిందా అన్న విషయం దేవుడికే ఎరుక. ఉన్నపళంగా ఈ మందును నిషేధించలేమని ప్రభుత్వాలు భావిస్తే, క్రమేపీ నిషేధించడానికి ఒక ప్రణాళిక సిద్ధం చేయాలి. ఏటికేడాది పెరిగిపోతున్న జనాభాకు తిండిపెట్టడానికి గడ్డిమందు లేకుండా వ్యవసాయం చేయలేమని చెప్పేవారూ లేకపోలేదు. అయితే ఈ మందుకు మునుపు కూడా వ్యవసాయం చేసి, విజయవంతంగా రెట్టింపు సంపద సృష్టించిన రైతుల గాథలు భారతదేశంలో చాలానే ఉన్నాయి. రెప్పపాటులో అద్భుతాలు సృష్టించాలనే పేరాశకు పోకుండా, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, కృషి సంవర్ధక విధానాలతో గడ్డిమందు లేకుండా వ్యవసాయం చేయవచ్చు.

నారు నాటే మూడు నెలల ముందు నుంచి రెండు లేదా మూడుసార్లు పొలం దున్నడం వల్ల ఇసుక నేలలో కలుపు సమస్య తక్కువగా ఉంటుంది. రేగడి నేలల్లో గడ్డిమందు వాడకం ఎలాగూ తక్కువే. ఈ నేలను దున్నినప్పుడు పెరుగులాగా ఉండే మట్టి, అధిక నీటి సాంద్రత కలిగి కలుపును, వాటి విత్తులను చీకిపోయేలా చేస్తుంది. చీనీ, నిమ్మతోటల్లో ప్లాస్టిక్ షీట్స్ వినియోగిస్తూ, డ్రిప్ ఇరిగేషన్ వినియోగించడం వల్ల కలుపును చాలా వరకూ నివారించవచ్చు. గడ్డిమందు ప్రత్యామ్నాయ కలుపునాశినులు కూడా చాలానే ఉన్నాయి. వాటి భద్రతపై సరైన వివేచన జరిపి అనుమతులు జారీ చేయాల్సిన అవసరం ఉంది. గడ్డిమందు స్థానంలో వాటి వాడకాన్ని నిర్దేశించవచ్చు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఈ దిశగా పరిశోధనలు జరిపి, వాటి వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనకరం. మనం తినే ఆహారంలో కూడా గడ్డిమందు అవశేషాలు ఉన్నట్లు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆత్మహత్యలకే కాక హత్యలకు కూడా వాడుతున్న ఈ గడ్డిమందు వ్యవసాయదారులను దాటి, ప్రజారోగ్య, ప్రజారక్షక సమస్యగా పరిణమించింది. అందువల్ల ఈ గడ్డిమందును నిషేధించడం అత్యవసరం.

• కట్టంరెడ్డి అనంత రూపేష్‌రెడ్డి
సహాయ ఆచార్యులు, ఆంధ్రా వైద్య కళాశాల

మహోన్నత దేశభక్తుడు

చిత్తరంజన్ దాస్ 1870 నవంబర్ 5న అప్పటి ఉమ్మడి బెంగాల్ రాష్ట్రంలో జన్మించారు. ఇంగ్లాండులో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, 1909లో బాంబు కేసులో అరబిందో ఘోష్‌ను శిక్ష పడకుండా రక్షించారు. 1920 నుండి 1922 వరకు కొనసాగిన సహాయనిరాకరణోద్యమంలో బెంగాల్ ప్రాంతంలో దాస్ ప్రముఖ పాత్ర వహించారు. స్వయంగా తన పాశ్చాత్య ఐరోపా వస్త్రాలను తగులబెట్టి స్వదేశ ఖాదీని ధరించి అందరికీ ఆదర్శప్రాయుడయ్యారు. గాంధీతో విభేదించి మోతీలాల్ నెహ్రూతో కలసి స్వరాజ్ పార్టీ స్థాపించారు.



బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఆయన 'ఫార్వర్డ్' అనే పత్రికను స్థాపించి తర్వాత దాని పేరును 'లిబర్టీ'గా మార్చారు. కొత్తగా ఏర్పడిన కలకత్తా కార్పొరేషన్‌కు ఆయన మొదటి మేయర్‌గా పనిచేసారు. గయలో జరిగిన ఇండియన్ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించారు. అనారోగ్యంతో బాధపడుతూ కూడా మొక్కవోని దీక్ష, పట్టుదలతో బ్రిటిష్ వారిపై దాస్ పోరాడారు. ఆయన అహింసా విధానాన్ని విశ్వసించారు. స్వాతంత్ర్యాన్ని సాధించడానికి రాజ్యాంగ బద్ధమైన విధానాలను అనుసరించాలని ఆయన భావించేవారు. సమాజ సామరస్యానికి పాటుపడిన, జాతీయ విద్యాప్రగతి వాది. ఆయన వారసత్వాన్ని ఆయన శిష్యులు అనుసరించారు. వారిలో సుభాష్ చంద్రబోస్ అగ్రగణ్యుడు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఆనాడు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన విప్లవకారుల తరఫున వాదించి దేశ బంధుగా ప్రఖ్యాతి పొందిన చిత్తరంజన్ దాస్ 1925 జూన్ 16న తుదిశ్వాస విడిచారు.

– యం. రాంప్రదీప్
(నేడు దేశబంధు జయంతి)

పోలవరం నిర్వాసితుల పునరావాసం మాటేమిటి?

పోలవరం ప్రాజెక్టు సమగ్ర డీపీఆర్‌కు వెంటనే కేంద్రం వద్ద ఆమోదం పొందేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రద్ధ చూపాలి. ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ 45.72 మీటర్ల ఎత్తుకు నిర్మించడం కష్టం కాకపోవచ్చు. ప్రధాన సమస్య నిర్వాసితుల పునరావాసానికి దాదాపు ముప్పయి వేల కోట్ల రూపాయలు కావాలి. ఈ లోపు చాలా కుటుంబాలు వేరుపడి తమకూ నష్టపరిహారం డిమాండ్ చేసే అవకాశం ఉందనే వాస్తవాన్ని విస్మరించకూడదు.



ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టు గురించి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తాజాగా పదే పదే అబద్ధాలు చెప్పడంతో ఆయనకు జవాబు కూడా తరచూ చెప్పడం ఎబ్బెట్టుగా వుంది. ఇందులో రెండు మూడు అంశాలు పరిశీలించాలి.

టీడీపీ, వైసీపీ హయాముల్లో ఎంతెంత మేర పనులు జరిగాయి? జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నదానిలో వాస్తవమెంత? అయిదేళ్ల కాలం అధికారంలో వున్న జగన్మోహన్‌రెడ్డి ప్రాజెక్టు సమగ్ర రెండవ డీపీఆర్ కేంద్రం వద్ద ఆమోదం పొందేందుకు చేసిన కృషి ఏమిటి?

ప్రస్తుతం మరుగున పడిన పోలవరం ప్రాజెక్టు తొలి దశ అంశం తెర మీదకు తెచ్చిన జగన్మోహన్‌రెడ్డి గతంలో ప్రాజెక్టు భవిష్యత్తును ఐసీయూలోకి నెట్టడం నిజం కాదా? వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు దీటైన సమాధానం చెప్పారు. మరో వేపు ఆంధ్రప్రదేశ్‌కు చేయవలసిన ద్రోహం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమాషా చూస్తోంది. పోలవరం ప్రాజెక్టు పూర్వాపరాల్లోకెళ్లి అధికారిక గణాంకాలు పరిశీలిస్తే ఆసక్తికరమైన అంశాలు దృగ్గోచరమౌతాయి. గత టీడీపీ హయాంలోనే పోలవరం ప్రాజెక్టు రెండవ డీపీఆర్ ఆమోదానికి తీవ్ర కృషి జరిగింది. 2019 ఫిబ్రవరిలో కేంద్ర జల వనరుల శాఖకు చెందిన సాంకేతిక సలహా మండలి 2017–18 షెడ్యూల్ రేట్ల ప్రకారం తీవ్ర కసరత్తు అనంతరం 55,548.83 కోట్ల రూపాయలకు రెండవ డీపీఆర్‌కు ఆమోదం తెలిపింది. ఇందులో భూసేకరణ పునరావాసం కిందనే 33,868.23 కోట్లుగా నిర్ధారించింది. ఈ లోపు ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంలో ఫైలు మూలనపడింది.

2019లో అధికారం చేపట్టిన జగన్మోహన్‌రెడ్డి కేంద్ర జల వనరుల శాఖ చెబుతున్నా వినకుండా కాంట్రాక్టరు మార్పుతో సంవత్సర కాలం గడచిపోయి రెండవ డీపీఆర్ గురించి పట్టించుకున్నవారే లేకపోయారు. ఈ సమయంలో జరిగిన కాలయాపనతో జగన్మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టు భవిష్యత్తుపై తొలి దెబ్బ కొట్టారు. ప్రాజెక్టు నిర్మాణానికి జగన్మోహన్‌రెడ్డి తట్టాబుట్టా సర్దుకున్న తర్వాత 2020లో గాని కేంద్ర జల వనరుల శాఖలో కదలిక రాలేదు. 2020లో సమావేశమైన రివైజ్డ్ కాస్ట్ అంచనాల కమిటీ సాంకేతిక సలహా మండలి ప్రతిపాదించిన రెండవ డీపీఆర్‌ను తగ్గించింది. 2017–18 షెడ్యూల్ రేట్ల ప్రకారం ప్రాజెక్టు రెండవ డీపీఆర్ 47,785.24 కోట్ల రూపాయలకు కుదించింది. భూ సేకరణ పునరావాసం కలుపుకొని సాగునీటి వ్యయం 35,988.16. కోట్లుగా తేల్చింది. అంతవరకైతే పర్వాలేదు. 2013–14లో కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిందని 2013–14 షెడ్యూల్ రేట్లతో మరో డీపీఆర్ ఆమోదించింది. ఈ డీపీఆర్ మేరకు ప్రాజెక్టు నిర్మాణ వ్యయం 29,027.00 కోట్లుగానూ ఇందులో సాగునీటి వ్యయం 20,398.81 కోట్లుగా తేల్చి కేంద్ర ఆర్థిక శాఖకు పంపింది. ఇక్కడ దుర్మార్గమేమంటే 2019లో సాంకేతిక సలహా మండలి రెండవ డీపీఆర్ ఆమోదించిన సమయంలో కేంద్ర మంత్రివర్గం ఆమోదించినదనే అంశం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాచిపెట్టింది. ఇందుకు కారణం లేకపోలేదు. కొద్ది నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరగనున్నందున ఈ విషయం బయట పడితే వ్యతిరేకత వస్తుందని ఈ ద్రోహానికి కేంద్రం తలపడింది. కాగా పార్లమెంటు ఆమోదించిన రాష్ట్ర విభజన చట్టం ద్వారా పోలవరం జాతీయ ప్రాజెక్టుగా పరిగణింపబడుతోంది.

కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తన నిధులతో పోలవరం ప్రాజెక్టు నిర్మించవలసి వుంది. ఇందులో శషభిషలు ఏ మాత్రం లేవు. కాని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ దురాగతానికి తలపడింది. ఇదిలా వుండగా తనకు 25 మంది పార్లమెంటు సభ్యులను గెలిపించి ఇస్తే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పి అధికారానికి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఏనాడూ చట్టబద్ధత గల పోలవరం ప్రాజెక్టుకు జరిగిన ఈ దురాగతం గురించి కేంద్రాన్ని నిలదీసిన సందర్భం లేదు. 2013–14 షెడ్యూల్ రేట్లతోనా? లేక 2017–18 షెడ్యూల్ రేట్లతోనా? అనే చర్చ తుదకు పార్లమెంటులో కూడా జరిగిన అంశం అందరికీ తెలుసు. ఈ అయిదేళ్ల కాలంలో తేల్చుకోకపోవడం జగన్మోహన్‌రెడ్డి వైఫల్యమైతే కేంద్రం తొలి నుండి పక్షపాత ధోరణితో ఆంధ్రప్రదేశ్‌ను శంకరగిరి మాన్యాలు పట్టించింది. ఈ జంఝాటకంలో నాలుగేళ్లు గడచిపోయిన తర్వాత తిరిగి ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం రెండూ కూడా తొలి దశ అనే విధానాన్ని తెర మీదకు తెచ్చాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఏదో కార్యక్రమం పెట్టుకొని నీతి ఆయోగ్ సభ్యులు ఒకరు వచ్చిన సందర్భంగా జగన్మోహన్‌రెడ్డిని కలిసిన విషయం చాలా మందికి గుర్తు వుంటుంది. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించమని ఆ సభ్యులు జగన్మోహన్‌రెడ్డిని కోరినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత తొలిదశ పురుడు పోసుకొన్నది. తదుపరి జరిగిన సంఘటనలు కూడా మరింత ఆసక్తికరంగా వున్నాయి.

తన హయాంలో జరిగిన ప్రాజెక్టు పురోగతిపై జగన్మోహన్‌రెడ్డి తరచూ అబద్ధాలు చెబుతున్నారు. 2019లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత రాష్ట్ర జల వనరుల శాఖ సమగ్ర నివేదిక సమర్పించింది. అందులో పోలవరం ప్రాజెక్టులో అప్పటి వరకు జరిగిన పురోగతి ఇలా వుంది. పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ 64.08 శాతం పూర్తయినట్లు పేర్కొన్నారు. ఇది రికార్డు రూపంలో వుంది. కాగా పది వేల కోట్ల రూపాయల అడ్‌హాక్ ఇస్తే 41.15 ఎత్తుతో ప్రాజెక్టు తొలిదశ నిర్మాణం పూర్తి చేస్తానని కేంద్ర జల వనరుల శాఖకు 2022 జూలై 19వ తేదీ సమర్పించిన నివేదికలో ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ 69.79 మాత్రమే పూర్తయినట్లు పేర్కొన్నారు. అంటే జగన్మోహన్‌రెడ్డి హయాంలో పోలవరం ప్రాజెక్టు పురోగతి ఇంచుమించు ఎవరైనా అంచనా వేసుకోగలరు. ఈ సందర్భంలోనే తొలిదశ డీపీఆర్ మొత్తం 36,448.83 కోట్లకు అంగీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసిన అంశం రికార్డుల్లో వుంది. ఈ లేఖ పైననే కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శితోనూ ఒకటి రెండు సమావేశాలు ప్రాజెక్టు అథారిటీతో పలు సమావేశాలు జరిగాయి. అంతిమంగా కేంద్ర ప్రభుత్వం తొలిదశ ఆమోదిస్తున్నట్లు జగన్మోహన్‌రెడ్డి హయాంలో ప్రకటన వెలువడింది. పైగా హెడ్‌వర్క్స్ పద్దు కింద మూడువేల కోట్ల రూపాయలు కోత పెట్టారని అప్పట్లోనే వార్తలు వచ్చాయి. ఇవన్నీ జగన్మోహన్‌రెడ్డి గంప కింద మూసిపెడితే దాగేటివి కాదు.

అయితే ప్రాజెక్టు అథారిటీ కేంద్ర జల సంఘం మాత్రం ఈ మొత్తానికి కోత పెట్టి రూ. 31,625.38 కోట్లకు కోత పెట్టింది. తిరిగి ఏ పద్దులు తగ్గించారో గాని 30 వేల కోట్లకే తొలి డీపీఆర్ అధికారయుతంగా ఆమోదించారు. కాని ఇక్కడ మరో మెలిక వుంది. ప్రాజెక్టు ఎన్ని దశలుగా నిర్మించినా ఎవరికీ అభ్యంతరం లేదు. మున్ముందు కేంద్రం ఏదైనా పేచీ పెట్టకుండా ఇప్పుడే ప్రాజెక్టు సమగ్ర డీపీఆర్ కేంద్రం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదం పొందాలి. ఎందుకంటే పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ 45.72 మీటర్ల ఎత్తుకు నిర్మించడం కష్టం కాకపోవచ్చు. ప్రధాన సమస్య నిర్వాసితుల పునరావాసానికి దాదాపు ముప్పయి వేల కోట్ల రూపాయలు కావాలి. ఈ లోపు చాలా కుటుంబాలు వేరుపడి తమకూ నష్టపరిహారం డిమాండ్ చేసే అవకాశం వుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తరచూ పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అంటుంటారు. పోలవరం ప్రాజెక్టును జీవనాడి చేయాలంటే ఎంత త్వరగా సమగ్ర డీపీఆర్ ఆమోదం పొందుతారో అనే దానిపైన ఆధారపడి ఉంటుంది. పైగా మొదటి నుంచీ ప్రధానమంత్రి మోదీ ఆంధ్రప్రదేశ్ యెడల సామరస్యంగా లేరు. రాజకీయ ప్రయోజనం లేనిదే నిధులు ధారాళంగా ఇవ్వరు. తొలి దశ పనులు జరిగే సమయంలోనే మరోవేపు సమగ్ర డీపీఆర్ ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి సాంకేతికంగా ఏలాంటి ఇబ్బంది లేదు. ప్రస్తుతం దేశంలో రాజకీయ అనిశ్చిత పరిస్థితి నెలకొని వుంది. తొలి దశ పనులు సాగిస్తూ అదే సమయంలో సమగ్ర డీపీఆర్ ఆమోదం పొందగలిగితే పోలవరం ప్రాజెక్టు అంశంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు యాభై శాతం విజయం సాధించినట్లే.

◆ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు





పాతశివాలయంలో శివయ్యకు క్షీరాభిషేకం



దుర్గాఘాట్‌లో భక్తుల పుణ్యస్నానాలు

• శివమయం

కార్తీకమాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి సోమవారం కావడంతో శైవక్షేత్రాలతో పాటు ఇంద్రకీలాద్రిపై శివాలయం కిటకిట లాడాయి. కార్తీక దీపాలతో శోభాయమానంగా వెలిగాయి. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పరమేశ్వరుడిని దర్శించి తరించారు.

నేడే నాగులచవితి

ముస్తాబైన మోపిదేవి సుబ్బారాయుడి ఆలయం

» చోడవరం పుట్ట వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

6



చక్రవ్యూహం

గొల్లపూడి వన్ సెంటర్‌లో ట్రాఫిక్ చిక్కులు

- ఇష్టానుసారంగా వాహనాల రాకపోకలు
- విశాలమైన రోడ్డున్నా తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- తరచూ ప్రమాదాలు

8


• ప్రాణాలతో చెలగాటం..

దారి దోపిడీ

పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రవాణా అధికారి నిర్వాకం

హైఫ్లాష్ టార్చిలైట్లతో ఒక్కసారిగా వాహనాలు, డ్రైవర్లపై వెలుతురు గుప్పిస్తారు. ఆ వెలుతురులో ఏమీ కనిపించక డ్రైవర్ సడెన్ బ్రేక్ వేస్తాడు. ఇంతలో డివైడర్‌పై నిలబడిన ప్రైవేట్ వ్యక్తులు ఒక్కసారిగా కిందకు దిగి వాహనం వద్దకు వచ్చేస్తారు. వాహనం తాళం, పత్రాలు తీసుకుని సార్.. దగ్గరకు రావాలంటూ డ్రైవర్‌ను గద్దిస్తారు. అన్నీ సక్రమంగా ఉన్నా సరే.. సార్‌ను కలవాల్సిందేనంటారు. సదరు సార్ వద్దకు వెళ్లాక అక్కడే ఓ పర్సనల్ వ్యక్తి చక్రం తిప్పుతాడు. ఫోన్‌లో ఏదో చూస్తాడు. ఏదేదో అయిపోయినట్టుగా బిల్డప్ ఇస్తాడు. డ్రైవర్లను బెంబేలెత్తిస్తాడు. ఆ తర్వాత వారి దగ్గర నుంచి డబ్బు గుంజుతాడు. వెంటనే ఆ వాహనానికి క్లీన్‌చిట్ వచ్చేస్తుంది. గుంజిన డబ్బును సొంతంగా జేబులో వేసుకుంటారు. పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రోజూ రాత్రి 9 నుంచి అర్ధరాత్రి వరకు ఓ రవాణా అధికారి సాగించే దందా ఇది.

- రాత్రిపూట ప్రైవేట్ వ్యక్తులతో అనధికార వసూళ్లు
- డ్రైవర్లపై ఒక్కసారిగా టార్చిలైట్ల వెలుతురు
- సడన్ బ్రేకులు వేస్తుండటంతో ప్రమాదాలు
- ఇటీవల లారీని మినీవ్యాన్ ఢీకొని ఒకరి మృతి
- అయినా ఆగని అధికారి అరాచకాలు
- ఫిర్యాదులు అందుతున్నా పట్టని ఉన్నతాధికారులు



పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రవాణా అధికారి కారులో ఉండగా, బయట ప్రైవేట్ వ్యక్తుల వసూళ్లు



గతనెల 29న జరిగిన ప్రమాదం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓ రవాణా అధికారి ఆధ్వర్యంలో పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద అనధికార వసూళ్లు చేపడుతున్నారు. రోజూ రాత్రి 9 గంటలైతే చాలు.. ప్లాజా వద్ద గద్దల్లా వాలిపోతున్నారు. జాతీయ రహదారిపై ఉన్నామన్న స్పృహ కూడా లేకుండా ఎడాపెడా వాహనాలను నిలిపేస్తున్నారు. టార్చిలైట్లు పట్టుకుని ఉండే ప్రైవేట్ వ్యక్తులు.. డ్రైవర్లపై వెలుతురు ఫోకస్ వేయించి సడెన్ బ్రేకులు వేయిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వారం కిందట ఓ లారీ వెనుకగా వస్తున్న మినీవ్యాన్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. సదరు లారీ డ్రైవర్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో ఈ విషయాన్నే చెప్పాడు.

ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్లు

రవాణా శాఖలోని మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ల ప్రధాన విధి వాహనాలను తనిఖీ చేయటం. ఎవరి పరిధిలో వారు డ్రైవ్స్ నిర్వహిస్తూ ఈ తనిఖీలు నిర్వహించాలి. మచిలీపట్నం పరిధి కలిగిన ఓ రవాణా ఇన్‌స్పెక్టర్ మాత్రం రెండు నెలలుగా పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రాత్రిపూట వాహనాలు చెక్ చేస్తున్నారు. రోజూ ఒక ప్రాంతంలో తనిఖీలు చేసే వీల్లేదు. కానీ, సదరు ఇన్‌స్పెక్టర్ రెండు నెలలుగా పొట్టిపాడును పట్టుకుని వదలట్లేదు. ఇన్‌స్పెక్టర్, హోంగార్డులే కాకుండా.. ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని ఇక్కడ వాహనాలు ఆపుతున్నారు. ఈ వాహనాల డ్రైవర్లు మొదట సదరు ఇన్‌స్పెక్టర్ పర్సనల్ వ్యక్తిని కలవాలి. చదువు రాని మిగతా 6లో..



విజయవాడ వెస్ట్ బైపాస్..

టార్గెట్ జనవరి

చకచకా సాగుతున్న పనులు

- హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్యలు కొలిక్కి..
- బ్యాలెన్స్ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ
- ప్యాకేజీ-1, 2 పనులు ఇప్పటికే పూర్తి
- ప్యాకేజీ-3 పనులు వేగవంతం
- మరో ఆరు నెలల్లో ప్యాకేజీ-4 కూడా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : చినఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు చేపడుతున్న విజయవాడ పశ్చిమ బైపాస్ పనులు జనవరికి పూర్తిచేసి, ప్రారంభించేందుకు జాతీయ రహదారుల సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ-1లో ఎన్‌హెచ్-16పై గుండుగొలను నుంచి కలపర్రు వరకు ఆరు వరసల విస్తరణ పనులు ఇటీవలే ప్రారంభించారు. ప్యాకేజీ-2లో భాగంగా కలపర్రు నుంచి చినఅవుటపల్లి వరకు ఆరు వరసల విస్తరణతో పాటు ఆరు కిలోమీటర్ల హనుమాన్ జంక్షన్ బైపాస్ రోడ్డు ఇంతకుముందే అందుబాటులోకి వచ్చాయి. తాజాగా ప్యాకేజీ-3లో చినఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ఈ రోడ్డు అందుబాటులోకి రానుంది. ప్యాకేజీ-4లో కృష్ణానదిపై 3 కిలోమీటర్ల వంతెన మిగతా 6లో..

విజయవాడ-విశాఖ

క్వాడ్రాలైన్

- నాలుగు లైన్ల అభివృద్ధికి సర్వే పూర్తి
- విజయవాడ-గూడూరు మధ్య కూడా..
- రైల్వేబోర్డుకు నివేదించిన అధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో విజయవాడ-విశాఖపట్నం లైన్‌ను నాలుగు లైన్లుగా (క్వాడ్రాలైన్) విస్తరించేందుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. దీనికి సంబంధించి సర్వే పనులు పూర్తిచేసిన అధికారులు రైల్వే బోర్డుకు నివేదిక పంపారు. అలాగే, విజయవాడ-గూడూరు మధ్య క్వాడ్రాలైన్‌కు సంబంధించిన సర్వే నివేదికను కూడా బోర్డుకు అందజేశారు. ఈ రెండింటికీ ఒకేసారి రైల్వేబోర్డు ఆమోదం తెలిపే అవకాశముంది. విజయవాడ-గూడూరు మధ్య ఇప్పటికే మూడో లైన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొద్దిభాగం మాత్రమే మిగిలి ఉంది. కొత్త సంవత్సరంలో మూడో లైన్ విద్యుదీకరణ సహా పూర్తిగా అందుబాటులోకి రానుంది. విజయవాడ-విశాఖపట్నం మార్గంలో మాత్రం ప్రస్తుతం రెండు లైన్లు ఉన్నాయి. అదనంగా మరో రెండు లైన్లను విస్తరించటానికి వీలుగా ఈ సర్వే చేపట్టారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో విజయవాడ-విశాఖపట్నం, విజయవాడ-గూడూరు మార్గాలు స్వర్ణ చతుర్భుజంగా ఉంటాయి. భారీ లాభాలను ఇచ్చే సెక్షన్లు ఇవి. ప్రయాణికుల రవాణాతో పాటు పోర్టుల రవాణాకు సంబంధించి కూడా ఈ రెండు మార్గాలు అనుసంధానమైనవి. తాజాగా ఈ రెండు మార్గాలను నాలుగు లైన్లుగా విస్తరించడం వల్ల డివిజన్ ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుంది.

మారని బామ్మర్ది

మైలవరంలో ప్రజాప్రతినిధి బామ్మర్ది దోపిడీ

నిన్నటి వరకు వైసీపీ ముసుగులో అక్రమాలు

- నేడు టీడీపీ జెండా పట్టుకుని వైసీపీ వారికి సహకారం
- అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు
- ఇష్టానుసారంగా లారీల నుంచి మామూళ్లు
- మద్యం దుకాణాల్లోనూ వైసీపీ వారికే అండ
- మైలవరం నియోజకవర్గంలో రగిలిపోతున్న తమ్ముళ్లు



మైలవరం నియోజకవర్గ అధికార పార్టీలో ప్రజాప్రతినిధి బామ్మర్ది తీరు చిచ్చురేపుతోంది. గ్రావెల్ తవ్వకాలు, మద్యం దుకాణాల విషయంలో వైసీపీ నాయకులకు లబ్ధి చేకూర్చేలా ఆయన వ్యవహరిస్తున్నారని స్థానిక టీడీపీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మైలవరం మండలం వెదురుబీడెంలో ఓ వైసీపీ నాయకుడు 3 ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు తెచ్చుకున్నారు. విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు పనులకు ఆయన గ్రావెల్ తరలిస్తున్నారు. ఇందులో ఇద్దరు వైసీపీ నాయకులు వాటాదారులు. అయితే, క్వారీ నుంచి గ్రావెల్ తీసుకెళ్లే లారీల విషయంలో ఇటీవల పెద్ద గొడవే జరిగింది. బైపాస్ నిర్మాణ పనులకు గ్రావెల్ తోలే కాంట్రాక్టును అధికార పార్టీ ప్రజాప్రతినిధి బామ్మర్ది దక్కించుకున్నారు. దీన్ని సాకుగా చూపుతూ ఇతరులెవరూ వెదురుబీడెం క్వారీ నుంచి గ్రావెల్ తరలించడానికి వీల్లేదంటూ ఆంక్షలు విధించారు.

టీడీపీ నాయకులకు ఆటంకాలు

బైపాస్ పనులకు గ్రావెల్ తరలించుకునేందుకు కొద్దిరోజుల క్రితం ఓ టీడీపీ సానుభూతిపరుడికి అనుమతి లభించింది. ఆ వ్యక్తి వెదురుబీడెం క్వారీ నుంచి గ్రావెల్ తోలేందుకు సిద్ధమయ్యారు. దీనికి బామ్మర్ది అడ్డు పడ్డారు. ఈ క్వారీ నుంచి కాకుండా వేరే చోట నుంచి గ్రావెల్ తరలించుకోవాలని ఆదేశించారు. ఒకవేళ వెదురుబీడెం నుంచే గ్రావెల్ తోలాలంటే లారీకి రూ.2 వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. బైపాస్ నిర్మాణ కంపెనీ నుంచి తానే బిల్లులు వసూలు చేసుకుని, తనకు రావాల్సిన మొత్తం మినహాయించుకున్న తర్వాతే మిగిలిన మొత్తం ఇస్తానని షరతు విధించారు. దీంతో కంగుతిన్న ఆ లారీల యజమాని తానూ టీడీపీ కోసం పనిచేసిన వ్యక్తినేనని, ఐదేళ్లలో చాలా నష్టపోయానని మొరపెట్టుకున్నా బామ్మర్ది ససేమిరా.. అన్నారు. చివరికి చేసేది లేక షరతులకు అంగీకరించి గ్రావెల్ తోలడం ప్రారంభించారు. రోజులు గడుస్తున్నా తనకు రావాల్సిన మొత్తాన్ని ఇవ్వకుండా నాన్చుతుండటంతో ఇదే విషయాన్ని బామ్మర్ది వద్ద ప్రస్తావించారు. గ్రావెల్ తోలకంలో తనకు గిట్టుబాటు కావడం లేదని, తనకు రూ.40 లక్షలు రావాలని, తన డబ్బు తనకు ఇప్పిస్తే వెళ్లిపోతానని కోరారు. రోజులు గడుస్తున్నా డబ్బు మాత్రం ఇవ్వకుండా తిప్పుకొంటున్నారని ఆ లారీల యజమాని తనకు తెలిసిన వారి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా ఒక ఎత్తయితే నిబంధనలకు విరుద్ధంగా వెదురుబీడెం క్వారీలో సుమారు 20 అడుగుల మేర గ్రావెల్ తవ్వకాలు జరుపుతుండటం మరో ఎత్తు. దీనిపై స్థానికులు కొందరు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా బామ్మర్ది ఒత్తిడితో వారు అటువైపే చూడటం మానేశారు.

మద్యం దుకాణాల్లోనూ వైసీపీవారే..

ఇబ్రహీంపట్నంలో ఏఎంసీ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడైన వ్యక్తికి మద్యం దుకాణం దక్కింది. ఇతని నుంచి నియోజకవర్గ టీడీపీ నాయకులు కొందరు దుకాణం కొనుగోలు చేసేందుకు బేరాలు మొదలుపెట్టారు. ఈలోగా బామ్మర్ది ప్రవేశించి ఎవరికీ అమ్మాల్సిన అవసరం లేదని, తాను చెప్పిన వారికి 30 శాతం వాటా ఉచితంగా ఇస్తే నిర్విఘ్నంగా వ్యాపారం చేసుకోవచ్చని సదరు వైసీపీ నేతకు అభయమిచ్చారు. దీంతో తాను దుకాణం అమ్మే ప్రశ్నే లేదంటూ వైసీపీ నాయకుడు అడ్డం తిరిగారు. పుల్లూరులో మద్యం దుకాణం దక్కించుకున్న తెలంగాణ వ్యాపారి నుంచి తక్కువ ధరకు కొని వైసీపీ నాయకులకు అప్పగించడంలో బామ్మర్ది ప్రధాన పాత్ర పోషించారు. మిగతా 6లో..

ఐజీఎంసీ స్టేడియంలో దొంగల బెడద

» విలువైన కాపర్‌వైర్లు, ఫ్లడ్‌లైట్లు చోరీ

» బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల పనే..

8లో



8లో

మహోన్నత దాతలు

• భవానీలు, అయ్యప్పల సేవలో పుట్టగుంట, అడపా బ్రదర్స్

వైభవంగా కార్తీక మాసోత్సవాలు ప్రారంభం



కార్తీకమాస పూజల్లో ఈవో రామారావు

వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీక తొలి సోమవారం సందర్భంగా మల్లేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఏడు గంటల వరకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో రామారావు, స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు. మంగళవారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ఆలయంలో కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో రామారావు తెలిపారు. నాగుల చవితి సందర్భంగా మంగళవారం ఉపాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేక కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకాలు, సహస్రలింగార్చన ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జరుగుతాయని, రూ.500 రుసుము చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని తెలిపారు. సోమవారం, ఏకాదశి, పౌర్ణమి, మాసశివరాత్రి రోజుల్లో బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రాభిషేకాలు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 వరకు జరుగుతాయని, రూ.2,000 రుసుము చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని వివరించారు. ప్రతిరోజూ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అన్ని విఐపీల దర్శనాలు నిలుపుచేయటమైందని, సాధారణ భక్తులకు మెరుగైన సేవలు అందించటానికి దేవస్థానం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

దుర్గమ్మ సేవలో తెలంగాణ మంత్రి పొన్నం

వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో కె.ఎస్. రామారావు మంత్రికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం పొన్నం ప్రభాకర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేశారు. మంత్రి వెంట కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో శ్రీవిశ్వశాంతి విద్యార్థుల ప్రతిభ



విజేతలతో శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల అధినేత మాదల సుబ్రమణ్యేశ్వరరావు

ఉయ్యూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పటమటలో చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జేకే గోజు రి యూ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 23 నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. అండర్-14 విభాగం సీహెచ్ లలిత్‌నాగసాయి కుమితే విభాగంలో ప్రథమస్థానం, కటా విభాగంలో తృతీయ స్థానం, అండర్ -17 విభాగంలో మిలన్‌కుమార్ ప్రథమ స్థానం, అండర్ -17 బాలికల విభాగంలో తాన్యా ఆస్థా ప్రథమస్థానం సాధించారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను, కరాటే కోచ్ పి.రామకృష్ణను విద్యాసంస్థల అధినేత మాదల సుబ్రమణ్యేశ్వరరావు, ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్లు మాదల సూర్యశేఖర్, సుష్మా అభినందించారు.

నాగుల చవితికి మోపిదేవి ముస్తాబు

మోపిదేవి, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): నాగుల చవితి పర్వదిన వేడుకలకు మోపిదేవిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ముస్తాబైంది. లక్ష మందికిపైగా భక్తులు వస్తారనే అంచనాలతో దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు పుట్టలో పాలుపోసి చవితి వేడుకలు ప్రారంభిస్తారు. అనంతరం భక్తులకు నాగపుట్ట, స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. చవితి వేడుకలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు.

130 మంది పోలీసులతో బందోబస్తు

మోపిదేవి ఆలయం వద్ద 130 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. మోపిదేవి అవుట్ పోస్టు నందు సిబ్బందికి విధులు కేటాయింపుపై పలు సూచనలు చేశారు. మోపిదేవిలో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా ఆర్టీసీ బస్సులను జాతీయ రహదారి వెంబడి మళ్లించటం జరిగిందన్నారు. సీఐలు యువకుమార్, ఈశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ బకాయిలు చెల్లించండి: సబ్కా

విజయవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భవనాలు, ప్రాజెక్టులకు సంబంధించి నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఉన్న పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సబ్కా (స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్) విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శిని సోమవారం సచివాలయంలో కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.164.90 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం నడుస్తున్న ప్రాజెక్టులకు ఇసుక కొరత లేకుండా సరఫరా చేయాలన్నారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు గడువు పెంచండి: ఎమ్మెల్సీ వేపాడ

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు కనీసం 90 రోజులు గడువు ఇవ్వాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి కోరారు. నిరుద్యోగ యువత, ప్రైవేటు ఉద్యోగులు పరీక్షల సన్నద్ధతకు అదనపు సమయం కోరుతున్నారన్నారు. పలు అంశాలపై ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధను సోమవారం విజయవాడలోని కార్యాలయంలో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు. 2018 గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలపై పారదర్శకంగా విచారణ జరిపించాలని కోరారు.

విద్యాసాగర్ కస్టడీ పిటిషన్‌పై విచారణ 7కు వాయిదా

విజయవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో ప్రధాన నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను కస్టడీకి ఇవ్వాలని సీఐడీ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం ఈనెల ఏడో తేదీకి వాయిదా వేసింది. విద్యాసాగర్‌ను వారం పాటు కస్టడీకి ఇవ్వాలని సీఐడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని మూడో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు విద్యాసాగర్ తరపు న్యాయవాదిని ఆదేశించింది. సోమవారం కోర్టుకు హాజరైన ఆయన తాము సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశామని, దానిపై విచారణ జరుగుతున్నందున అప్పటి వరకు ఎలాంటి విచారణ చేయొద్దని కోర్టును కోరారు. సుప్రీంకోర్టులో పిటిషన్‌కు సంబంధించి ఈనెల ఏడో తేదీలోపు ఆర్డర్ తీసుకురావాలని, లేనిపక్షంలో కస్టడీ పిటిషన్‌పై విచారణను పూర్తి చేస్తామని న్యాయాధికారి తిరుమలరావు స్పష్టం చేశారు.

టెన్త్ పరీక్ష ఫీజుల చెల్లింపు గడువు పెంపు

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు చెల్లించాల్సిన ఫీజుల గడువును పాఠశాల విద్యాశాఖ పొడిగించింది. గతంలో ప్రకటించిన గడువు ప్రకారం అపరాధ రుసుము లేకుండా అక్టోబరు 28 నాటికి ఫీజులు చెల్లించాల్సి ఉంది. అయితే ఆ గడువును ఈనెల 18 వరకు పెంచుతూ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఆదేశాలు జారీచేశారు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 25 వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు 3 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 10 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా రచన

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పి.రచన నియమితులయ్యారు. డెప్యూటీ కలెక్టరుగా సేవలందిస్తున్న ఆమెను డిప్యుటేషన్‌పై ఏడాది కాలపరిమితితో ఏపీఐఐసీ ఈడీగా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది.

పెసలు కొనేదెప్పుడు?

- పది రోజుల కిందట మార్క్‌ఫెడ్ అధికారులకు శాంపిల్స్
- నేటికీ కొనుగోలు కేంద్రాల ఊసేలేదు
- రబీ సాగుకు సొమ్ముల్లేక రైతుల అవస్థలు

పెసలు సాగు చేసిన రైతులు అమ్ముకోవడానికి అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుంచి రైతులకు విముక్తి కల్పించి పెసలకు మద్దతు ధర అందించాల్సిన మార్క్‌ఫెడ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పది రోజుల కిందట స్థానిక అధికారులు శాంపిల్స్ సేకరించి పంపించినా నేటి వరకు కొనుగోలు కేంద్రాల ఊసే లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ పంట సాగుకు చేతిలో చిల్లిగవ్వలేదని వాపోతున్నారు.



(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల): బహిరంగ మార్కెట్లో పెసలకు క్వింటాకు రూ. 6 వేల నుంచి గరిష్ఠంగా రూ. 7 వేల లోపు ధర లభిస్తుంది. కంచికచర్ల ప్రాంతంలో వర్షానికి ముందు ఇళ్లకు చేరిన పెసలు నాణ్యతా పరంగా చాలా బాగున్నాయి. అయితే వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. రబీ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమైనందున పెట్టుబడులు కోసం రైతులు తప్పనిసరిగా పెసలు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8,558. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవటం వల్ల రైతులకు మద్దతు ధర లభించటం లేదు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన ఎమ్మెల్యే

రైతులకు జరుగుతున్న నష్టాన్ని గురించి పక్షం రోజుల కిందట 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పందించారు. మార్క్‌ఫెడ్ అధికారులకు ఫోన్ చేసి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు మద్దతు ధర అందించి ఆదుకోవాల్సిందిగా కోరారు. దీనిపై మార్క్‌ఫెడ్ అధికారులు స్థానిక వ్యవసాయ మార్కెట్ అధికారులకు ఫోన్ చేసి పెసలు శాంపిల్స్ పంపించమని అడిగారు. రైతుల నుంచి దాదాపుగా వంద శాంపిల్స్ సేకరించి ఏఎంసీ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులకు పంపించారు. శాంపిల్స్ పంపించి పది రోజులు కావస్తున్నప్పటికీ మార్క్‌ఫెడ్ అధికారుల నుంచి ఏలాంటి సమాధానం లేదు. పెసలు కొనే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఈలోగా తమకు నష్టం జరుగుతుందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. స్వయంగా ఎమ్మెల్యే సౌమ్య ఫోన్ చేసినప్పటికీ మార్క్‌ఫెడ్ అధికారులు పెద్దగా స్పందించటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు పెసలు అమ్మిన పక్షంలో క్వింటాకు రూ. 1500 నుంచి రూ. 2 వేల వరకు నష్టం కలుగుతుందని అంటున్నారు. మద్దతు ధర అక్టోబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినందున పెసలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటంలో మార్క్‌ఫెడ్ అధికారులు ఎందుకు అలసత్వం చూపుతున్నారో అర్థం కావటం లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు జోక్యం చేసుకుని, కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

నష్టపోయిన పెసర రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది పెసర రైతులు భారీ వర్షాలు, వరదల ఎంతో నష్ట పోయారు. ప్రభుత్వ సాయం కూడా పెద్దగా అందలేదు. దిగుబడులు ఆశాజనకంగా లేవు. వర్షాలకు ముందు తడవకుండ ఇళ్లకు వచ్చిన పెసలకు సైతం గిట్టుబాటు ధర లభించటం లేదు. రబీ సీజన్ ప్రారంభమైనందున పెట్టుబడులకు సొమ్ముల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి పెసర రైతులను తక్షణమే ఆదుకోవాలి.

-జాలిపర్తి సాంబశివరావు, కంచికచర్ల

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి. బహిరంగ మార్కెట్లో వ్యాపారులు తక్కువ ధరకు కొంటూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. మద్దతు ధరతో పోల్చితే క్వింటాకు రూ. 2 వేలకు పైగా నష్టపోతున్నారు. శాంపిల్స్ చూసిన తర్వాత కూడా మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించక పోవటం దారుణం. రైతుల దుస్థితిని అర్థం చేసుకుని కొనుగోలు చేయాలి.

-నన్నపనేని లక్ష్మీనారాయణ, కంచికచర్ల

నూతన క్రీడా పాలసీ ప్రకటనపై కేపీరావు హర్షం

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలకు పెద్ద పీట వేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో క్రీడామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు శరవేగంగా నూతన క్రీడా పాలసీకి నడుంబిగించడంపై ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు హర్షం వ్యక్తం చేశారు. రెండేళ్ల పాటు రెన్యువల్ చేయకుండా మూలకు చేరిన క్రీడా పాలసీ తయారు చేయడంతో సీఎం, మంత్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఏపీ క్రీడా హబ్‌గా తయారు కావాలని కేపీరావు ఆకాంక్షించారు.

వాటర్ గేమ్స్ స్థలాన్ని శాప్‌కు ఇవ్వాలని సీఎంకు అభ్యర్థన

శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : విశాఖపట్నంలో 2002లో వాటర్ గేమ్స్‌కు కేటాయించిన ఎకరం స్థలంను మాజీ సీఎం రుషికొండ ప్యాలెస్‌కు హెలిప్యాడ్‌కు తీసుకున్నారని, ఆ స్థలాన్ని శాప్‌కు కేటాయించాలని సీఎం చంద్రబాబు నాయుడును కోరినట్లు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి జీవో, శాప్‌కు సమాచారం లేకుండా శాప్ స్థలంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారని ఆయన సీఎంకు వివరించారు. విద్యాధరపురంలో 2018లో మీ చేతుల మీదుగా మల్టీపర్పస్ స్టేడియంకు విద్యాధరపురంలో రూ.60 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు టీడీపీ పేరు వస్తుందని అక్కసుతో దాన్ని జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని సీఎంకు తెలిపినట్లు చెప్పారు. విశాఖలోని స్థలాన్ని శాప్‌కు తిరిగి ఇవ్వాలని, విద్యాధరపురంలోని ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించాలని చంద్రబాబును రవినాయుడు కోరారు.

జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి కృషి

- ఏపీఐఐసీ ద్వారా 1,162 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి
- మచిలీపట్నం పోర్టు, విమానాశ్రయం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

మచిలీపట్నం, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాను రానున్న రోజుల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. జిల్లాపరిషత్ సమావేశపు హాలులో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం కారణంగా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోనప్పటికీ ముందుచూపుతో వ్యవహరించే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే, మరోవైపు పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు మంచి ప్రణాళికను రూపొందించారన్నారు. ఈ నేపథ్యంలో ఏపీఐఐసీ ద్వారా కృష్ణాజిల్లాలో 1,162 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను రెండేళ్లలో పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో ఇండ స్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మచిలీపట్నం పోర్టు, గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గన్నవరం విమానాశ్రయాన్ని ఆధునిక వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 45 రహదారులను 239 కిలోమీటర్ల మేర రూ.14.76 కోట్ల వ్యయంతో డిసెంబరు నాటికి అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. సంక్రాంతి నాటికి రహదారులపై ఉన్న గుంతలన్నింటినీ పూడ్చి వేస్తామన్నారు. అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులు కడుపుమంటతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు.

విద్యుత్ తాజా భారాలపై సీపీఎం నిరసన

గవర్నర్‌పేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం తప్పిందని, మొత్తం రూ. 17 వేల కోట్లు విద్యుత్ భారాలు ప్రజలపై వేసేందుకు సిద్ధమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్.బాబూరావు విమర్శించారు. విద్యుత్ ట్రూ అప్ చార్జీల తాజా భారాలపై సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం బీసెంట్ రోడ్డు మహంతి మార్కెట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ పంపిణీ సంస్థల తాజా నోటిఫికేషన్ కాపీలను దహనం చేశారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ బాదుడుకు నిరసనగా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విద్యుత్ భారాలు విధించడంలో వైసీపీ ప్రభుత్వం దారిలోనే కూటమి ప్రభుత్వం నడవటం సరికాదన్నారు. విద్యుత్ భారాలు విధించడంపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.. తాజా భారాలకు నిరసనగా ఈనెల 8 నుంచి 14 వరకు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపటతామని అన్నారు. 14వ తేదీన ప్రభుత్వ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున నిరసనలు చేస్తామని హెచ్చరించారు.

'కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల' లోగో, వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా విస్తృతస్థాయిలో చర్చలు జరిపేందుకు ఈ నెల 22, 23 తేదీల్లో కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల 6వ సమావేశం నిర్వహిస్తున్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీఓ హోమ్‌లో సోమవారం సమావేశానికి సంబంధించిన లోగో, వాల్ పోస్టర్‌లను ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు, ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.శివారెడ్డి, కార్యదర్శి సి.హెచ్.పురుషోత్తం నాయుడు, ఏఐఎస్, జి.ఇ.ఎఫ్ కన్వీనర్ ఎం.రామలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండు దశాబ్దాల కాలంలో దేశంలోని మహిళలలో ఆత్మస్థైర్యం పెరిగిందని, ఇది శుభపరిణామమని పేర్కొన్నారు. గత మూడు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ఆమోదం పొందేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటి పైకి రావాలని ఈ సందర్భంగా కె.ఎస్.లక్ష్మణరావు కోరారు.

రెడ్‌బుక్ ఓపెన్ కాకముందే వైసీపీ నేతల్లో కంగారు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి



మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అక్రమాల్లో కూరుకు పోయిన వైసీపీ నాయకులు రెడ్‌బుక్ ఓపెన్ చేయక ముందే కంగారు పడుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. భవన నిర్మాణ కార్మికులు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. ఇసుకను ఉచితంగా ఇవ్వడం వల్ల మళ్లీ భవన నిర్మాణ కార్మికుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో మోడల్ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధించారని గుర్తు చేశారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు ఇచ్చి తగిన గుణపాఠం చెప్పారన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు. కాగా, కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉంటున్న బీజేపీ నాయకులకు నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం కల్పించాలని ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు బీజేపీ నేతలు గుతికొండ రాజాబాబు, సోడిశెట్టి బాలాజీ, పంతం గజేంద్ర వినతిపత్రం సమర్పించారు.

'దుర్గాగణేష్' అధినేత గణేష్‌బాబు ఆత్మహత్య బాధాకరం

నాపై ఆరోపణలు అవాస్తవం

సోనోవిజన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరమూర్తి



వన్‌టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని దుర్గాగణేష్ మార్కెటింగ్ అధినేత గణేష్‌బాబు ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని సోనోవిజన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరమూర్తి అన్నారు. గణేష్ బాబు నాపై వీడియో ద్వారా చేసిన ఆరోపణలు అవాస్తమని భాస్కరమూర్తి తెలిపారు. సోమవారం ఏలూరు రోడ్డులోని విజయ ప్లాజాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం ద్వారకానగర్ డైమండ్ పార్క్ వద్ద జిప్లస్ త్రీ బిల్డింగ్‌లో తాను 2018లో సోనోవిజన్ షోరూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అదే బిల్డింగ్‌లో దుర్గాగణేష్ మార్కెటింగ్ అధినేత గణేష్ బాబు కూడా షోరూమ్‌ను అద్దెకు తీసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారన్నారు. తాను బిల్డింగ్ యజమాని రూపావతి వద్ద అద్దెకు తీసుకుని అడ్వాన్స్‌గా రూ.90 లక్షలు, నెలకు రూ.9లక్షలు అద్దె చెల్లించే విధంగా అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. గణేష్ బాబు వ్యాపారం, తన వ్యాపారం ఒకటే కావటం వలన వ్యాపారంలో పోటీ ఉండటంతో తాను గణేష్ వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నట్లుగా ప్రచారం చేయటం అవాస్తవమన్నారు. తాను వ్యాపార నిమిత్తం విశాఖపట్నం నెలలో రెండుసార్లు వెళ్లి వస్తానని, ఏనాడు గణేష్ బాబును కలిసి మాట్లాడలేదని చెప్పారు. రూపావతి బిల్డింగ్‌ను తాను కొనుగోలు చేయటానికి ఆమె పై ఒత్తిడి చేస్తున్నట్లు గణేష్ బాబు వీడియో ద్వారా ఆరోపించటం అవాస్తవమన్నారు. బిల్డింగ్ యజమాని, తాను నిబంధనల ప్రకారమే వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రెండు షోరూమ్‌లు పక్క పక్కనే ఉండటం వలన వాహనాల పార్కింగ్ విషయంలో తన షోరూమ్‌కు వచ్చే కస్టమర్ల వాహనాల పార్కింగ్ సమస్య ఉండటంతో ఆ సమస్యను రూపావతి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. తాను ఢిల్లీలో జరిగిన బజాజ్ ఫైనాన్స్ సమావేశానికి వెళ్లినప్పుడు గణేష్ బాబును కులం పేరుతో దూషించానని ప్రచారం చేయటం చాలా బాధాకరమని, తాను గణేష్ బాబును కులం పేరుతో దూషించలేదన్నారు. తన వద్ద పనిచేసే 80 మంది మేనేజర్లలో 40 మంది మేనేజర్లు గణేష్ బాబు సామాజిక వర్గానికి చెందిన వారని, 20 శాతం ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారని, మిగిలిన వారు బీసీ, ముస్లిం వర్గాలకు చెందిన వారని చెప్పారు. తన సామాజిక వర్గానికి చెందిన వారు కేవలం ఇద్దరు మేనేజర్లు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. వ్యాపారంలో కుల ప్రస్తావన తేవటం బాధాకరమన్నారు. గణేష్ బాబు కిందస్థాయి నుంచి కష్టపడి సుమారు 10 షోరూమ్‌లు ప్రారంభించారని, అదేవిధంగా తాను కూడా కిందిస్థాయి నుంచే వచ్చానని తెలిపారు. తన షోరూమ్ పక్కన ఉన్న గణేష్ షోరూమ్‌ను ఖాళీ చేయించటానికి తాను ప్రయత్నించాననటం అపోహ మాత్రమేనని తెలిపారు. వ్యాపారంలో నష్టాలు, లాభాలు వస్తుంటాయని, తాను కూడా కొన్ని సందర్భాలలో భారీగా నష్టపోయానని, అయినా సరే ధైర్యంగా నిలబడి వ్యాపారం చేస్తున్నానని వివరించారు. తాను ఏరోజు కంపెనీ ముఖ్య ప్రతినిధులతో ఇతర వ్యాపారస్తుల గురించి మాట్లాడలేదని, కేవలం తన వ్యాపారం గురించే మాట్లాడుతున్నామని తెలిపారు. గణేష్ ఆత్మహత్య చేసుకోవటం చాలా బాధాకరమని, అతని ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

దారి దోపిడీ

(5వ పేజీ తరువాయి)

డ్రైవర్లయితే వీరంతా తెగ భయపెట్టేస్తారు. ఫోన్‌లో చూస్తూ కంగారు పెట్టించేస్తారు. దీంతో డ్రైవర్లు వాహనంలో ఏ తప్పు ఉందో తెలియక అడిగినంత ఇచ్చుకునేందుకు సిద్ధపడిపోతారు. ఈ అధికారిపై పలువురు వాహనదారులు రవాణా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

పక్కాగా ఆపరేషన్

సదరు అధికారి.. జాతీయ రహదారి పక్కనే కారులో కూర్చుని ఉంటారు. ఈ సార్ డ్రైవర్ అక్కడున్న ప్రైవేట్ సిబ్బందికి నాయకత్వం వహిస్తాడు. ఎవరు ఎక్కడ ఉండాలి? ఎవరు ఎలాంటి వాహనాలను ఆపాలి? అనేది ముందే నిర్ణయించుకుంటారు. డ్రైవర్లను పిలుచుకుని వచ్చేది కూడా అతనే. ఫోన్‌లో చూస్తూ కంగారు పెట్టించేదీ అతనే. ఇలా భారీస్థాయిలో వసూళ్లు చేపడుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ.. డబ్బు అంతటినీ సొంత జేబుల్లో వేసుకుంటున్నారు.

ఉన్నతాధికారులు ఏం చేస్తున్నట్టు..?

జాతీయ రహదారిపై బహిరంగంగా ప్రైవేట్ వ్యక్తులు వాహనాలను ఆపుతున్నా, వీటికి సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవట్లేదు. ప్రమాదాలు లేని ప్రయాణాల కోసం రవాణా శాఖ 'సఫర్' వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంటే, అదే సంస్థ సిబ్బంది ప్రజల ప్రాణాలు తీసేలా ప్రవర్తించడం ఎంతవరకు సబబు అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాసుల కక్కుర్తి కోసం అమాయకుల ప్రాణాలను బలి తీసుకోవడం సరికాదని, అనధికార వసూళ్లపై ఉప రవాణా కమిషనర్ దృష్టిసారించి చర్యలు తీసుకోవాల్సి అవసరముంది.

విజయవాడ వెస్ట్ బైపాస్.. టార్గెట్ జనవరి

(5వ పేజీ తరువాయి)

పనులు, వెంకటాయపాలెం నుంచి కాజా వరకు ఆరు వరసల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ప్యాకేజీ-4 పనులు అందుబాటులోకి రావటానికి మరో ఆరు నెలలు పట్టే అవకాశముంది. ప్యాకేజీ-3 పనులు 95 శాతం పైగా పూర్తయ్యాయి.

వేగంగా పనులు

విద్యుత్ హైటెన్షన్ లైన్ల కారణంగా ఆరుచోట్ల సమస్యలు తలెత్తాయి. రెండుచోట్ల వెహికల్ అండర్ పాస్‌లు, ఒకచోట ఆర్‌వోబీ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మరోచోట కొద్దిగా అప్రోచ్ బిట్ మాత్రమే మిగిలి ఉంది. హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్యలు కొలిక్కి రావటంతో కాంట్రాక్టు సంస్థ మేఘా కూడా పనుల్లో వేగాన్ని పెంచింది. నున్నకు దిగువన పాతపాడు దగ్గర విద్యుత్ లైన్ల మార్పిడి జరిగింది. పాత టవర్లను తొలగించి ఎత్తయిన టవర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో రెండు వెహికల్ అండర్ పాస్‌ల బ్యాలెన్స్ పనులు చేపట్టారు. అలాగే, నున్న పవర్‌గ్రిడ్ దగ్గర కూడా ఆర్‌వోబీ పనులు ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నారు. గొల్లపూడి ఆర్‌వోబీ ప్రారంభ మార్గంలో అప్రోచ్ దగ్గర విద్యుత్ లైన్లను మార్చాల్సి ఉంది. అలాగే, పాతపాడు ఎగువన కూడా విద్యుత్ లైన్లను మార్చాల్సి ఉంది. ఈ రెండుచోట్ల మరో వారంలో పనులు జరుగుతాయి. నవంబరు నెలాఖరు నాటికి ఈ పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం. విద్యుత్ లైన్ల మార్పిడి ఆలస్యమైతే డిసెంబరు రెండో వారం నాటికి పూర్తి చేస్తారు. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే నూతన సంవత్సరంలో విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ప్రారంభిస్తారు.

మారని బామ్మర్ది

(5వ పేజీ తరువాయి)

విజిలెన్స్ నివేదికపై చర్యలేవీ..?

వైసీపీ హయాంలో ఎన్టీఆర్ జిల్లాలో అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు జరిపిన వారిపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు, తాడేపల్లి, వేమవరం, పి.నైనవరం గ్రామాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించారు. కొత్తూరు గ్రామంలో సర్వే నెంబర్లు 35, 36, 40, 41, 45, 227లో గ్రావెల్ అక్రమంగా జరిగినట్టు నిర్ధారించారు. ఇక్కడ గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపిన వారిలో తాడేపల్లికి చెందిన పావులూరి నాగేశ్వరరావు పేరును విజిలెన్స్ నివేదికలో ప్రస్తావించారు. తాడేపల్లి సర్పంచ్ ఉయ్యూరి గోపాలరావు పేరును కూడా పేర్కొన్నారు. వీరితోపాటు పోతురాజు మాధవరావు, కొండపనేని శేఖర్‌బాబు, పరికాల శ్రీనివాసరావు, తాడిశెట్టి నాగేశ్వరరావు.. గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపినట్లు విజిలెన్స్ నివేదికలో ఉంది. తాడేపల్లి గ్రామంలోని సర్వే నెంబర్లు 255, 256, 260, వేమవరం గ్రామంలోని సర్వే నెంబర్లు 147, 148లో కూడా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించారు. పైన పేర్కొన్న వ్యక్తులతో పాటు బొడ్డు ప్రకాశ్‌రావు, సీహెచ్ రవి వర్మ తదితరులు తవ్వకాలు జరిపినట్లు నివేదికలో పేర్కొన్నారు. వీరిలో అత్యధికులు ప్రస్తుతం బామ్మర్ది వెంట తిరుగుతుండటం గమనార్హం. దీంతో వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా విజిలెన్స్ నివేదికను అటకెక్కించారు.

తెలుగు తమ్ముళ్ల ఆవేదన

ఐదేళ్లలో మైలవరం నియోజకవర్గంలో అడ్డగోలుగా గ్రావెల్, బూడిదను తరలించేసి సొమ్ము చేసుకున్న వారే మళ్లీ ఇప్పుడు హవా చెలాయిస్తున్నారని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లలో వారి అక్రమాలను ప్రశ్నించిన తమపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారని, ఇప్పుడు ఒకే పార్టీలో ఉండటంతో వారుచేసే పనులను ప్రశ్నించే పరిస్థితి కూడా లేకపోయిందని వారు పేర్కొంటున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

బందరు రోడ్డులో ఆక్రమణల తొలగింపు

పటమట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బందరు రోడ్డుపై ట్రాఫిక్ రద్దీని తగ్గించి రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ఆలోచనతో ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ యు.రామారావు సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు బందరురోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించారు. అనంతరం హాకర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.



3 వేల సభ్యత్వాలు చేర్పించడమే లక్ష్యం

● 21వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రంగారావు

కృష్ణలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక 21 డివిజన్‌లోని పార్టీ కార్యాలయం వద్ద సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. నెలరోజుల పాటు ఈ కార్యక్రమం వుంటుందని టీడీపీ డివిజన్ అధ్యక్షుడు వేములపల్లి రంగారావు తెలిపారు. టీడీపీ నాయకుడు గన్నే నారాయణ ప్రసాద్ (అన్న), బొప్పన భవకుమార్‌లు సభ్యత్వ నమోదులు



టీడీపీ సభ్యత్వం అందజేస్తున్న నాయకులు గన్నే నారాయణ ప్రసాద్ , బొప్పన భవకుమార్

అందచేశారు. సభ్యత్వ నమోదుకు రూ.100 చెల్లించాల్సి వుంటుందని అంతేకాక రెన్యువల్ కూడా రూ.100 వుంటుందని రంగారావు పేర్కొన్నారు. నెలరోజుల పాటు సాగే ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో దాదాపు 3 వేల మంది సభ్యులను చేర్పించాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెరుమాళ్ల గురునాథం, గొరిపర్తి నామేశ్వరరావు, ఆర్.రమాదేవి, పోడూరి పవన్‌కుమార్, కేశనం భావన్నారాయణ, వెన్నా శంకర్, యలవర్తి సత్యనారాయణ, వేజెండ్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.



సైడు కాల్వలో అడ్డుగా యూజీడీ పైపు లైను, పైపు ఎత్తు లేపకుండా మెట్ల నిర్మాణం

మురుగు కాల్వలో పైపు లైను పగిలి లీకవుతున్న తాగునీరు, పగిలిన పైపు లైను పక్కనే యూజీడీ లీకై సైడు కాల్వలోకి వస్తున్న మల మూత్రాల నీరు

పొంచి ఉన్న ప్రమాదం

● ఒకేచోట మూడు సమస్యలు
● తాగునీరు కలుషితమైతే డయేరియానే
● పటమట దానయ్య వీధిలో అధికారుల నిర్లక్ష్యం

(మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి)

మూడు నెలల క్రితం మొగల్రాజపురంతో పాటు నగరంలో పలు చోట్ల తాగునీరు కలుషితం అవడంతో ప్రబలిన డయేరియా దెబ్బకు నగరం అతలాకుతలం అవడంతో పాటు నాలుగు ప్రాణాలు పోయిన ఘటన ఇంకా జనం మరవలేదు.తాజాగా పటమట దానయ్య వీధిలో మాత్రం ఇలాంటి సమస్య మొదలవుతుందని తెలిసినా, కంటి ముందు కనిపిస్తున్నా ఎవరు పట్టించుకోకపోతుండటంతో స్థానికులు ఎపుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు.

పటమట దానయ్య వీధిలో పక్కపక్కనే ఉన్న మూడిళ్ల ముందు సైడు కాల్వలో మూడు రకాల సమస్య ఉంది.

ఒక ఇంటి ముందు మంచినీటి పైపు పగిలి తాగునీరు బయటకు లీకవుతోంది. దాని పక్కనే ఉన్న ఇంటి ముందు రోడ్డు మధ్యలో యూజీడీ నిండి అదే ఇంటి ముందు సైడు కాల్వలోకి పొంగుతోంది. దీనికి కాస్తంత పక్కనే ఇటీవల కొత్తగా పెట్టిన ఒక లేడీస్ హాస్టల్ ఉన్న ఇంటికి సంబంధించి లోపల నుంచి రోడ్డు మధ్యలో ఉన్న యూజీడీకి కనెక్షన్ ఇచ్చే పైపు సైడు కాల్వలో నుంచి వెళుతోంది. పక్క ఇంటి ముందు యూజీడీ పొంగి సైడు కాల్వలోకి వస్తున్న మలమూత్రాలతో కలిసిన మురుగు హాస్టల్ ముందు కాల్వలో పైపు అడ్డుగా ఉండటంతో వెనక్కు తన్నుతోంది. ఇలా ఆగిపోయిన నీరు సైడు కాల్వలో మట్టం పెరిగి పగిలిన మంచినీటి పైపు చుట్టూ చేరుతోంది. ప్రతి రోజూ పారిశుధ్య సిబ్బంది వచ్చి లేడీస్ హాస్టల్ వద్ద కాల్వలో కర్రతో పొడుస్తున్నాడు. అప్పటికీ సమస్య కాసేపు తగ్గినా తరువాత మళ్లీ మామూలే. రోడ్డుమధ్యలో యూజీడీ స్ట్రక్ అయి మురుగు నీరు సైడు కాల్వలోకి వచ్చి మంచినీటి పైపు లైన్లలోకి చేరితే ఈ వీధిలో భారీ ప్రమాదం జరగడానికి అవకాశం ఉంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నగరానికి చేరిన కౌశిక్ దాస్ సైకిల్ యాత్ర

టీడీపీ నేతల అభినందనలు



కౌశిక్ దాసును అభినందిస్తున్న టీడీపీ నేతలు వర్ల రామయ్య తదితరులు

వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని కాపాడుకోవాలని, మొక్కలను విరివిగా పెంచాలని వెస్ట్ బెంగాల్ నాడియా జిల్లా, కళ్యాణి ప్రాంతం నుంచి సైకిల్ యాత్రికుడు, పర్యావరణ ప్రేమికుడు కౌశిక్ దాస్ సోమవారం విజయవాడకు చేరుకున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, నాయకులు బుచ్చిరాం ప్రసాద్, కొడూరు అనిల్‌లను కలుసుకున్నాడు. తన యాత్రను గురించి వారికి వివరించాడు. 14 రోజుల క్రితం యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. తన యాత్రకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు అతనిని అభినందించారు.

ఆర్టీసీలో ఐటీఐ అప్రంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

బస్టేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌ఆర్టీసీలో ఐటీఐ అప్రంటిస్ షిప్ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ వి.నీలిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఐటీఐలో ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6 నుంచి 20వరకు ఆన్‌లైన్‌లో జిల్లాల వారీగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఐటీఐ మార్కులు, సీనియార్టీ ప్రకారం ఎంపిక చేయబడతారన్నారు. వివరాలకు ఆర్టీసీ వెబ్‌సైట్ రిక్రూట్‌మెంట్ సెక్షన్‌లో చూడాలని తెలిపారు.

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

● అదనపు కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్

చిట్టినగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 14 అర్జీలు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ. సృజన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ బాబు శ్రీనివాస్, ఎస్‌ఈ పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పంజాబ్ నేషనల్ బ్యాంకు సర్కిల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన వాక్‌థాన్

అవినీతి నిర్మూలనపై చిత్తశుద్ధితో వ్యవహరించాలి

వాకథాన్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంకు సర్కిల్ హెడ్ డీజీఎం అభిజిత్ సిన్హా

ఆటోనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అవినీతి నిర్మూలనపై బ్యాంకు ఉద్యోగులు చిత్తశుద్ధితో, పారదర్శకంగా వ్యవహరించాలని పంజాబ్ నేషనల్ బ్యాంకు సర్కిల్ హెడ్ డీజీఎం అభిజిత్ సిన్హా అన్నారు. సోమవారం విజయవాడ పంజాబ్ నేషనల్ బ్యాంకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించింది. కామయ్యతోపు సెంటర్ నుంచి ప్రారంభమైన వాక్‌థాన్‌లో బ్యానర్లు, ప్లకార్డులతో అవినీతి వ్యతిరేకంగా నినాదాలతో సాగింది. అనంతరం అభిజిత్ సిన్హా సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కార్యాలయాల్లో సమగ్రతా ప్రతిజ్ఞ చేశారని తెలిపారు. తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలోని వృద్ధాశ్రమానికి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రిఫ్రిజిరేటర్, అల్మారాలు, రాక్‌లు విరాళంగా అందించారు. సీఎస్‌ఆర్ కార్యచరణ కింద ప్రకాశం జిల్లాలోని అంక్ గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు తెలిపారు.

టెట్‌లో ప్రతిభకు ర్యాంకులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సంస్థ డైరెక్టర్ జంపాన సుధాకర్, ఇతర ఉపాధ్యాయులు

లబ్బీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 2024 టెట్ ఫలితాలలో ప్రతిభ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారని ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జంపాన సుధాకర్ తెలిపారు. బందర్ రోడ్డులోని కోచింగ్ సెంటర్‌లో సోమవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థిని కోడూరి వెంకట దుర్గా భవాని 148.36 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిందని, 140 పైన మార్కులు 16మంది, 130 మార్కులు 43మంది సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ ఉపాధ్యాయులు కిషోర్, రమేష్, సలీం, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ విజేత మహికి అభినందనలు



విజయవాడ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 68వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ టోర్నమెంట్ అండర్-19 విజయవాడలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన మహికి శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ అభినందనలు తెలిపారు. కళాశాలలో ఎం.మహి సీనియర్ ఇంటర్ చదువుతోంది. ఈ పోటీలు గత నెల 27 నుంచి 29 వరకు జరిగాయి. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మహిని అభినందించారు.

చెస్‌లో చరణ్‌సాయికి ...



పటమట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ చెస్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనపరిచిన ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థి సీహెచ్ చరణ్‌సాయికి సోమవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహిం చారు. ఈ పోటీలు గత నెలలో విజయవాడ సీతారామపురంలో జరిగాయి. సాయి ఈ పోటీల్లో 154455 ర్యాంకును, స్టాండర్డ్ లెవెన్‌లో 1529 ర్యాంక్‌ను, రాపిడ్ లెవెల్ 1423 ర్యాంకును సాధించి అందరి మన్ననలు పొందాడని పాఠశాల ఇన్‌చార్జి పద్మ తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో పాఠశాల జోన్ ఈజీఎం మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, సీ బ్యాచ్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

ఆటోనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం యనమలకుదురులోని కుమార్తె వద్ద ఉంటున్న తోట లక్ష్మి(60) గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నిర్వహించే పూజా కార్యక్రమాలకు సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరింది. జేడీ నగర్ బస్టాప్ వద్ద బందర్ రోడ్డు దాటుతుండగా ఆటోనగర్ నుంచి బెంజిసర్కిల్‌కు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మిని స్థానికులు అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

20ఏళ్ల అభివృద్ధిని నాశనం చేసిన జగన్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు 20 ఏళ్లు పట్టిందని, వైసీపీ పాలించిన ఐదేళ్ల అసమర్థ పాలన వల్ల అభివృద్ధి మొత్తం ఆగిపోయి మళ్లీ మొదటికి వచ్చిందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు పరిధి 4వ డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలోని రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మాణం చేయడానికి సుమారు రూ.9లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పనులకు ఎమ్మెల్యే గద్దె శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పార్టీ కార్యకర్తకు స్వయం ఉపాధి నిమిత్తం ఇస్త్రీ బండిని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు.

అమరావతి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అమరావతి నిర్మాణానికి పుట్టగుంట వెంకట సీతారమణరావు, శేషమాంబ దంపతులు లక్షరూపాయల చెక్కును విరాళంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు అందజేశారు. చెక్కును అందజేసిన వారిని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, మండలం వెంకటేశ్వరరావు, ముమ్మనేని ప్రసాద్, చినుముల సురేష్, బొప్పన రామ్మోహన్‌రావు, తాతినేని శేషగిరిరావు, పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

మొగల్రాజపురం: పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేయించుకుని శాసనమండలిలో ఓటు వేయాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు ఇచ్చారు. సోమవారం 8వ డివిజన్ పిన్నమనేని రోడ్డులో మదర్ థెరిసా జంక్షన్‌లో, 13వ డివిజన్‌లో సాయిబాబా కల్యాణమండపం వద్ద ఎమ్మెల్సీ ఓట్ల జాబితాలో పేర్లు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6లోగా ఓటరుగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, ముమ్మనేని ప్రసాద్, మాజీ కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ స్క్రీనింగ్ పరీక్ష 11కు వాయిదా

కృష్ణలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ, ఎస్సీ ఎస్టీ స్క్రీనింగ్ పరీక్ష ఈ నెల 3న జరగాల్సి ఉండగా ఈ నెల 11కి మార్పు చేసినట్లుగా జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అభ్యర్థులు పరీక్ష తేదీ మార్పును గమనించాల్సిందిగా కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు తాడేపల్లి కార్యాలయం నుంచి స్క్రీనింగ్ పరీక్షలో పాల్గొనే (408) అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచా రాన్నిపంపుతారని తెలిపారు. స్క్రీనింగ్ పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుందని ఆయన తెలిపారు.

షూటర్ అక్షయకు ప్రశంసలు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన ఏపీ స్టేట్ 68వ స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల 10 మీటర్ల రైఫిల్ పీప్సైట్ విభాగంలో ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థిని దాయిం అక్షయ(ఇంటర్ మొదటి సంవత్సరం) అద్భుతమైన ప్రతిభ కనపర్చి స్వర్ణం వశం చేసుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మధుకర్‌రెడ్డి అక్షయను ప్రశంసించారు. అక్షయ తాడిగడపలోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్సు డైరెక్టర్, చీఫ్ కోచ్ సుబ్రహ్మణ్యేశ్వరరావు వద్ద శిక్షణ పొందుతోంది.



















చక్రవ్యూహం

హైదరాబాద్ నుంచి విజయవాడలోకి ప్రవేశించేందుకు ముఖద్వారంగా ఉన్న గొల్లపూడి వన్ సెంటర్ ఒక క్రమపద్ధతి లేని ట్రాఫిక్ చక్రవ్యూహంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. అక్కడ రోడ్లేమన్నా ఇరుకుగా ఉన్నాయా అంటే అదేం లేదు. విశాలమైన రోడ్లున్నాయి. మరి ఎందుకింత రద్దీ అంటే ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యమే కారణం. వాహనదారులు ఒక క్రమ పద్ధతిలో కాకుండా ఎటు ఖాళీ కనిపిస్తే అటు ఇష్టారీతిన రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ఎదురుగా ఉన్నా వాహనదారులు పట్టించుకోవడం లేదు. ఇంత పెద్ద సెంటర్లో సిబ్బంది మాత్రం అరకొరగానే ఉన్నారు. ఉన్న సిబ్బంది కూడా ట్రాఫిక్‌ను క్లియర్ చేసే పనులు చేయకుండా ఏ చెట్టు కిందకో, ఏ షాపు వద్దకో వెళ్లి అక్కడే కాలం గడుపుతున్నారు. దీంతో రద్దీ మరింత పెరిగి వాహనదారులు గొడవలు పడుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





మహోన్నత దాతలు



మహిళకు అన్న ప్రసాదం అందిస్తున్న పుట్టగుంట

విజయవాడకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీశ్ కుమార్‌కు బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద లెదర్ ఫ్యాక్టరీ ఉంది. సుమారు 15ఏళ్ల క్రితం ఓ రోజు కారులో వెళుతుంటే కాలినడకన వెళుతున్న భవానీలు కనిపించారు. సుదూరం నుంచి వస్తుండటంతో కాళ్లకి పుండ్లు పడి రోడ్డు పక్కనే కూర్చుని సేద దీరుతుడగా చూశారు. వారిలో మహిళలు, వృద్ధులు, చిన్నారులుండటం చూసి మనసు చలించింది. తన వంతు ఏం చేయగలనాని ఆలోచించారు. అన్నదానాన్ని మించింది లేదని తలచి వెంటనే వారికోసం తన ఫ్యాక్టరీ ఆవరణలో అన్నప్రసాద వితరణ కేంద్రం ఏర్పాటుకు నడుం బిగించారు. కృష్ణా జిల్లా ముఖద్వారమైన బొమ్ములూరులో ఏర్పాటు చేశారు. కాలి నడక సుదూరాల నుంచి వస్తున్న భవానీలకు 15ఏళ్లుగా అన్నదానంతోపాటు విశ్రాంతి కోసం వసతి, వైద్య సదుపాయాలను కల్పిస్తున్నారు. దీక్షాసమయంలో భవానీలు పాటించే అన్ని నియమాలను తాను కూడా పాటిస్తూ శుచి, శుభ్రతతో కూడిన ఆహారంతోపాటు భక్తుల కాళ్లకు బొబ్బలొస్తే స్వయంగా తానే వారి కాళ్లకు లేపనాలు రాస్తూ మానవ సేవే మాధవ సేవ అన్న దాన్ని ఆచరించి చూపుతున్నారు. ఇలాంటి అన్నప్రసాద వితరణతో కూడిన వసతి, వైద్య శిబిరం ఎక్కడా కనిపించలేదని ఒడిశాకు చెందిన భవానీ భక్తబృంద సభ్యులు పుట్టగుంటకు కితాబిచ్చారు. ఆయన సేవలను గుర్తించి ఉన్నతాధికారులతోపాటు ప్రముఖ వైద్యులు, సినీ నటులు కూడా ఈ సేవలో పాల్గొనేందుకు ముందుకు రావడం గమనార్హం.

అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అంటారు. ఏది దానంగా ఇచ్చినా.. ఎంత ఇచ్చినా.. ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. కానీ అన్నదానం చేస్తే దానం తీసుకున్న వారు ఇంక చాలు అని చెప్పి సంతృప్తి పడతారు. అలాంటి మహోన్నతదాతలే ఈ పుట్టగుంట సతీశ్, అడపా సోదరులు. - హనుమాన్ జంక్షన్ రూరల్ - ఆంధ్రజ్యోతి



అన్నప్రసాద వితరణలో సేదతీరుతున్న భవానీలు, భక్తులు



భవానీల పాదాలకు లేపనం పూస్తున్న సతీష్‌కుమార్



అడపా యుగంధరరావు, దేవులబాబు ఆధ్వర్యంలో పూజ

అయ్యప్పల సేవలో..

బాపులపాడు మండలం శేరీనరసన్నపాలెంలో అడపా యుగంధరరావు గురుస్వామి ఆధ్వర్యంలో పదేళ్లుగా అయ్యప్పలకు భక్తిశ్రద్ధలతో బిక్ష ఏర్పా టు చేస్తున్నారు. గురుస్వామి ఆధ్వర్యం లో దేవులబాబు, సతీష్ పర్యవేక్షణలో 41 రోజుల పాటు ప్రతి రోజూ సుమా రు 200 మందికిపైగా దీక్షాదారులకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నా రు. గ్రామాల్లోని అయ్యప్ప దీక్షాదారులకు ప్రతిరోజూ ప్రత్యేక పూజ అనంతరం మధ్యాహ్నం 2గంటల వరకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్టు దేవులబా బు తెలిపారు. అనివార్యకారణాలతో ఇంటివద్ద బిక్ష చేసుకోలేని దీక్షాపరులతోపా టు అయ్యప్పలకూ పదేళ్లుగా అన్నప్రసాద వితరణ చేస్తున్నట్టు తెలిపారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్ తేదీలు మార్చండి



అనూరాధకు వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్‌ఐ నేతలు

వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు జనవరి 5 నుంచి కాకుండా ఫిబ్రవరిలో నిర్వహించేలా ఒక నెల పాటు పరీక్షల షెడ్యూల్ తేదీలను పొడిగించాలని కోరుతూ డీవైఎఫ్ఐ నేతలు సోమవారం ఏపీపీఎస్సీ చైర్ పర్సన్ అనూరాధకు వినతి పత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము ఆధ్వర్యంలో అనూరాధను కలిసి గ్రూప్-2కు సంబంధించి గతేడాది డిసెంబరులో 899 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని, ఈ ఏడాది ఫిబ్రవరి 25న 4లక్షల మంది ప్రిలిమ్స్ పరీక్ష రాశారన్నారు. ఏప్రిల్ 10న ఫలితాలు ప్రకటించారని, జూలై 28న మెయిన్స్‌కు నిర్వహించాల్సిన పరీక్షను సంస్థకు ఛైర్మన్ లేక వాయిదా వేశారన్నారు. ఇప్పుడు ఆకస్మికంగా జనవరి 5 నుంచి మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారని, దీంతో పేద అభ్యర్థులకు నష్టం జరుగుతుందన్నారు. సిలబస్‌ను దృష్టిలో పెట్టుకుని 90 నుంచి 120 రోజులు గడువు ఇవ్వాలన్నారు. డిసెంబరు చివరి వారంలో పోలీస్ కానిస్టేబుల్ ఈవెంట్స్, రైల్వే పరీక్షలు వంటివి ఉన్నాయని, ఏపీపీఎస్సి ప్రకటించిన గ్రూప్ టూ మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌కు సిద్ధం కావటం కష్టతరమవుతుందన్నారు. మరోవైపు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టకపోవటంతో ఏపీ అర్థశాస్త్రం అభ్యర్థులు ఎలా అవగాహన చేసుకోగలుగుతారని ప్రశ్నించారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా కోర్టు మెట్లు ఎక్కకుండా చూసేందుకు ప్రకటించిన షెడ్యూల్‌ను సవరించి ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహించేలా చూడాలని కోరారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి జ్యోతి

కృష్ణలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాలు ఇతర ఏదైనా చట్టం కింద లైసెన్సు తీసుకున్నా, జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం 2015లోని సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి పి.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన చట్టాలు, నిబంధనల మేరకు 'రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల' కోసం పూర్తిగా కానీ, లేదా పాక్షికంగా కానీ నడుపబడుతున్న బాలసంరక్షణ కేంద్రాలు జువైనల్ జస్టిస్ చట్టం 2015లోని సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనిపై ప్రభుత్వం ఈ నెల 22న అధికారిక ప్రకటన జారీ చేసిందన్నారు. దరఖాస్తు సహా అన్ని కాపీలు జతచేసిన ఈ నెల 11లోగా సంచాలకులు, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధిబాలల సంక్షేమ శాఖ, విజయవాడ కార్యాలయానికి పంపాలన్నారు. పూర్తి నోటిఫికేషన్, చిరునామా, అర్హతలు, జతపరచాల్సిన డాక్యుమెంట్లు చెక్‌లిస్టులు మొదలైన వాటిని హెచ్‌టీటీపీ://డబ్ల్యుడిసిడబ్ల్యు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. దరఖాస్తులను స్పీడ్‌పోస్టు, రిజిస్టర్ పోస్టు ద్వారా మాత్రమే సాఫ్ట్ కాపీస్ సీసీఐ.ఆర్ఈజీ2024ఎట్‌దిరేట్‌ఆఫ్‌జీమెయిల్.కామ్ ద్వారా పంపాలన్నారు. వివరాలకు ఎన్టీఆర్ జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి 7780399779, ఎం.రాజేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా బాలల సంరక్షణ అధికారి 9948057583 వారిని సంప్రదించవచ్చునని జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి పి.జ్యోతి కోరారు.



ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం

ఐజీఎంసీ స్టేడియానికి దొంగల బెడద

● విలువైన కాపర్‌వైర్లు, ఫ్లడ్‌లైట్లు, పంపుల బిరడాల చోరీ

● స్థానిక బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియానికి దొంగల బెడద పెచ్చుమీరుతోంది. వివిధ క్రీడా సంఘాల అసోసియేషన్ల హాల్స్, స్టేడియం ఆవరణలోని ఫ్లడ్‌లైట్లు, టాయిలెట్లలో ఇనుప పంపుల చోరుల పాలవుతున్నాయి. స్టేడియం పరిసరాల్లోని శిఖామణి సెంటర్, కస్తూరిబాయి పేటల్లోని గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు చెందిన యువకులు వారి రోజూవారీ అవసరాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ హాల్‌లోని ఏసీలకు చెందిన అవుట్‌డోర్లకు ఉండే కాపర్‌వైర్లు 3 నెలలు క్రితం చోరీకి గురయ్యాయి. చిన్నారుల శిక్షణకు ఇబ్బందుల్లేకుండా ఏసీలను ఏర్పాటు చేయగా, వాటి అవుట్‌డోర్ యూనిట్లు బయటకు ఉండటం, వాటికుండే కాపర్ వైర్లను కట్ చేసుకుని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు వేలల్లో ఖర్చుపెట్టి వాటికి కొత్తగా కాపర్‌వైర్లను వేయించుకున్నారు. వీటికి వేలల్లో ఖర్చవుతోంది. ప్రమాదకరమైన స్థాయిలో వైర్ల దొంగతనాలకు బరితెగించి మరీ కాపర్ వైర్లు కట్ చేసుకుని పోతుండటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. క్రికెట్ అసోసియేషన్, అథ్లెటిక్స్, వాకర్స్ అసోసియేషన్ల ఏసీలకు చెందిన కాపర్‌వైర్లు ఇటీవల చోరీకి గురయ్యాయి. నెట్‌బాల్ పోల్స్, మరుగుదొడ్లలో వాడే ఇనుప బిరడాలు ఎత్తుకుపోయారు. పోలీసుల అమరవీరుల దినోత్సవానికి రెండు రోజుల ముందు ఈ కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో టీటీ కోచ్ శ్రీనివాస్ మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పురోగతి లేదు. వాచ్‌మెన్లు తిరుగున్నా రాత్రి 11 గంటలకు దాటాక ఈ విచ్చలవిడి దొంగతనాలకు స్థానిక యువకులు పాల్పడుతున్నారు. వీరి ఆటకట్టించి విలువైన వస్తువులు చోరీకి గురికాకుండా చూడాలని అసోసియేషన్లు, కోచ్‌లు కోరుతున్నారు. ఇటువైపు పోలీసుల నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇసుక దందాలో కొత్త కహానీ

● వరుస సోదాలతో ఇసుకాసురులు ఉక్కిరిబిక్కిరి ● ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్న మాఫియా

● భారీగా వాహనాల కొనుగోళ్లు ● తెలంగాణ భూభాగంలో ఇసుక డంప్‌లు ● అక్కడా డ్రోన్లు ఎగురవేయాలని కాప్స్ నిర్ణయం



ప్రభుత్వం ఉచిత ఇసుకకు అనుమతిచ్చిన తర్వాత ఎన్టీఆర్ జిల్లాలో తెలంగాణ సరిహద్దును ఆనుకుని ఉన్న గ్రామంలో ఒక వ్యక్తి ఒకటి, రెండు కాదు... ఏకంగా 50 కొత్త ట్రాక్టర్లను కొనుగోలు చేశాడు. టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు కొద్దిరోజులుగా గ్రామాలను జల్లెడ పట్టినప్పుడు వెలుగులోకి వచ్చిన విషయం ఇది. ఇసుకను తరలింపునకు కొనుగోలు చేసినట్టు యజమాని అంగీకరించాడు. దీంతో పోలీసులకు నోటమాట రాలేదు. మరో గ్రామంలో ఓ వ్యక్తి 4 టిప్పర్లను లీజుకు తీసుకుని తన ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో నిలిపాడు. తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పోలీసులు, రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులు వరుసగా చేస్తున్న సోదాల్లో వెలుగులోకి వచ్చిన అంశాలివి. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

అధికారులు చేస్తున్న తనిఖీల్లో ఇసుకాసురులకు సంబంధించిన కొత్త కథలు బయటకు వస్తున్నాయి. ఇసుకపై ఇంత దారుణంగా వ్యాపారం సాగుతుందా అని అధికారులే ఆశ్చర్యపోతున్నారు. జిల్లాలో ఇసుక కొరతకు వరదలు ఒక కారణమైతే, ఇసుకను అక్రమంగా తెలంగాణ సరిహద్దులు దాటించడమే ప్రధాన కారణమని గుర్తించారు. ఈ బృందాలు రీచ్‌లు మొదలుకొని చుట్టుపక్క ప్రాంతాల్లో డంప్ చేసిన ఇసుక సీజ్ చేయడంతో ఈ మాఫియా ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

జిల్లాలోనే అత్యధిక ఎక్స్‌కవేటర్లు

జీపీఎస్ పరికరాలున్న వాహనాలను మాత్రమే రీచ్‌ల్లోకి అనుమతించాలని అధికారులు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ వాహనాలు కచ్చితంగా భూగర్భ గనుల శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అలాంటి వాహనాలను మాత్రమే రీచ్ వద్దకు వెళ్తాయి. జిల్లాలో గుర్తించిన 15 ఇసుక రీచ్‌ల్లో 11 లక్షల మెట్రిట్ టన్నుల ఇసుకు లభ్యత ఉందని భూగర్భ గనుల శాఖ లెక్కలు తేల్చి ప్రభుత్వానికి పంపింది. ఇప్పటి వరకు నిలిచిన నీరు తగ్గిపోవడంతో త్వరలో తవ్వకాలను చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. జీపీఎస్ వాహనాలు రీచ్‌ల్లో ఇసుకను లోడ్ చేసుకుని స్టాప్ పాయింట్ల వద్ద దింపాలి. ఎక్స్‌కవేటర్లు ఆయా వాహనాల్లోకి లోడ్ చేస్తాయి. తవ్వకాలు ఆరంభమయ్యాక ఈ ఎక్స్‌కవేటర్లను రాత్రి సమయాల్లో ఉపయోగించుకుని ఇసుకాసురులు తోడేస్తారని భావించిన పోలీసులు వాటి లెక్కలు తీశారు. రాష్ట్రంలో మొత్తం ఎక్స్‌కవేటర్లు ఎన్ని ఉన్నాయన్న లెక్కలను పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు రప్పించుకుని చూడగా ఎన్టీఆర్ జిల్లాలోనే అత్యధికంగా ఉన్నట్టు తేలింది. మొత్తం 1500 ఎక్స్‌కవేటర్లున్నాయని గుర్తించారు. ఇప్పటికే వాటి యజమానులకు నోటీసులిచ్చారు. త్వరలో వీటికి జీపీఎస్ పరికరాలను అమర్చాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణలో ఏపీ డ్రోన్లు?



ఇసుక మాఫియా అక్రమంగా డంప్ చేసిన గుట్టలను డ్రోన్లతో గుర్తించిన పోలీసులు తెలంగాణ సరిహద్దు దాటి వాటిని ఎగురవేయాలని భావిస్తున్నారు. జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల నుంచి వివిధ మార్గాల్లో తెలంగాణకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ ఇసుకను తెలంగాణ సరిహద్దు దాటాక డంప్ చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. జిల్లాలోని రీచ్‌ల వద్ద ఎగురవేసినట్టుగానే డ్రోన్లను తెలంగాణ సరిహద్దులు దాటించాలని పోలీసులు నిర్ణయించారు. ఇలా గుర్తించిన ఇసుక డంప్‌లను సీజ్ చేసి జిల్లా సరిహద్దులోకి తీసుకురావాలన్న ప్రణాళికపై అధికారుల మధ్య చర్చలు నడుస్తున్నాయి.



భగవద్గీత పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

డిసెంబరు 9, 10న శ్లోక కంఠస్థ పోటీలు

లబ్బీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు డిసెంబర్ 9,10 తేదీల్లో భగవద్గీతలోని 6వ అధ్యాయం, ఆత్మ సంయమ యోగం నందు, ఇతరులకు సంపూర్ణ భగవద్గీత నందు జూనియర్, సీనియర్ విభాగాల్లో శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ తెలిపారు. ఈ పోటీల కరపత్రాల ఆవిష్కరణ సోమవారం టీటీడీ కల్యాణ మండపంలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ డిసెంబరు 9న మధ్యాహ్నం 3గంటలకు టీటీడీ కల్యాణ మండపంలో సంపూర్ణ భగవద్గీత పోటీలు జరుగుతాయని, 10న 6,7,8,9 తరగతి విద్యార్థులకు ఉదయం 9గంటలకు ఏలూరు రోడ్డు చుట్టుగుంట సెంటర్లోని ఈస్ట్ లైన్స్ క్లబ్ హాల్‌లో 6వ అధ్యాయంలోని శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ 4 విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. వివరాలకు 7032255499 నంబరులో సంప్రదించాలన్నారు. ధర్మ ప్రచార పరిషత్ జూనియర్ అసిస్టెంట్ కల్యాణ్ శ్రీరామ్, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు బొగ్గవరపు వెంకట బాల కోటేశ్వరరావు, నందూరి వెంకట తాండవ కృష్ణ, కల్యాణ మండపం మేనేజర్ ఆర్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

మూలపాడు స్టేడియంలో క్రికెట్ అకాడమీ ఏర్పాటుకు కృషి

ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్



మూలపాడు స్టేడియంలో ఎంపీ శివనాథ్, జంపాల, రామినేని తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూలపాడు క్రికెట్ స్టేడియంలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చెప్పారు. ఆయన సోమవారం మూలపాడులో డాక్టర్ గోకరాజు ఏసీపీ క్రికెట్ స్టేడియంను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలపాడు క్రికెట్ స్టేడియానికి వచ్చేందుకున్న మూడు దారుల అభివృద్ధికి అధికారులకు ఆదేశాలివ్వనున్నట్టు తెలిపారు. స్టేడియానికి మంచిరోజులు రానున్నాయన్నారు. ఈ స్టేడియంలో త్వరలో గోల్ఫ్ కోర్స్ వస్తే ఇబ్రహీంపట్నం మండలంలో దాదాపు 400 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఏసీఏ గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ క్రీడాకారులను వెలికి తీయటానికి పనిచేస్తోందన్నారు. ఐపీఎల్, ఏపీఎల్ రావడంతో క్రికెట్‌లో క్రీడాకారులకు ఎన్నో అవకాశాలు వచ్చాయన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో క్రికెట్ గ్రౌండ్స్ లేని రూరల్ ప్రాంతాల్లో ఏసీఏ తరపున గ్రౌండ్స్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఏసీఏ అడ్మిన్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, కేడీసీఏ సెక్రటరీ ఎం.రవీంద్ర చౌదరి, జాయింట్ సెక్రటరీ రజనీకాంత్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కాకి నాగరాజు, పార్టీ మండలాధ్యక్షుడు రామినేని రాజా, గరికపాటి శివ, బలంబాబు, మాగంటి నరసింహ చౌదరి పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన వి.స్వామి నాయుడు

విద్యాధరపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ కల్చరల్ సొసైటీకి సీఈఓగా డిప్యూటీ కలెక్టర్ వి.స్వామి నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భవానీఐలాండ్ టూరిజం కార్పొరేషన్ ఇన్‌చార్జి సీఈఓగా కూడా స్వామి నాయుడు వ్యవహరించనున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆప్కాబ్ విరాళం



చెక్కులు అందిస్తున్న ఆప్కాబ్ అధికారులు, ఉద్యోగులు

ఆటోనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఆప్కాబ్ రూ.1.16 కోట్లు, ఆప్కాబ్ ఉద్యోగులు రూ.8,06,597 చెక్కులను సీఎం చంద్రబాబుకు మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి సంస్థ ఎండీ డాక్టర్ ఆర్.ఎస్ రెడ్డి, సీజీఎంలు ఎస్.వెంకటరత్నం, బి.రామచంద్రయ్య, ఉద్యోగులు సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు.

సీఎస్ఆర్ కింద రూ.4 కోట్లు అందించిన ఎన్‌టీటీపీఎస్

కృష్ణలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద వివిధ కార్యక్రమాలు చేపట్టేందుకు ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డా.ఎన్‌టీటీపీఎస్) రూ.4కోట్ల చెక్కును సోమవారం కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనాకు సంస్థ అధికారులు అందజేశారు. ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎన్ చక్రధర బాబు మార్గనిర్దేశనం మేరకు నిధులు సమకూర్చడం జరిగిందని అధికారులు తెలిపారు. తాజాగా నిధులతో కొండపల్లి, ఇబ్రహీంపట్నం, ఈలప్రోలు, గుంటుపల్లి, జూపూడి, తుమ్మలపాలెం, మూలపాడు, కిలేశపురం గ్రామాల్లో సీఎస్ఆర్ కార్యకలాపాలు చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్‌ను కోరారు. గ్రిడ్ డిమాండ్ ఆధారంగా షెడ్యూల్ ప్రకారం బ్యాలెన్స్ 3 యూనిట్ల ఓవర్‌హాల్ ద్వారా కాలుష్యాన్ని తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. సీపీవో వైశ్రీలత, సూపరింటెండెంట్ ఇంజినీర్ (సివిల్) సీహెచ్.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

నలుగురి ప్రాణాలు తీసిన ఫ్లెక్సీ

- విద్యుత్‌ వైర్లకు తగలడంతో ఘోరం
- ఒకరికి తీవ్రగాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- తూర్పుగోదావరి జిల్లా తాడిపర్రులో ఘటన

ఉండ్రాజవరం/పెరవలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫ్లెక్సీ కడుతుండగా నలుగురు యువకులు విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డారు. ముగ్గురికి గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో ఈ పెను విషాదం చోటుచేసుకుంది. సర్దార్‌ పాపన్న గౌడ్‌ విగ్రహ ఏర్పాటుకు గౌడ సామాజిక వర్గం గత 18 నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు స్థల వివాదం కారణంగా విఫలమవుతూ వచ్చాయి. ఇటీవల మళ్లీ స్థల వివాదం తెరపైకి రావడంతో జిల్లా అధికారులు, నాయకులు శాంతి చర్చలు జరిపి ఒక కమిటీ వేసి కొన్ని నిబంధనలతో విగ్రహ ఏర్పాటుకు అనుమతిచ్చారు. దీంతో సోమవారం ఉదయం సినీ నటుడు సుమన్‌ చేతుల మీదుగా విగ్రహ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున ఏడుగురు యువకులు తమ ఫొటోలతో రూపొందించిన 20 అడుగుల ఎత్తు ఉండే సర్దార్‌ పాపన్నగౌడ్‌ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తుండగా, పైన సింగిల్‌ ఫేజ్‌ విద్యుత్‌ వైరుఫ్లెక్సీ ఐరన్‌ ఫ్రేమ్‌కు తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో ఫ్లెక్సీలు పట్టుకున్న ఏడుగురిలో బొల్లా వీరరాజు(26), పామర్తి నాగేంద్ర(25), మారిశెట్టి మణికంఠ(26), కాసగాని కృష్ణ(25) అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన కోమటి అనంతరావును కాకినాడ, స్వల్పగాయాలపాలైన ఇద్దరిని తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో మృతదేహాలను మంత్రి దుర్గేష్‌ పరిశీలించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు. ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.ఐదేసి లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ అన్నారు.

కస్తూరి వ్యాఖ్యలపై తెలుగు సంఘాల ఆగ్రహం

- దీంతో వెనక్కి తగ్గిన సినీనటి
- తన మాటలను డీఎంకే వక్రీకరించిందని ఆరోపణ
- తెలుగువారంటే తనకు గౌరవమంటూ వివరణ

చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తెలుగువారిని అవమానించేలా సినీ నటి కస్తూరి చేసిన వ్యాఖ్యలపై తెలుగు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా నెటిజన్లు ఆమెపై దుమ్మెత్తిపోశారు. దీంతో వెనక్కి తగ్గిన కస్తూరి.. తన వ్యాఖ్యలను డీఎంకే వారు వక్రీకరించి తప్పుడు ప్రచారం చేశారని, తనకు తెలుగువారంటే ఎంతో గౌరవమంటూ మీడియా ముందు వివరణ ఇచ్చారు. ఆదివారం చెన్నైలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. 300 ఏళ్ల కిందట ఒక రాజు వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి తెలుగు ప్రజలు వచ్చారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' ఆ వ్యాఖ్యలను ప్రచురించింది. దీంతో కస్తూరిపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జ్‌ డాక్టర్‌ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, ద్రావిడదేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు తదితరులు ఆమె వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. చరిత్ర తెలియని అజ్ఞాని అని, తెలుగువారిని కించపరిచేలా చేసిన వ్యాఖ్యల పట్ల క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు. ప్రపంచం నలువైపుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో కస్తూరి సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తన వ్యాఖ్యలను డీఎంకే వక్రీకరించి, ప్రచారం చేస్తోందని, తాను తెలుగు ప్రజలను కించపరిచేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని పేర్కొన్నారు. తెలుగు ప్రజలు, తెలుగు జాతి అనే పదాలను ఎక్కడా ఉపయోగించలేదని, తాను తెలుగు ప్రజలను ఎంతగానో గౌరవించే వ్యక్తినని వివరణ ఇచ్చుకున్నారు. కాగా.. తెలుగువారిని కించపరిచేలా మాట్లాడిన కస్తూరిపై తేని జిల్లా అత్తిగరం పోలీసు స్టేషన్‌లో కొందరు మహిళలు ఫిర్యాదు చేశారు.

మా ఇంటికి ప్రధాని రావడం తప్పేమీ కాదు

అధికారాల విభజన ఉల్లంఘన కిందికి రాదు



● వ్యవస్థల మధ్య చర్చలు అవసరమే.. జస్టిస్‌ చంద్రచూడ్‌ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 4: ప్రధాని నరేంద్ర మోదీ తన నివాసానికి రావడంలో తప్పేమీ లేదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ డి.వై.చంద్రచూడ్‌ అన్నారు. జస్టిస్‌ చంద్రచూడ్‌ నివాసంలో జరిగిన గణపతి పూజలకు ప్రధాని హాజరవడంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య చర్చలు జరుగుతుంటాయని, వాటిని గౌరవించాల్సి ఉంటుందని తెలిపారు. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య అధికార విభజన ఉందని, దానిని ఉల్లంఘించేలా రెండు వ్యవస్థల అధిపతులు ఈ తరహాలో భేటీ కావడం సరికాదన్న విమర్శలకు కూడా ఆయన సమాధానం ఇచ్చారు. అధికారాల విభజనకు దీనికి సంబంధం లేదని అన్నారు. నిజానికి వ్యవస్థల మధ్య సమన్వయం అవసరమేనని చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో రాజకీయ పరిపక్వతను ప్రదర్శించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సోమవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ "గణపతి పూజ నిమిత్తం ప్రధాని నా నివాసానికి రావడం తప్పేమీ కాదు. ఇలాంటివి జరుగుతునే ఉంటాయి. రాష్ట్రపతి భవన్‌లోనూ, రిపబ్లిక్‌ ఉత్సవాల్లోనూ కలిసి మాట్లాడుతునే ఉంటాం. ఇవేవీ కేసుల గురించి కాదు. జీవితాలు, సమాజం గురించి ముచ్చటిస్తుంటాం" అని అన్నారు. న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల గురించి చెబుతూ.. "అధికార విభజన అంటే న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు కలుసుకోకూడదన్న అర్థం కాదు. హేతుబద్ధమైన చర్చలు జరపకూడదనీ కాదు. రాష్ట్రాల్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు పరిపాలన కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి వివిధ అంశాలపై చర్చలు జరపడం ఓ ప్రొటోకాల్‌గా ఉంది. కోర్టుల్లో మౌలిక సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, బడ్జెట్‌ తదితర అంశాలపై చర్చిస్తారు. ప్రజల జీవితాలు, ఉపాధి కోసం రెండు వ్యవస్థల మధ్య సంభాషణలు అవసరమ"ని చెప్పారు. కార్యనిర్వాహక వ్యవస్థ తీర్పులు చెప్పదు..న్యాయవ్యవస్థ విధానాలను రూపొందించదు... దీనిని గుర్తుంచుకోవడమే అధికార విభజన అని వివరించారు. వీటిని అర్థం చేసుకోవడానికి రాజకీయ పరిపక్వత ఉండాలని అన్నారు. "మా రాతలను చూసే జడ్జీలను గౌరవిస్తారు. మేం తీసుకునే నిర్ణయాల్లో రహస్యం ఏమీ ఉండదు. అన్నీ సమీక్షకు లోబడేవే" అని చెప్పారు. అందువల్ల న్యాయమూర్తులపై నమ్మకం ఉంచాల్సిన అవసరం ఉందని అన్నారు. అయోధ్య తీర్పు సందర్భంగా దేవుడిని ప్రార్థించానంటూ జస్టిస్‌ చంద్రచూడ్‌ చేసిన వ్యాఖ్యపైనా విమర్శలు వచ్చాయి. దీనిపై స్పందిస్తూ "సామాజిక మాధ్యమాలతో ఇదే సమస్య. ఏ సందర్భంలో మాట్లాడానో పట్టించుకోరు. నా స్వగ్రామం కన్హేరసర్‌లో జరిగిన సన్మాన సభలో మాట్లాడాను. రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపై తీర్పు రాసే ముందు మార్గం చూపించాలని దేవుడిని ప్రార్థించానని చెప్పాను. సంక్లిష్టమైన కేసుల్లో పరిష్కారం లభించనప్పుడు ఇలా చేస్తుంటాం. దీనిపైనా విమర్శలు చేశారు" అని వ్యాఖ్యానించారు.

'రెవెన్యూ' అక్రమాలపై కొరడా

- సర్వేయర్లు, వీఆర్వోలపై విచారణకు ఆదేశం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో రైతులు, సామాన్య ప్రజలను భూ వివాదాల్లో ఇరికించి రాచిరంపానపెడుతున్న కొందరు రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. వారిపై అవినీతి నిరోధక చట్టం కింద నమోదయిన కేసుల్లో న్యాయ విచారణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీరిలో మండల సర్వేయర్‌, గ్రామ సర్వేయర్‌, వీఆర్వోలు ఉన్నారు. సోమవారం ఒక్కరోజే 10 మందిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆ అధికారులపై అవినీతి నిరోధక చట్టం- 1988 కింద క్రిమినల్‌ కేసులు నమోదుచేసి ప్రాసికూట్‌ చేయనున్నారు. రైతులు, సామాన్య ప్రజలు బాధితులు కావడంతో అవినీతి అధికారులపై తీవ్ర చర్యలు తీసుకోవడం గమనార్హం. ఏసీబీ కేసులు ఎదుర్కొంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌, డిప్యూటీ తహసీల్దార్‌, తహసీల్దార్‌, డిప్యూటీ కలెక్టర్‌, సర్వే విభాగంలోని పలు కేడర్ల అధికారులపై కూడా రానున్న రోజుల్లో ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.

ఒకేరోజు పది జీవోలు..

రెవెన్యూశాఖ సోమవారం 10 జీవోలు విడుదల చేయగా, అవన్నీ ఏసీబీ కేసులకు సంబంధించినవే. వాటిని రహస్యంగా ఉంచగా 'ఆంధ్రజ్యోతి' ఆరాతీసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా కల్యాణదుర్గం మండల సర్వేయర్‌ హేమసుందర్‌, బాపట్ల జిల్లా యాజిలి గ్రామ సర్వేయర్‌ హేమంత్‌, విజయనగరం జిల్లా రాజాం మండల సర్వేయర్‌ వి.చందర్‌రావుతో పాటు మరో నలుగురు మండల సర్వేయర్లు, ముగ్గురు వీఆర్వోలు జగన్‌ ప్రభుత్వంలో ఏసీబీకి పట్టుబడ్డారు. అలా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వారిలో 65 మందిపై న్యాయ విచారణకు అనుమతి కోరుతూ ఏసీబీ 2022 నుంచి 2024 వరకు ప్రతిపాదనలు పంపించింది. వీటిపై అప్పటి అధికారులు పెద్దగా స్పందించలేదు. రీ సర్వేలో తప్పులపై ఇటీవల సమీక్ష చేయగా గ్రామస్థాయిలో కొందరు అధికారుల అరాచకాలు వెలుగుచూశాయి. దీంతో రైతులను వేధించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూశాఖను ఆదేశించారు. దీంతో గత కొద్దిరోజులుగా పెండింగ్‌లో ఉండిపోయిన, కావాలని గత ప్రభుత్వం తొక్కిపెట్టిన ఏసీబీ, విజిలెన్స్‌ కేసులను రెవెన్యూశాఖ పరిశీలన చేస్తోంది. దీంట్లో భాగంగా సోమవారం ఒక్కరోజే ఏసీబీ కేసుల్లో ఉన్న 10 మంది రెవెన్యూ అధికారులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌.పి. సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక, రెవెన్యూ పరిధిలో ఏసీబీ, విజిలెన్స్‌ కేసులు 270కిపైగా ఉన్నట్లు తెలిసింది. రైతుల నుంచి లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీకి దొరికినవారి కేసులు ఇంకా 72 దాకా ఉన్నాయి. దీంతోపాటు విజిలెన్స్‌ కేసులున్నాయి. వీటిపై సత్వరమే నిర్ణయాలు తీసుకోవాలని రెవెన్యూశాఖను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో అధికారులు పెండింగ్‌ ఫైళ్లను ఆగమేఘాలమీద రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపిస్తున్నారు.

డిప్యూటీ కలెక్టర్లపై కూడా..

జగన్‌ ప్రభుత్వంలో విలువైన ప్రభుత్వ భూముల పరాధీనం, అసైన్డ్‌, చుక్కల భూముల అన్యాక్రాంతంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న, రాజకీయనేతలకు కొమ్ముకాసి భూములు కోల్పోయేలా చేసిన కొందరు డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లపై ఫిర్యాదులు వచ్చాయి. వీటిని క్రోడీకరించగా 18 మందిపై వచ్చిన అభియోగాలకు ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయి. వారిపై కూడా మరోసారి శాఖాపరమైన విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సర్కారు భావిస్తోంది. వీరిలో ఆర్‌డీఓలుగా పనిచేసిన వారే ఎక్కువగా ఉన్నారని తెలిసింది.

ముడా కేసులో కర్ణాటక సీఎంకు నోటీసులు

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల కేసును దర్యాప్తు చేస్తున్న లోకాయుక్త పోలీసులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 6వ తేదీన మైసూరులోని లోకాయుక్త కార్యాలయానికి రావాలని ఆదేశించారు. ముడా పరిధిలో 14 ఇంటి స్థలాలను సీఎం సిద్దరామయ్య భార్య పార్వతికి కేటాయించడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ కేసును ఓవైపు లోకాయుక్త, మరోవైపు ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. ఏ1 నిందితుడిగా ఉన్న సీఎం సిద్దరామయ్యకు లోకాయుక్త నోటీసులు జారీ చేయడంతో ప్రభుత్వానికి షాక్‌ ఇచ్చినట్టు అయింది. ఈ కేసులో ఏ2గా ఉన్న సిద్దరామయ్య భార్య పార్వతితోపాటు బావమరిది మల్లికార్జున స్వామి, భూమి విక్రయించిన దేవరాజ్‌ను ఇప్పటికే లోకాయుక్త విచారించింది. ఇక సిద్దరామయ్యను మాత్రమే విచారించాల్సి ఉంది. కాగా, ముఖ్యమంత్రి హోదాలో లోకాయుక్త ముందు సిద్దరామయ్య హాజరు కావడాన్ని విపక్షాలు ఆక్షేపిస్తున్నాయి. విచారణకు వెళ్లే ముందు సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌ చేస్తున్నాయి.

కుప్పకూలిన మిగ్‌- 29

ఆగ్రా, నవంబరు 4: భారత వైమానిక దళానికి చెందిన ఓ మిగ్‌-29 యుద్ధవిమానం ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో కుప్పకూలింది. సోమవారం సైనిక శిక్షణలో భాగంగా విన్యాసాల కోసం పంజాబ్‌లోని అదంపూర్‌ నుంచి ఆగ్రాకు బయలుదేరింది. ఆగ్రా సమీపంలోకి రాగానే సాంకేతిక లోపం తలెత్తి విమానం ప్రమాదానికి గురైంది. సోంగా గ్రామ సమీపంలోని పొలాల్లో కూలిపోయింది. దీంతో ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భారీ శబ్దాలు వచ్చాయని, క్షణాల్లోనే విమానం కాలిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదం నుంచి పైలట్‌ సురక్షితంగా బయటపడినట్లు భారత వైమానిక దళ అధికారులు మీడియాకు వెల్లడించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు. కాగా, 2నెలల క్రితం ఓ మిగ్‌-29 విమానం రాజస్థాన్‌లోని బర్మేర్‌లో కుప్పకూలింది.

దీపావళి టపాసులను ఎందుకు అడ్డుకోలేదు

- ఢిల్లీ ప్రభుత్వం, పోలీసులకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 4: దీపావళి సమయంలో టపాసులు కాల్చకుండా వాటిని నిషేధించాలంటూ తామిచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఢిల్లీ ప్రభుత్వం, పోలీసులకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. వచ్చే సంవత్సరాల్లో అయినా ఈ నిషేధం సక్రమంగా అమలు చేయాలంటే తీసుకోవాల్సిన చర్యలను కూడా సూచించాలని కోరింది. ఢిల్లీలో గతంలో ఎన్నడూ లేనంత ఎక్కువగా కాలుష్యం ఉండటం చూస్తే తమ ఆదేశాలు అమలు కాలేదని అర్థమవుతోందని, దీని విషయంలో ఎలాంటి సందేహం లేదని సుప్రీం కోర్టు పేర్కొంది. టపాసుల నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదో సమగ్ర వివరాలతో అఫిడవిట్‌ దాఖలు చేయాలని ఢిల్లీ పోలీసు కమిషనర్‌ను సుప్రీం ఆదేశించింది.

నవ్య | చిత్రజ్యోతి

వేదం కాంబినేషన్‌



'మిస్‌ శెట్టి మిస్టర్‌ పొలిశెట్టి' చిత్రం వచ్చి ఏడాది దాటింది. అప్పటి నుంచి అనుష్క నటించిన సినిమా ఏదీ రాలేదు. ఆమె కొత్త సినిమాల గురించి వార్తలు వినిపించాయి. వాటి మీద సోషల్‌ మీడియాలో చర్చ కూడా జరిగింది. ఇప్పుడు ఉన్నట్టుండి 'ఘాటీ' అంటూ ఓ భారీ బడ్జెట్‌ చిత్రం న్యూస్‌ వచ్చింది. ఈ సినిమాకు క్రిష్‌ దర్శకుడు. విమర్శకుల ప్రశంసలు పొంది, కమర్షియల్‌గా కూడా హిట్‌ అయిన 'వేదం' చిత్రం తర్వాత అనుష్క, క్రిష్‌ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఘాటీ' మీద అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే చాలా భాగం వర్క్‌ పూర్తి చేసుకున్న ఈ చిత్రం షూటింగ్‌ ఈ నెల ఏడుతో పూర్తవుతుందట. ఆ రోజే అనుష్క పుట్టినరోజు కావడంతో సినిమా ఫస్ట్‌ లుక్‌ను, 'ఎ స్పెషల్‌ గ్లింప్స్‌ ఇన్‌ టు ద వరల్డ్‌'ని విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు కూడా ఆ రోజే వెల్లడించనున్నారు. యూవీ క్రియేషన్స్‌, ఫస్ట్‌ ఫ్రేమ్‌ ఎంటర్‌టైన్‌మెంట్స్‌ సంస్థలు సంయుక్తంగా 'ఘాటీ' చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

ప్లాన్‌ చేస్తే విజయాలు రావు

దుల్కర్‌ సల్మాన్‌



'మనం ప్లాన్‌ చేస్తే విజయాలు రావు. మంచి సినిమాలు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాను. కష్టానికి తగ్గ ఫలితం దక్కుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది' అని దుల్కర్‌ సల్మాన్‌ అన్నారు. 'మహానటి, సీతారామం' చిత్రాల తర్వాత ఆయన నటించిన 'లక్కీ భాస్కర్‌' ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా దుల్కర్‌ సల్మాన్‌ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- దర్శకుడు వెంకీ అట్లూరి కథ చెబుతున్నప్పుడే మనసులో ఈ సినిమా చేయాలని నిర్ణయించుకున్నాను. బ్యాంకింగ్‌ నేపథ్యాన్ని తీసుకొని మధ్య తరగతి కుటుంబాల కథ చెప్పడం కొత్తగా అనిపించింది. ఎప్పటి నుంచో వాస్తవానికి దగ్గరగా ఉండే ఓ మధ్యతరగతి తండ్రి పాత్ర చేయాలనుకుంటున్నాను. అది ఈ సినిమాతో నెరవేరింది. నా దృష్టిలో ఇది వాస్తవకథ హర్షద్‌ మెహతా లాంటివాడు భారీ స్కాం చేస్తుంటే ఒక చిన్నబ్యాంక్‌ ఉద్యోగి తన పరిధిలో స్కాం చేయడం అనేది కొత్త పాయింట్‌. కథ పైన వెంకీ ఎంతో రీసెర్చ్‌ చేశాడు. ఈ సినిమా కథలో ఎలాంటి తప్పు లేదని బ్యాంకింగ్‌ నిపుణులు చెప్పారు. సినిమా ప్రతి దశలో ఎంజాయ్‌ చేశాను. సినిమా విజయం ఎంతో సంతృప్తిని ఇచ్చింది.
- మమ్ముట్టి గారి అబ్బాయినే అయినా నేను కూడా అందరిలానే ఆలోచిస్తాను. కాలేజ్‌ రోజుల్లో ఉన్నప్పుడు లాటరీ తగిలితే సొంతంగా నచ్చినవన్నీ కొనుక్కోవచ్చు అని కలలు కనేవాణ్ణి. నాన్నకు 'లక్కీ భాస్కర్‌' బాగా నచ్చింది. సినిమా చూశాక వెంకీతో మాట్లాడారు. ఎంతగానో మెచ్చుకున్నారు. ప్రస్తుతం తెలుగులో 'ఆకాశంలో ఒక తార' చిత్రం చేస్తున్నాను.

ఇన్‌ ప్రోగ్రెస్‌

సాయి దుర్గా తేజ్‌ మూవీలో...



'విరూపాక్ష', 'బ్రో' బ్లాక్‌బస్టర్‌ విజయాల తర్వాత సాయి దుర్గా తేజ్‌ చేస్తున్న కొత్త ప్రాజెక్ట్‌ 'ఎస్‌డిటి18'. ఈ పాన్‌ ఇండియా మూవీని రోహిత్‌ కేపీ దర్శకత్వంలో కె.నిరంజన్‌ రెడ్డి, చైతన్య రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులో సాయి దుర్గా తేజ్‌ మునుపెన్నడూ చేయని పవర్‌ఫుల్‌ క్యారెక్టర్‌లో నటిస్తున్నారు. హీరోయిన్‌గా ఐశ్వర్య లక్ష్మీ నటిస్తున్నారు. ఈ మూవీలో నటుడు జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. రగ్గడ్‌ లుక్‌లో ప్రెజంట్‌ చేసిన జగపతిబాబు ఇంట్రో పోస్టర్‌ చాలా క్యూరియాసిటీని పెంచింది.

హరుడైన నరుడు



'గంగమ్మ తల్లిని తెలుగు ప్రజలు ఎంతగానో ఆరాధిస్తారు. ఆ అమ్మవారి కథతో తీసిన చిత్రమే 'జాతర'' అని సతీశ్‌ బాబు రాటకొండ అన్నారు. ఆయన హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 8న విడుదలవుతోన్న సందర్భంగా సతీశ్‌బాబు మీడియాతో ముచ్చటించారు.


- వాస్తవ సంఘటనల ఆధారంగా రాసుకున్న కథతో తెరకెక్కిన చిత్రం 'జాతర'. ఒక మనిషి రాక్షసుడై అమ్మవారిని చెరపడితే మరో నరుడు హరుడై ఆ రాక్షసుణ్ణి ఎలా సంహరించాడు అనేది మా సినిమాలో వినోదాత్మకంగా చూపించబోతున్నాం.
- హీరో క్యారెక్టర్‌ మూడు డైమెన్షన్స్‌లో ఉంటుంది. అతను ఒక ఫేజ్‌ నుంచి మరో ఫేజ్‌కు వెళ్లేందుకు ప్రేమ అనేది ఒక మీడియంలా ఉంటుంది.

విడుదలకు సీక్వెల్‌



గతేడాది తమిళంలో విజయం సాధించి తెలుగు ప్రేక్షకులను సైతం ఆకట్టుకున్న చిత్రం 'విడుదల'. దీనికి సీక్వెల్‌గా రూపొందిన సినిమా 'విడుదల 2'. వెట్రీ మారన్‌ దర్శకత్వంలో విజయ్‌ సేతుపతి నటించారు. సినిమాను తెలుగులో విడుదల చేసే అవకాశాన్ని ప్రముఖ నిర్మాత చింతపల్లి రామారావు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'డిసెంబరు 20న 'విడుదల 2' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం. మంచి కమర్షియల్‌ వాల్యూస్‌ ఉన్న చిత్రమిది. ఇందులో విజయ్‌ సేతుపతి, సూరి నటన హైలెట్‌గా నిలుస్తాయి' అని తెలిపారు.

మహాశివరాత్రికి తమ్ముడు



పవన్‌కల్యాణ్‌ హీరోగా గతంలో 'తమ్ముడు' పేరుతో ఓ సినిమా వచ్చింది. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు అదే టైటిల్‌తో మరో సినిమా వస్తోంది. నితిన్‌ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీరామ్‌ వేణు దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్‌ నిర్మిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరిలో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటిస్తూ రిలీజ్‌ డేట్‌ పోస్టర్‌ను కూడా వదిలారు. కాగడా చేత పట్టిన నితిన్‌, భుజాన ఓ పాపను ఎత్తుకుని పరిగెడుతూ రావడం, ఆయనతో పాటు ఊరి ప్రజలు కూడా కాగడాలతో అనుసరిస్తుండడం ఆసక్తి కలిగిస్తోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌ సంస్థ నిర్మిస్తున్న 56వ చిత్రమిదనీ, ఇందులో నటి లయ కీలక పాత్రను పోషిస్తోందనీ నిర్మాతలు వెల్లడించారు. 'వకీల్‌ సాబ్‌' చిత్రం తర్వాత దర్శకుడు శ్రీరామ్‌ వేణు రూపొందిస్తున్న చిత్రం కావడంతో 'తమ్ముడు' మీద భారీ అంచనాలు ఉన్నాయి.

టైమ్‌ ట్రావెల్‌ కాన్సెప్ట్‌తో...



సైన్స్‌ ఫిక్షన్‌, మైథాలాజికల్‌ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రం 'రహస్యం ఇదం జగత్‌'. కోమల్‌ ఆర్‌. భరద్వాజ్‌ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మించారు. రాకేష్‌ గలేబి, స్రవంతి ప్రత్తిపాటి, మానస వీణ, భార్గవ్‌ గోపీనాథం ముఖ్య తారలు. ఈనెల 8న చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సినిమా కథానాయికలు మానస వీణ, స్రవంతి ప్రత్తిపాటి మీడియాతో ఆదివారం ముచ్చటించారు. 'మానస వీణ మాట్లాడుతూ 'ఇది నా తొలి ఫీచర్‌ ఫిల్మ్‌. ఇందులో అరుణి ఆచార్య అనే పాత్రలో నటించాను. ఈ పాత్ర నాకు పర్సనల్‌గా ఎంతో నచ్చింది. ముఖ్యంగా కథ వినగానే సైన్స్‌ ఫిక్షన్‌కు మైథాలజీని కనెక్ట్‌ చేసి టైమ్‌ ట్రావెల్‌ కాన్సెప్ట్‌తో సినిమా నేపథ్యం ఉండటం నన్ను ఆకర్షించింది. ఈ చిత్రంలో నా పాత్ర కోసం రీసెర్చ్‌ కూడా చేశాను' అని చెప్పారు. స్రవంతి ప్రత్తిపాటి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో నా పాత్ర పేరు అకిరా. తప్పకుండా ఈ పాత్ర అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్‌ నాకు తాత వరుస అవుతారు. ఆయన సలహాలు, సూచనలు నా కెరీర్‌ కోసం తీసుకున్నాను' అని తెలిపారు.

గోవా ఫిల్మ్‌ ఫెస్టివల్‌లో రజాకార్‌



భారతీయ చలన చిత్రోత్సవంలో రజాకార్‌ సినిమాకు గుర్తింపు దక్కింది. ప్రతి ఏడాది గోవాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఇంటర్నేషనల్‌ ఫిల్మ్‌ ఫెస్టివల్‌ ఆఫ్‌ ఇండియా (ఐఎఫ్‌ఎఫ్‌ఐ)లో ఉత్తమ తొలి దర్శకుడు(బెస్ట్‌ డెబ్యూ డైరెక్టర్‌) కేటగిరీకి ఈ సినిమా దర్శకుడు యాట సత్యనారాయణ నామినేట్‌ అయ్యారు. ఈ మేరకు సోమవారం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఉత్తమ తొలి దర్శకుల కేటగిరీలో నామినేట్‌ అయిన వారిలో రజాకార్‌ (తెలుగు) దర్శకుడు యాట సత్యనారాయణతో పాటు బూంగ్‌(మణిపురి) దర్శకురాలు లక్ష్మీప్రియా దేవి, ఘరత్‌ గణపతి(మరాఠీ) దర్శకుడు నవజ్యోత్‌ బండివాడేకర్‌, మిక్కా బన్నాడ హక్కి (కన్నడ) దర్శకుడు మనోహర, థానుప్‌ (మలయాళం) దర్శకుడు రాగేశ్‌ నారాయణన్‌ ఉన్నారు. గోవాలో ఈ నెల 28న జరిగే ముగింపు వేడుకలో ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిని ఎంపిక చేస్తారు.

- న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

విభిన్న పాత్రల్లో వరుణ్‌



వరుణ్‌ధావన్‌, కీర్తిసురేశ్‌ జంటగా నటిస్తున్న బాలీవుడ్‌ చిత్రం 'బేబీ జాన్‌'. వామికా గబ్బి, జాకీ ష్రాఫ్‌ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డిసెంబర్‌ 25న విడుదలవుతోంది. చిత్రబృందం సోమవారం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. శక్తిమంతమైన పోలీసాఫీసర్‌గా, తండ్రిగా, వంటమనిషిగా విభిన్న పాత్రల్లో వరుణ్‌ కనిపించారు. కలీస్‌ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. జియోస్టూడియోస్‌, అట్లీ సమర్పణలో ప్రియా అట్లీ, మురాద్‌ ఖేతనీ, జ్యోతిదేశ్‌పాండే నిర్మిస్తున్నారు.

ఆ ఇద్దరిని తీసుకోండి

న్యూఢిల్లీ: దేశంలో న్యూజిలాండ్ చేతిలో మాదిరి ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాజయం ఎదురు కాకుండా ఉండాలంటే పుజార, రహానెలను వెంటనే జట్టులోకి తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. అయితే బోర్డర్-గవాస్కర్ సిరీస్‌కు జట్టును ఇప్పటికే ప్రకటించినందున పుజార, రహానెలకు అవకాశంలేదు. ఒకవేళ ఆసీస్‌తో సిరీస్‌కు వారిని తీసుకొని జట్టు విజయాలలో పుజార, రహానె రాణించారే అనుకుందాం. కానీ వారికి కూడా వయస్సు మీరుతోంది కదా. వారు మాత్రం ఎంతకాలం ఆడగలరు. అందువల్ల దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా గిల్, సర్ఫరాజ్, కేఎల్ రాహుల్‌పై ఎక్కువగా నమ్మకం ఉంచాలి. ఒకటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రాన వారిని పక్కనపెట్టకూడదు. పైగా అనుభవంతో వారు మరింత రాటుదేలతారు కూడా.

షమి రాక మరింత ఆలస్యం


బెంగళూరు: పోటీ క్రికెట్‌లోకి వెటరన్ పేసర్ షమి పునరాగమనం మరింత ఆలస్యం కానుంది. ఈ ఏడాది ఆరంభంలో పాదం గాయానికి షమి శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆటకు దూరంగా ఉన్నాడు. కోలుకున్న అతడు రంజీట్రోఫీ ద్వారా పునరాగమనం చేస్తాడని భావించారు. కానీ పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో కర్ణాటక, మధ్యప్రదేశ్‌లతో జరిగే రంజీ మ్యాచ్‌లకు షమిని బెంగాల్ జట్టుకు ఎంపిక చేయలేదు.

నెలాఖరున రియాద్‌లో ఐపీఎల్ వేలం?



న్యూఢిల్లీ: వచ్చే సీజన్ కోసం జరిగే ఐపీఎల్ మెగా వేలం ఈనెల 24, 25 తేదీల్లో జరిగే అవకాశాలున్నాయి. దీనికి సౌదీ రాజధాని రియాద్ వేదిక కానుంది. ఇప్పటికే పది ఫ్రాంచైజీలు కూడా తమ రిటెన్షన్ జాబితాను వెల్లడించాయి. మొత్తంగా 46 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకోగా, ఇందులో పది మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. వీరిపై అన్ని జట్లు కలిపి రూ.558.5 కోట్లు వెచ్చించాయి. వేలంలోకి ఢిల్లీ, కోల్‌కతా, లఖ్‌నవూ కెప్టెన్లు పంత్, శ్రేయాస్, రాహుల్ రావడంతో కొత్త సారథుల కోసం చూస్తున్న జట్లు వీరికోసం పోటీపడనున్నాయి.

బ్రెజిలియన్ గ్రాండ్ ప్రీ విజేత వెర్‌స్టాపెన్



సావోపోలో: బ్రెజిలియన్ ఫార్ములావన్ గ్రాండ్ ప్రీ టైటిల్‌ను రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ సొంతం చేసుకొన్నాడు. దీంతో నాలుగోసారి ఎఫ్-1 చాంపియన్‌షిప్ గెలుచుకొనే అవకాశాలను మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. ఫైనల్ రేస్‌ను 17వ స్థానం నుంచి ప్రారంభించినా.. అద్భుత ప్రదర్శనతో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. అల్పైన్ రెనాల్ట్‌కు చెందిన డ్రైవర్లు ఎస్టీబన్ ఒకాన్, పెర్రీ గాస్లీ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.

మూలాలు మరిస్తే ఎలా..!




అశ్విన్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం) >

న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఘోర పరాభవం నేపథ్యంలో స్టార్ క్రికెటర్లు దేశవాళీల్లో.. ముఖ్యంగా రంజీట్రోఫీ ఆడడం తప్పనిసరి చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. భారత జట్టులోని పలువురు సీనియర్ ఆటగాళ్లు దేశవాళీ పోటీల గురించే మరిచిపోయారనడంలో అతిశయోక్తి లేదు. ప్రపంచ టెస్ట్ క్రికెట్‌లో స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కోవడంలో భారత ఆటగాళ్లకు మించినోళ్లు లేరని కొన్ని ఏళ్ల క్రితం మనోళ్లకు గొప్ప ఘనత ఉండేది. ఇప్పుడు..విదేశాల విషయం పక్కనబెడితే స్వదేశంలో టర్నింగ్ వికెట్లపై పరుగులు చేసేందుకు మన స్టార్ బ్యాటర్లు ఆపసోపాలు పడుతున్నారు. చాలా ఏళ్లుగా సీనియర్లు దేశవాళీ పోటీల్లో ఆడకపోవడానికి కిక్కిరిసిన అంతర్జాతీయ షెడ్యూల్ కూడా కారణం. అయినా..తీరిక చేసుకొని కనీసం ఒకటి రెండు మ్యాచ్‌ల్లోనైనా ఆడి వుంటే న్యూజిలాండ్ స్పిన్నర్లను సమర్థంగా తిప్పికొట్టే వారేమో ! తీరికలేకుండా అంతర్జాతీయ షెడ్యూల్ ఉన్నా..గతంలో స్టార్ క్రికెటర్లు దేశవాళీ పోటీల్లో ఆడడానికి ప్రాధాన్యమిచ్చేవారు. సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనను ముగించుకున్న భారత జట్టు 2007 జనవరి తొలివారంలో స్వదేశం తిరిగి వచ్చింది. ఇక.. వన్డే ప్రపంచ కప్ సన్నాహకాల్లో భాగంగా.. అదే జనవరి చివరి వారంలో వెస్టిండీస్‌తో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో భారత్ తలపడింది. జనవరి 21, 24, 27, 31 తేదీల్లో నాగ్‌పూర్, చెన్నై, కటక్, వదోదరలో ఆ మ్యాచ్‌లు ఆడింది. అప్పటి భారత జట్టులోని నలుగురు స్టార్లు సచిన్, జహీర్, అజిత్ అగార్కర్, గంగూలీ వదోదర నుంచి నేరుగా ముంబై చేరుకున్నారు. ఎందుకో తెలుసా? ఫిబ్రవరి రెండు నుంచి ఆరు వరకు జరిగే ప్రతిష్ఠాత్మక రంజీట్రోఫీ ఫైనల్లో తలపడే ముంబై-బెంగాల్ జట్ల తరఫున ఆడేందుకు. ఆ మ్యాచ్‌లో టెండూల్కర్ శతకం సాధిస్తే, సౌరవ్ 90 పరుగులు చేశాడు. జహీర్ తగినన్ని వికెట్లు పడగొట్టాడు. రంజీట్రోఫీ తుది పోరు ముగిసిన 48 గంటల్లో సచిన్, దాదా, జహీర్ శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌లోనూ ఆడాల్సి ఉంది. అయినా రంజీట్రోఫీ బరిలో దిగడం దేశవాళీ టోర్నీకి వారు ఎంత ప్రాధాన్యమిచ్చారో అర్థమవుతుంది.





జడేజా

మరి ఇప్పుడో..

న్యూజిలాండ్‌తో టెస్ట్‌ల్లో ఘోరంగా ఓడిన టీమిండియాలోని పలువురు స్టార్ ఆటగాళ్లకు ఈసారి దులీప్ ట్రోఫీ నుంచి మినహాయింపు ఇవ్వడం గమనార్హం. దీనికి కొందరు 'పని భార నిర్వహణ' అని చెబుతున్నా.. టీ20 ప్రపంచ కప్ ముగిశాక, తర్వాత శ్రీలంకలో జరిగిన వన్డే సిరీస్‌కు మధ్య వారికి తగిన విరామమే లభించింది. దాంతో 'పనిభారం' పేరిట దులీప్ ట్రోఫీకి మినహాయింపు ఇవ్వడంపై ప్రస్తుతం తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. పేస్ దళ సారథిగా బుమ్రాకు 'పని భారం'తో దులీప్ ట్రోఫీకి తీసుకోకపోవడం సమంజసమే. కానీ కోహ్లీ, రోహిత్, అశ్విన్, జడేజాలకు టోర్నీ నుంచి మినహాయింపు ఇవ్వడంలో ఔచిత్యమేమిటి? 2000 సంవత్సరం ఏప్రిల్..తీవ్రమైన ఎండలో తమిళనాడుతో రంజీ సెమీస్‌లో సచిన్ అజేయ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. మరో మూడ్రోజుల తర్వాత హైదరాబాద్‌తో రంజీట్రోఫీ ఫైనల్లోనూ టెండూల్కర్ పాల్గొని అర్ధ శతకం, శతకం చేసిన విషయాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. మార్చి చివరి వారం వరకు జరిగిన వన్డేలలో ఆడి..ఆపై రెండు వారాల వ్యవధిలో సచిన్ రంజీట్రోఫీ సెమీస్, ఫైనల్ బరిలో దిగడాన్ని నేటి స్టార్ క్రికెటర్లు ఎందుకు ఆదర్శంగా తీసుకోరు? విరాట్ చివరిసారి 2013లో, రోహిత్ 2015లో రంజీట్రోఫీ బరిలో దిగారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఆ తర్వాత ఈ ఇద్దరు కూడా ఒకటే ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడడం గమనార్హం. 24 ఏళ్ల తన కెరీర్‌లో తీరిక లేని అంతర్జాతీయ షెడ్యూల్ ఉన్నా..200 టెస్ట్‌లు సహా 316 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడడం ఒక్క సచిన్‌కే చెల్లింది. మరోవైపు కోహ్లీ కేవలం 32 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో ఆడాడు. కానీ రోహిత్ కాస్త మెరుగ్గా 61 మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. అయితే ఇప్పటి మాదిరి..సచిన్, లక్ష్మణ్, ద్రావిడ్, గంగూలీ కెరీర్ ఉచ్ఛ దశలో ఉన్న సమయంలో రెండు నెలల ఐపీఎల్, టీ20 మ్యాచ్‌లు ఉండేవి కావు. పనిభారం నిర్వహణ ముఖ్యమే. కానీ అత్యుత్తమ బ్యాటర్లు ఫామ్ కోల్పోయిన తరుణంలోనైనా దేశవాళీ పోటీల్లో ఆడాలనేది సర్వత్రా వినవస్తున్న అభిప్రాయం. ఇరానీ కప్ మ్యాచ్‌లో రెస్టాఫ్ ఇండియా తరఫున స్టార్ క్రికెటర్లు తప్పనిసరిగా ఆడేలా నిబంధన తీసుకురావాలనే సూచన వినవస్తోంది. ఆ సమయంలో టెస్ట్ మ్యాచ్‌ల షెడ్యూల్ లేకుండా బీసీసీఐ చూడాలి. ఏదేమైనా ఓ పెద్ద సిరీస్‌కు ముందు స్టార్ ఆటగాళ్లు ఒకట్రెండు దేశవాళీ పోటీలు ఆడడం తప్పనిసరి చేయాలి. దేశ క్రికెట్ సీజన్ అక్టోబరు నుంచి మార్చి వరకు ఉంటుంది. ఆ సమయంలో స్వదేశంలో టెస్ట్ సిరీస్‌కు ముందు రంజీట్రోఫీ ఒకటి రెండు రౌండ్లు ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. తద్వారా స్టార్ ఆటగాళ్లు ఆ పోటీలలో పాల్గొనే అవకాశం లభిస్తుంది.

క్రికెట్‌కు సాహా వీడ్కోలు



ఈ రంజీ సీజన్ కెరీర్‌లో చివరిదని ప్రకటన

న్యూఢిల్లీ: వెటరన్ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలుకనున్నాడు. ప్రస్తుత రంజీ ట్రోఫీ సీజన్ అతడి కెరీర్‌లో చివరిది కానుంది. 'క్రికెట్‌లో నా అద్భుత ప్రయాణానికి ముగింపు పలుకబోతున్నాను. చివరిసారి రంజీల్లో బెంగాల్‌కు ఆడనున్నందుకు సంతోషంగా ఉంది. ఈ సీజన్‌ను మరపురానిదిగా మలిచేందుకు ప్రయత్నిద్దాం' అని 40 ఏళ్ల సాహా సోషల్ మీడియాలో ప్రకటించాడు. 2010లో భారత జట్టు తరఫున అరంగేట్రం చేసిన తను 40 టెస్టుల్లో 1353 పరుగులు, 9 వన్డేల్లో 41 పరుగులు సాధించాడు. ధోనీ రిటైర్మెంట్ తర్వాత సాహా జట్టు కీపర్‌గా సేవలందించినా.. పంత్ రాకతో స్థానం గల్లంతైంది. 2021లో చివరి టెస్టు ఆడాడు. ఇక ఐపీఎల్ ఆరంభం నుంచి అన్ని సీజన్లు ఆడిన సాహా ఈసారి వేలంలో తన పేరును నమోదు కూడా చేసుకోలేదు.



పుణె పాంచ్ పటాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్ ఈ సీజన్‌లో ఐదో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. సోమవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 49-30తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. యువ ఆటగాళ్లతో కూడిన పుణె సమష్టిగా ఆడి ఫలితం రాబట్టింది. పుణె జట్టులో ఆకాశ్ షిండే (11 పాయింట్లు) సూపర్ టెన్‌తో సత్తా చాటాడు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 36-32తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది.

పాక్‌పై చెమటోడ్చిన ఆసీస్

మెల్‌బోర్న్: పాకిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 2 వికెట్లతో అతికష్టంగా గెలిచింది. ముందుగా పాక్ 46.4 ఓవర్లలో 203 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ రిజ్వాన్ (44), నసీమ్ షా (40), బాబర్ (37) ఫర్వాలేదనిపించారు. స్వల్ప ఛేదనలో ఆసీస్ 33.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 204 రన్స్‌తో గట్టెక్కింది. ఇన్‌గ్లిస్ (49), స్మిత్ (44) ధాటిగా ఆడినా, ఓ దశలో 155/7 స్కోరుతో జట్టు ఓటమి దిశగా వెళ్లింది. అయితే చివర్లో కెప్టెన్ కమిన్స్ (32 నాటౌట్) టెయిలెండర్ల సహకారంతో విజయం అందించాడు.

ఇంగ్లండ్, ఆస్ట్రేలియాకు భారత్ ఆతిథ్యం



మహిళల ఎఫ్‌టీపీ విడుదల

దుబాయ్: మహిళల క్రికెట్ 2025-29 చక్రానికి సంబంధించిన భవిష్యత్ పర్యటనల షెడ్యూల్ (ఎఫ్‌టీపీ)ని ఐసీసీ విడుదల చేసింది. ఇందులో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో భారత్ సొంతగడ్డపై సిరీస్‌లు ఆడనుంది. బంగ్లాదేశ్, జింబాబ్వేలతో కూడా భారత జట్టు తలపడనుంది. మొత్తం 11 జట్లకు సంబంధించిన అంతర్జాతీయ షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. కాగా, న్యూజిలాండ్, వెస్టిండీస్, ఐర్లాండ్, దక్షిణాఫ్రికాల్లో భారత జట్టు పర్యటించనుంది. మొత్తంగా ప్రతి జట్టు నాలుగేళ్ల చక్రంలో ఇంటా, బయటా నాలుగేసి సిరీస్‌ల చొప్పున ఆడనుంది. 2026లో జరిగే మహిళల టీ20 ప్రపంచకప్ ముందు జరిగే ముక్కోణపు సిరీస్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. కొత్తగా టీ20 చాంపియన్స్ ట్రోఫీని కూడా ఐసీసీ ప్రకటించింది. 2027లో జరిగే ఈ టోర్నీకి శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనుండగా.. 6 జట్లు పాల్గొంటాయి. ఈ చక్రంలో మొత్తం 15 టెస్ట్‌లకు ఐసీసీ అవకాశం కల్పించింది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వెస్టిండీస్ మళ్లీ టెస్ట్ సిరీస్‌లు ఆడనుండడం విశేషం. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), హండ్రెడ్, బిగ్‌బాష్ లీగ్‌లకు నిర్దుష్టమైన షెడ్యూల్‌ను ఐసీసీ కేటాయించింది. కొత్త చక్రంలో రెండు టీ20 వరల్డ్‌కప్‌లు (2026, 2028), రెండు వన్డే వరల్డ్‌కప్‌లు (2025, 2029), టీ20 చాంపియన్స్ ట్రోఫీ (2027) నిర్వహించనున్నారు. కాగా, జట్ల సంఖ్యను వన్డే ప్రపంచకప్‌లో పదికి, టీ20 వరల్డ్‌కప్‌లో 12కు పెంచనున్నారు.

GMR బిజినెస్

లాభాల్లో హైదరాబాద్ విమానాశ్రయం

ఈ ఏడాది నుంచి డివిడెండ్ — జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

ముంబై: జీఎంఆర్ గ్రూప్ నిర్వహణలోని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) లాభాల బాట పట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) నుంచి ఈ విమానాశ్రయం డివిడెండ్ చెల్లిస్తుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సౌరభ్ చావ్లా ఎకనామిక్ టైమ్స్ పత్రికకు తెలిపారు. మరో రెండు మూడేళ్లలో తమ నిర్వహణలోని ఢిల్లీ ఎయిర్‌పోర్టూ లాభాల బాటపడుతుందన్నారు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సెజ్‌లు, కార్యాలయ భవనాలు, విద్యా సంస్థలు, సీనియర్ సిటిజన్ల నివాస వసతుల కల్పన కోసం రూ.800 కోట్ల నుంచి రూ.900 కోట్లతో వివిధ నిర్మాణాలు చేపడుతున్నట్టు చావ్లా వెల్లడించారు.

భూముల నగదీకరణ: దీనికి తోడు వచ్చే ఐదేళ్లలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో 1,400 ఎకరాలు, ఢిల్లీ, గోవా ఎయిర్‌పోర్టులోని 200 ఎకరాలు, కొత్తగా ఏర్పాటు చేసే భోగాపురం ఎయిర్‌పోర్టులో 200 ఎకరాల్లో కొత్త వసతులు, నిర్మాణాలు చేపట్టి.. వాటి నుంచీ పెద్దఎత్తున ఆదాయ ఆర్జనకు కృషి చేస్తామని చావ్లా తెలిపారు. హైదరాబాద్, ఢిల్లీ విమానాశ్రయాల ఆధునీకరణ కోసం ఇప్పటి వరకు రూ.12,000 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు వెల్లడించారు.

అప్పుల భారం తగ్గింపే లక్ష్యం: అప్పుల భారం తగ్గించుకోవడమే లక్ష్యంగా ప్రస్తుతం తాము పని చేస్తున్నట్టు సౌరభ్ చావ్లా తెలిపారు. ఇటీవల అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) సమకూర్చిన రూ.6,300 కోట్ల దీర్ఘకాలిక రుణంతో కంపెనీకి పెద్ద మొత్తంలో వడ్డీలు, అప్పుల చెల్లింపుల భారం తగ్గుతుందన్నారు. ప్రస్తుతం కంపెనీ అప్పులు- స్థూల లాభం నిష్పత్తి 6 శాతంగా ఉంది. విమానాశ్రయేతర ఆదాయాల పెంపు చర్యలు, ఏడీఐఏ సమకూర్చిన రుణాలతో వచ్చే రెండు మూడు సంవత్సరాల్లో ఇది 3.5 నుంచి 5 శాతానికి తగ్గే అవకాశం ఉందని చావ్లా చెప్పారు.

అమర రాజా ఎనర్జీ లాభం రూ.241 కోట్లు

ఒక్కో షేరుకు 530% మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈఎం).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.3,154.30 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.240.71 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.2,838.82 కోట్లుగా ఉండగా లాభం రూ.226.40 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.2,530.09 కోట్ల నుంచి రూ.2,830.33 కోట్లకు పెరిగాయి. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.5.30 (530 శాతం) మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీగా నవంబరు 14ను ఖరారు చేయగా డిసెంబరు 3 లోగా చెల్లింపులు చేపట్టనున్నట్టు అమర రాజా ప్రకటించింది. కాగా అనుబంధ సంస్థ అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఆర్ఏసీటీ)లో పెట్టుబడుల పరిమితిని రూ.1,000 కోట్ల నుంచి రూ.2,000 కోట్లకు పెంచినట్టు వెల్లడించింది.

16% తగ్గిన గ్లాండ్ ఫార్మా లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం క్షీణించి రూ.163.50 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.194.10 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ కార్యకలాపాల ఆదాయం మాత్రం 2 శాతం వృద్ధితో రూ.1,401.70 కోట్ల నుంచి 1,405.80 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో కంపెనీ అమెరికా ఆదాయం రూ.754.70 కోట్లుగా ఉంది.

పెరిగిన తాజ్ జీవీకే లాభం

తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ సెప్టెంబరు త్రైమాసికంలో స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన రూ.107.37 కోట్ల ఆదాయంపై రూ.19.65 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.90.46 కోట్లు, లాభం రూ.11.13 కోట్లుగా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,450 ▼	73,750 ▼	1,06,500 ▲
ముంబై	78,518 ▼	71,923 ▼	94,482 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	128	విజయవాడ	125
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	115
కర్నూలు	128	నెల్లూరు	115
విశాఖపట్నం	111	అనంతపురం	115
గోదావరి	125		

రూ.6 లక్షల కోట్లు ఉఫ్

భారీగా పతనమైన మార్కెట్.. 3 నెలల కనిష్ఠానికి సూచీలు

- ఒక దశలో 1,492 పాయింట్లు కోల్పోయిన బీఎస్ఈ సెన్సెక్స్
- చివరికి 942 పాయింట్ల నష్టంతో 78,782 వద్ద ముగిసిన సూచీ
- 24,000 దిగువ స్థాయికి నిఫ్టీ
- దాదాపు 3% క్షీణించిన ఆర్ఐఎల్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం కుప్పకూలాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,491.52 పాయింట్లు పతనమై 78,232.60 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 941.88 పాయింట్ల (1.18 శాతం) నష్టంతో 78,782.24 వద్ద స్థిరపడింది. సూచీకి దాదాపు రెండు నెలల (ఆగస్టు 6 తర్వాత) కనిష్ఠ ముగింపు స్థాయి ఇది. నిఫ్టీ విషయానికొస్తే, ఒక దశలో 488 పాయింట్ల వరకు క్షీణించి 23,800 స్థాయికి జారుకుంది. చివరి గంటలో కాస్త తేరుకుని 309 పాయింట్ల (1.27 శాతం) నష్టంతో 23,995.35 వద్ద క్లోజైంది. దాంతో సూచీ 24,000 కీలక స్థాయిని చేజార్చుకున్నట్లైంది. అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.99 లక్షల కోట్లు తగ్గి రూ.442.11 లక్షల కోట్లకు (5.26 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 24 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు 3.23 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేరు 2.77 శాతం పతనమవడంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.50,205 కోట్లు తగ్గి రూ.17.62 లక్షల కోట్లకు పడిపోయింది. మార్కెట్లో అధిక వెయిటేజీ కలిగిన మరో షేరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం 1.37 శాతం క్షీణించడం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలకు ప్రధాన కారణమయ్యాయి.



నష్టాలకు కారణాలు

- అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే అంశంపై అనిశ్చితి
- ఈ వారంలో యూఎస్ ఫెడ్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ) ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలు ప్రకటించనున్న నేపథ్యంలో అప్రమత్తత
- విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులు తరలిపోతుండటం
- సెప్టెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ఆశాజనకంగా లేకపోవడం
- అధిక ధరల వద్ద ట్రేడవుతున్న షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడం

5 వారాల్లో 7,200 పాయింట్లు డౌన్

ఈ సెప్టెంబరు 27న 85,978 పాయింట్ల వద్ద ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. ఆ తర్వాత తిరోగమన బాట పట్టింది. గడిచిన ఐదు వారాల్లో లేదా 25 ట్రేడింగ్ సెషన్లలో సూచీ 7,196 పాయింట్లు నష్టపోయింది.

సరికొత్త కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 4 పైసల నష్టంతో 84.11 వద్ద ముగిసింది. మన ఈక్విటీ మార్కెట్లో భారీ నష్టాలు, విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటంతో పాటు ముడి చమురు ధరలు మళ్లీ ఎగబాకడం రూపాయి విలువకు గండికొట్టాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. నష్టాల్లో నమోదై లాభాల్లోకి..

షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సోమవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.463తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 7.11 శాతం నష్టంతో రూ.430.05 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది. ఒక దశలో 9.31 శాతం క్షీణించి రూ.419.85 వద్దకు జారుకున్నప్పటికీ.. తిరిగి పుంజుకుని లాభాల్లోకి మళ్లింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీ షేరు 2.49 శాతం లాభంతో రూ.474.55 వద్ద స్థిరపడింది.

నివా బూపా ఇష్యూ ధరల శ్రేణి రూ.70-74

నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (గతంలో మ్యాక్స్ బూపా హెల్త్ ఇన్సూరెన్స్) ఐపీఓ ఈ నెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. రూ.2,200 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వస్తున్న ఈ కంపెనీ ఇష్యూ ధరల శ్రేణిని రూ.70-74గా నిర్ణయించింది.

ఏసీఎంఈ సోలార్ ఆఫర్ ధరల శ్రేణి రూ.275-289

పునరుత్పాదక ఇంధన రంగ సంస్థ ఏసీఎంఈ సోలార్ హోల్డింగ్స్ లిమిటెడ్ ఐపీఓ ఈ నెల 6న ప్రారంభమై 8న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణిని కంపెనీ రూ.275-289గా నిర్ణయించింది. ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ.2,900 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

వచ్చే ఏడాదిలో రిలయన్స్ జియో ఐపీఓ

భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం కంపెనీ రిలయన్స్ జియో ఇన్ఫో వచ్చే ఏడాదిలో ఐపీఓకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. రిటైల్ వ్యాపార విభాగమైన రిలయన్స్ రిటైల్‌ను ఆ తర్వాత లిస్ట్ చేయాలనుకుంటున్నట్లు సమాచారం. జియో మార్కెట్ విలువను రూ.8.40లక్షల కోట్లస్థాయిలో లెక్కగట్టే అవకాశం ఉంది.

ఎంఎఫ్‌లకు సెబీ మరో వెసులుబాటు

విదేశీ ఫండ్స్‌లో పెట్టుబడులకు ఓకే

న్యూఢిల్లీ: దేశీయ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో వెసులుబాటు కల్పించింది. ఈ ఫండ్స్ పెట్టుబడులను నిర్వహించే ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్లు, తమ పెట్టుబడుల్లో కొంత భాగాన్ని విదేశీ మ్యూచువల్ ఫండ్స్ లేదా యూనిట్ ట్రస్టుల్లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతించింది. అయితే ఆ విదేశీ ఫండ్ లేదా యూనిట్ ట్రస్టు నికర పెట్టుబడుల్లో 25 శాతానికి మించి మన దేశ కంపెనీలకు చెందిన షేర్లు లేదా రుణ పత్రాలు ఉండకూడదని స్పష్టం చేసింది. దీంతో ఎంఎఫ్ పథకాల ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్లకు పెట్టుబడుల వివిధీకరణకు మరింత వెసులుబాటు లభిస్తుందని భావిస్తున్నారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని సెబీ తెలిపింది. ఒకవేళ ఈ పథకాల పెట్టుబడుల్లో భారత కంపెనీల షేర్లు, రుణ పత్రాల వాటా 25 శాతం మించితే, ఆ విషయం తెలిసినప్పటి నుంచి ఆరు నెలల వరకు లేదా మళ్లీ పెట్టుబడులు 25 శాతం దిగువకు వచ్చే వరకు, దేశీయ ఎంఎఫ్‌లు ఆ పథకాల్లో పెట్టుబడులు పెట్టకూడదని సెబీ నిషేధించింది.

- రిలయన్స్ ట్రెండ్స్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను విస్తరించింది. అన్నమయ్య జిల్లా బీ కొత్తకోట, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలలో కొత్త స్టోర్స్‌ను ప్రారంభించింది. ద్వితీయ శ్రేణి నగరాలకు కార్యకలాపాలు విస్తరించే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసింది.
- డాబర్ రెడ్ పేస్ట్.. భారత డెంటల్ సమాఖ్య (ఐడీఏ) నుంచి ప్రతిష్ఠాత్మక సీల్ ఆఫ్ యాక్సెప్టెన్స్ పురస్కారాన్ని దక్కించుకుంది. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి దేశీయ ఆయుర్వేద టూత్ పేస్ట్ ఇది.
- మారుతి సుజుకీ ఇండియా.. మార్కెట్లోకి నాలుగో తరం కాంపాక్ట్ సెడాన్ డిజైర్‌ను తీసుకువస్తోంది. సరికొత్త రూపంతో రూపొందించిన ఈ కారు బుకింగ్స్‌ను ప్రారంభించింది. వినియోగదారులు రూ.11,000 చెల్లించి అరెనా షోరూమ్స్‌లో ఈ కారును బుక్ చేసుకోవచ్చు.



హెల్దీ ఫుడ్

వీటిలో ప్రొటీన్ పుష్కలం!

మాంసాహారంలోనే కాదు శాకాహారంలోనూ మాంసకృత్తులు ఉంటాయి. ఈ పోషకాలు ఎక్కువ పరిమాణంలో ఉండే పదార్థాల గురించి తెలుసుకుని క్రమం తప్పక తింటూ ఉంటే బలహీనత దరి చేరదు.

- **చిక్కుళ్లు:** ఒక కప్పు చిక్కుళ్లలో 15 గ్రాములు ప్రొటీన్లు ఉంటాయి. పీచు, ఫోలేట్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, మాంగనీసు మొదలైన ఖనిజ లవణాలు చిక్కుళ్లలో ఉంటాయి. ఈ పోషకాలు సమృద్ధిగా అందాలంటే చిక్కుళ్లను వేయించకుండా ఆవిరి మీద ఉడికించుకుని లేదా కూరగా, స్టిర్ ఫ్రై రూపంలో తినాలి.
- **సబ్జా:** 30 గ్రాముల సబ్జాలో 4 గ్రాములు ప్రొటీన్ ఉంటుంది. క్యాల్షియం, ఫైబర్, ఫాస్ఫరస్, మెగ్నీషియం కూడా సబ్జాలో ఉంటాయి. స్మూదీ, సలాడ్స్, సూప్స్ లేదా నీళ్లలో నానబెట్టి తీసుకోవచ్చు.
- **క్వినోవా:** ఒక కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. వీటిలో మెగ్నీషియం, ఫాస్ఫరస్, మాంగనీసు కూడా ఉంటాయి. అన్నం బదులుగా తినవచ్చు.



స్ట్రెస్ ఫ్రీ


ఒత్తిడితో చిత్తు కాకుండా...

రోజు మొత్తంలో ఏదో ఒక సందర్భంలో ఒత్తిడి ఎదుర్కొంటాం. కానీ అదే పనిగా ఒత్తిడికి గురవుతుంటే, ఆ ప్రభావం కచ్చితంగా శరీరం మీద పడుతుంది. ఫలితంగా మైగ్రెయిన్ మొదలు రక్తపోటు, మధుమేహం, ఊబకాయం వరకూ రకరకాల సమస్యలు బాధించడం మొదలు పెడతాయి. ఒత్తిడి ప్రభావం గుండె మీద కూడా ఎక్కువే! కాబట్టి ఒత్తిడిని చిత్తు చేసే చిట్కాలు ఆచరించాలి.

- **టైమ్ మేనేజ్‌మెంట్:** ప్రాధామ్యాలను క్రమానుగుణంగా ఏర్పరుచుకోవడంలో మనం పొరపాటు పడుతూ ఉంటాం. ఏ పని ముందు చేయాలి? ఏ పనిని వాయిదా వేయవచ్చు? ఏ పని ముఖ్యం? అనే విశ్లేషణ కొరవడి, కంగారు పడిపోతూ ఉంటాం. ఈ కంగారులో ప్రాముఖ్యత లేని పనుల కోసం సమయం వృథా చేస్తాం. ఫలితంగా ముఖ్యమైన పనులకు సమయం కేటాయించలేక ఒత్తిడికి లోనవుతాం. ఇలా అనవసర ఒత్తిడికి గురి కాకుండా ఉండాలంటే పనులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేసే అలవాటు అలవరుచుకోవాలి.
- **ధ్యానం:** మానసిక ప్రశాంతతతో ఒత్తిడిని జయించవచ్చు. ఇందుకోసం ధ్యానం, బ్రీదింగ్ ఎక్సర్‌సైజులు చేయవచ్చు. ఒత్తిడి వల్ల మనం ఊపిరి తీసుకునే తీరు మారుతుంది. త్వరత్వరంగా ఊపిరి పీల్చడం, వదలడం చేస్తాం. గాలిని కూడా శక్తి మేరకు లోపలికి పీల్చం. ఫలితంగా సరిపడా ఆక్సిజన్ రక్తంలో కలవదు. దాంతో మెదడు పనితీరు తగ్గుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ఊపిరి మీద దృష్టి పెట్టాలి. రోజులో వీలైనన్నిసార్లు గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని వదులుతూ ఉండాలి. గాలి లోపలికి పీల్చుకున్నప్పుడు కొన్ని క్షణాలు బిగించి ఉంచి, వదలడం సాధన చేయాలి.
- **చిన్న చిన్న ఆనందాలు:** అదే పనిగా గంటల తరబడి పనిలో మునిగి తేలడం సరి కాదు. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా మధ్యమధ్యలో కొన్ని నిమిషాలపాటు బ్రేక్ తీసుకోవాలి. ఆ బ్రేక్‌లో నచ్చిన వ్యక్తులతో కలిసి ఆహ్లాదంగా నవ్వుకోవాలి. నవ్వు తెప్పించే పుస్తకం తిరగేయాలి. అవేవీ వీలు కాకపోతే కొన్ని నిమిషాలు నడవాలి.
- **సంగీతం వినాలి:** ఒత్తిడిని తొలగించే సాధనాల్లో సంగీతం ఒకటి. కాబట్టి నచ్చిన పాటలతో ప్లే లిస్ట్ తయారు చేసుకుని తీరిక వేళల్లో వినాలి. ఉదయం ఆఫీసుకు రెడీ అయ్యే సమయంలో, భోజనం చేస్తున్నప్పుడు, కుటుంబంతో గడిపేటప్పుడు ఈ పాటలు ప్లే చేసుకోవాలి. ఇలా ఆహ్లాదం కలిగించే పాటలు వినడం వల్ల మనసు తేలిక అవుతుంది. ఫలితంగా ఒత్తిడి వదులుతుంది.



యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్



బరువు తగ్గడం పెద్ద సమస్యగా మారిపోయింది. డైటింగ్, జిమ్మింగ్, స్విమ్మింగ్... ఏం చేసినా అధిక బరువు తగ్గకపోతే, అందుకు శరీరంలోని 'ఇన్‌ఫ్లమేషన్'ను అనుమానించాలి. దీన్ని వదిలించుకోవడం కోసం 'యాంటీ ఇన్‌ఫ్లమేషన్ డైట్'ను ఎంచుకోవాలి.

ఇన్‌ఫ్లమేషన్ ఇక్కట్లు

ప్రతి రోజూ ఇవి తప్పనిసరి

- ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు
- విటమిన్ డి
- ప్రొబయాటిక్స్ (పెరుగు, మజ్జిగ)
- పసుపు (రోజుకు ఒకటి నుంచి రెండు టీస్పూన్లు)
- అల్లం (రోజుకు 250 నుంచి 500 మిల్లీ గ్రాములు)

ప్రత్యామ్నాయాలున్నాయి

- **తీపి కోసం:** చక్కెరకు బదులుగా ముడి బెల్లం, తేనె, ఖర్జూరాలు
- **తెల్ల బియ్యం:** బ్రౌన్ రైస్, మిల్లెట్స్
- **రిఫైన్డ్ నూనెలు:** గానుగ నూనెలు, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్
- **మైదా:** పాలిష్ పట్టని గోధుమ పిండి

కొన్ని ఆరోగ్య సమస్యలకు ప్రత్యేకమైన వైద్య చికిత్సలంటూ ఉండవు. మరీముఖ్యంగా జీవనశైలితో ముడిపడి ఉండే ఒబేసిటీకి ఆహారమే ఔషధం. కొంతమంది ఎంత వ్యాయామం చేసినా, ఎంత మితంగా తింటున్నా అధిక బరువును వదిలించుకోలేకపోతూ ఉంటారు. ఈ కోవకు చెందిన ఊబకాయులు యాంటీ ఇన్‌ఫ్లమేషన్ డైట్‌ను అనుసరించాలి. కొత్తగా, ఫ్యాషన్‌గా, ట్రెండీగా ఉండే పదార్థాలకు స్వస్తి చెప్పి, మన పూర్వీకుల నుంచి సంక్రమిస్తూ వస్తున్న భోజనశైలిని అనుసరించాలి.

పరిష్కారం మన మూలాల్లోనే...

ఏరోమ్యాటిక్ ఆర్థ్రయిటిస్, యూరిక్ యాసిడ్ సంబంధిత ఆర్థ్రయిటిస్... ఈ సమస్యలతో బాధపడుతున్నవాళ్లు, ఎంతకూ బరువు తగ్గనివాళ్లు, కండరాల నొప్పులు, ఎముకల నొప్పులు, బలహీనత మొదలైన లక్షణాలతో బాధపడేవాళ్లు తప్పనిసరిగా శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను అనుమానించాలి.



నిజానికి ఈ సమస్యలకు అసలు కారణాన్ని కనిపెట్టలేక రకరకాల మందులు వాడుకుంటూ ఆరోగ్యాన్ని కుదేలు చేసుకునే వాళ్లూ ఉంటారు. కానీ మూల కారణాన్ని సరిదిద్దుకుంటే ఈ ఇబ్బందులు వాటంతట అవే తొలగిపోతాయి. అందుకోసం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారాన్ని ఎంచుకోవాలి. పాలిష్ పట్టని ముడి పదార్థాల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. నొప్పి, వాపులను తగ్గించే పోషకాలు మన స్థానిక పంటల్లో ఉన్నాయి.

ఇన్‌ఫ్లమేషన్ పరీక్షలు ఇవే!

మన సమస్యలకు కారణం ఇన్‌ఫ్లమేషన్ అవునో, కాదో తెలుసుకోవడం కోసం, ఇన్‌ఫ్లమేషన్ తీవ్రతను పసిగట్టడం కోసం ఇన్‌ఫ్లమేటరీ మార్కర్స్‌ను పరీక్షించాలి. అందుకోసం 'సి రియాక్టివ్ ప్రొటీన్ ఐఎల్6'ను పరీక్షిస్తే, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ మోతాదు తెలిసిపోతుంది. మోతాదును బట్టి ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్ తీసుకోవడంతో పాటు, ఇన్‌ఫ్లమేషన్‌ను ప్రేరేపించే పదార్థాలను పూర్తిగా మానేయాలి.

ఇన్‌ఫ్లమేషన్ ఎందుకు?

ఇటీవలి కాలంలో మన ఆహారంలో ప్రాసెస్ చేసిన పదార్థాల మోతాదు పెరిగింది. తెల్ల బియ్యం, గోధుమలు, మైదా, వంటనూనెలు, చక్కెర ఇవన్నీ ప్రాసెస్ చేసినవే! ఇన్‌ఫ్లమేషన్ కోసం వీటినే నేరుగా తినవలసిన అవసరం లేదు. వీటితో తయారయ్యే బిరాయానీలు, రొట్టెలు, బ్రెడ్లు, స్వీట్స్, కేక్స్, పిజ్జా లాంటి జంక్ ఫుడ్స్ ఇవన్నీ ఇన్‌ఫ్లమేషన్ కారకాలే! ఇంతకు ముందు ఈ సమస్య ఉండేది కాదు. ఇంట్లో తయారు చేసుకునే వంటకాల్లో దంపుడు బియ్యం, పొట్టు తీయని కందిపప్పు, పెసరపప్పు, పసుపు, వెల్లుల్లి వాడుకుంటూ ఉండేవాళ్లం. కానీ ఇప్పుడు మనం తింటున్న ఆహారంలో 80% ప్రాసెస్ చేసిన పదార్థాలే ఉంటున్నాయి. ప్రాసెస్డ్ మీట్, రిఫైన్డ్ షుగర్స్, రిఫైన్డ్ ఆయిల్స్, ఎక్కువ ఉప్పు, తీపి, నూనెలు కలిసిన పదార్థాలు, డీప్ ఫ్రై పదార్థాలు ఎక్కువగా తింటున్నాం. వీటి వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ మొదలై, వాపులు, నొప్పుల రూపంలో బయటపడుతూ ఉంటుంది. ఇన్‌ఫ్లమేషన్ మూలంగా కార్డియోవాస్క్యులర్ సమస్యలు కూడా పెరుగుతాయి. జీర్ణ వ్యవస్థ ఇబ్బందులకు లోనవుతుంది. చర్మ సమస్యలు పెరుగుతాయి.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌తో...

ఈ డైట్‌తో ఒబేసిటీ అదుపులోకి రావడంతో పాటు మరెన్నో ఆరోగ్యపరమైన ప్రయోజనా లుంటాయి. అవేంటంటే...

- **తీవ్ర రుగ్మతలు:** గుండె జబ్బులు, కేన్సర్లు, ఆటో ఇమ్యూన్ ముప్పులు తగ్గుతాయి
- ఇమ్యూనిటీతో పాటు, చర్మ ఆరోగ్యం, శక్తి మోతాదులు కూడా పెరుగుతాయి
- క్యాలరీలు తక్కువ, పీచు ఎక్కువ కాబట్టి బరువు తగ్గుతారు



డాక్టర్ సుజాత స్టీఫెన్
క్లినికల్ న్యూట్రిషనిస్ట్,
యశోద హాస్పిటల్స్
మలక్ పేట, హైదరాబాద్.

వీటి మోతాదు పెంచాలి

- ఒమేగా3 పుష్కలంగా ఉండే సాల్మన్, మ్యాకెరల్ చేపలు
- ఆకుకూరలు
- వాల్‌నట్స్, బాదం
- షియా సీడ్స్, గుమ్మడి విత్తనాలు, అవిసె గింజలు
- యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే దానిమ్మ, బెర్రీ, సిట్రస్ పండ్లు
- పసుపు, దాల్చినచెక్క, వెల్లుల్లి, అల్లం
- బ్రౌన్ రైస్, మిల్లెట్స్, హోల్ వీట్ ఆటా, దంపుడు బియ్యం
- సెనగలు, బొబ్బర్లు, అలసందలు
- పెరుగు, మజ్జిగ

విటమిన్ డి లోపంతో...

ఇన్‌ఫ్లమేషన్‌కు మరొక ప్రధాన కారణం విటమిన్ డి లోపం. కాబట్టి ప్రతి ఒక్కరూ విటమిన్ డి మోతాదును పరీక్షించుకుని, అవసరం మేరకు సప్లిమెంట్ల రూపంలో ఈ విటమిన్ భర్తీ చేసుకుంటూ ఉండాలి. మనం ప్రధానంగా నిర్లక్ష్యం చేసే మరొక మినరల్ మెగ్నీషియం. ఈ లోపాన్ని భర్తీ చేసుకోవడం కోసం గుమ్మడి విత్తనాలు, పుచ్చ విత్తనాలు తీసుకోవాలి.

- కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్, గానుగ నూనెలు, బెల్లం, దంపుడు బియ్యం
- ప్రతి రోజూ 5 నుంచి 7 రకాల కూరగాయలు, పండ్లు తినాలి
- వంటకాల్లో పసుపు, దాల్చినచెక్క, అల్లం ఎక్కువగా వాడాలి

ఇవి వద్దే వద్దు


- హాట్ డాగ్, సాసేజ్, బేకన్ లాంటి ప్రాసెస్డ్ మీట్స్
- తెల్లని చక్కెర, హై ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ లాంటి రిఫైన్డ్ షుగర్స్
- లాక్టోజ్ ఇంటాలరెన్స్ కలిగి ఉండేవాళ్లు పాల ఉత్పత్తులు తీసుకోకూడదు
- సోడియం ఎక్కువగా ఉండే ప్రాసెస్డ్, క్యాన్డ్ ఫుడ్స్
- పిజ్జాలు, బర్గర్లు లాంటి బేక్ చేసిన స్నాక్స్, పదార్థాలు
- శీతల పానీయాలు
- గ్లూటెన్ పడనివాళ్లు గోధుమలు, మైదాలతో తయారయ్యే పదార్థాలకు దూరంగా ఉండాలి

డయాగ్నొస్టిక్స్

పరీక్షలతో ఆరోగ్యరక్షణ!

వయసుల వారీగా వేధించే ఆరోగ్య సమస్యలకు ముందుగానే అడ్డుకట్ట వేయాలంటే, వాటిని పసిగట్టే వీలున్న ఈ పరీక్షలు వయసుల వారీగా చేయించుకుంటూ ఉండాలి.

- 18వ ఏడులో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రతి రెండేళ్లకోసారి బ్లడ్ ప్రెషర్ చెక్ చేయించుకుంటూ ఉండాలి.
- 20వ ఏట నుంచి ప్రతి ఐదేళ్లకోసారి కొలెస్టరాల్ పరీక్ష చేయించుకుంటూ ఉంటే గుండె జబ్బుల ప్రమాదాన్ని ముందుగానే నియంత్రించవచ్చు. ఇదే వయసునుంచి మొదలుపెట్టి 40 ఏళ్లకు చేరుకునేవరకూ ప్రతి మూడేళ్లకోసారి క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామ్, మామోగ్రామ్ స్ర్కీనింగ్ చేయించుకుంటూ ఉంటే రొమ్ము కేన్సర్‌ను నియంత్రించవచ్చు.
- 21వ ఏళ్ల నుంచి ప్రతి రెండేళ్లకోసారి పాప్‌స్మియర్, పెల్విక్ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షతో కణాల మార్పులను కనిపెట్టి సర్విక్స్ కేన్సర్ వచ్చే అవకాశాలను ముందుగానే కనిపెట్టవచ్చు.
- 45 ఏళ్ల వయసునుంచి ప్రతి మూడేళ్లకూ బ్లడ్ గ్లూకోజ్ టెస్ట్ చేయంచుకుంటూ ఉంటే, ప్రీ డయాబెటిస్‌ను గుర్తించవచ్చు.
- 50 ఏళ్ల మహిళల్లో మెనోపాజ్ వల్ల ఎముకల సాంద్రత తగ్గుతుంది. కాబట్టి ఆస్టియోపోరోసిస్‌ను గుర్తించటం కోసం ఏడాదికోసారి బోన్ డెన్సిటీ టెస్ట్ చేయించుకుంటూ ఉండాలి.



ఐ కేర్

కూలింగ్ గ్లాసెస్ అవసరమే!

ఎండాకాలమే కాదు, అన్ని కాలాల్లోనూ చలువ కళ్లజోడు ఉపయోగకరమే! అన్ని కాలాల్లోనూ ఎండలో అతినీలలోహిత కిరణాలు, రేడియేషన్ కలిసి ఉంటాయి. కాబట్టి వాటి నుంచి కళ్లకు రక్షణ కల్పించాలంటే చలువ కళ్లద్దాలు ధరించాలి.

సాధారణంగా మార్కెట్లో ఎన్నో రకాల కూలింగ్ గ్లాసెస్ దొరుకుతూ ఉంటాయి. వాటిలో చవకవీ, ఖరీదైనవీ ఉంటాయి. వీటిలో ఏది కొనాలో అర్థం అవక, అయోమయానికి గురవుతూ ఉంటాం. అయితే చలువ కళ్లద్దాలు వేటితోనైనా కళ్లకు రక్షణ దొరుకుతుంది. అయితే వాటికి అతినీలలోహిత కిరణాలను ఆపే 'యువి ప్రొటెక్షన్' ఉందా? అనేది తెలుసుకోవాలి. చవక చలువ కళ్లద్దాలతో పోలిస్తూ ఖరీదైన ప్రముఖ కంపెనీ ఉత్పత్తులు ఈ ఫిల్మ్ విషయంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తాయి. కాబట్టి కళ్లకు పూర్తి రక్షణ కోరుకుంటే, మన్నికైన, నాణ్యమైన కూలింగ్ గ్లాసెస్‌నే ఎంచుకోవాలి. తక్కువ ఖర్చులో చలువ కళ్లజోడు కొనే సమయంలో వాటి అద్దాల నాణ్యత పరిశీలించాలి.

చత్వారం ఉన్న వాళ్లు ఎండ సోకితే నల్లబడే 'ఫొటోక్రోమ్' జోడు ఎంచుకోవాలి.



హెల్త్ వెల్త్



కాగులెంట్స్ వల్లే రక్తం ద్రవ రూపంలో ఉంటుంది. రక్తంలో ఉండే కాగ్యులెంట్స్, ప్లేట్‌లెట్లు రక్తస్రావాన్ని నియంత్రిస్తూ ఉంటాయి. అయితే ఏ కారణంగానైనా ఇవి హెచ్చుతగ్గులకు గురైనప్పుడు రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడతాయి. ఈ పరిస్థితి తలెత్తకుండా బ్లడ్ థిన్నర్స్ ఉపయోగపడతాయి.

బ్లడ్ థిన్నర్స్ ఎందుకు?

మధుమేహం, అధిక రక్తపోటు, ధూమపానం, అధిక కొలెస్ట్రాల్, అతి ఒత్తిడి వంటి కారణాల వల్ల రక్తనాళాల్లోని లోపలి పొరలో ఉండే ఎండోథీలియం కణాలు దెబ్బతింటాయి. ఇవే కాకుండా, శరీరక శ్రమ లోపించడం, స్థూలకాయం వల్ల కూడా ఈ స్థితి ఏర్పడుతుంది. ఎండోథీలియం కణాలు దెబ్బ తిన్నప్పుడు రక్తం చిక్కబడటం, గడ్డలు కట్టడం జరుగుతుంది. ఈ గడ్డలు గుండె రక్తనాళాల్లో అడ్డుపడి గుండెపోటుకు కారణం కావచ్చు. మెదడు రక్తనాళాల్లో అడ్డుపడి పక్షవాతానికి కారణం కావచ్చు. అయితే, గడ్డలు ఏర్పడకుండా యాంటీ కాగులెంట్లను, ప్లేట్‌లెట్ల అసహజ ధోరణిని నివారించడానికి యాంటీ ప్లేట్‌లెట్లను ఇవ్వాల్సి ఉంటుంది.

బ్లడ్ థిన్నర్లు అందుకే...

సాధారణంగా రక్తాన్ని పలచబరిచే బ్లడ్ థిన్నర్లను రెండవ దశ వైద్యంగానే ఇస్తారు. అంటే యాంజియోప్లాస్టీ, లేదా స్టెంట్‌లు వేసిన తర్వాత ఇస్తూ ఉంటారు. ఈ మందులను కనీసం ఏడాదిపాటైనా, క్రమం తప్పకుండా వాడుకోవలసి ఉంటుంది. దెబ్బతిన్న గుండె కవాటాలకు చికిత్స పొందిన వాళ్లయితే ఈ మందులను జీవితకాలమంతా వాడాల్సి ఉంటుంది. కాలి నరాల్లో రక్తం గడ్డలు కట్టినప్పుడు(థ్రాంబోసిస్), అవి కరిగిపోవడానికి ఈ మందులు 6 మాసాల పాటు వాడాల్సి ఉంటుంది. రక్తం గడ్డకట్టుకుపోవడం వల్ల కొందరి గుండె లయ తప్పుతూ ఉంటుంది. అలాంటి వారికి కూడా యాంటీ కాగ్యులెంట్లు, నావల్-యాంటీ కాగ్యులెంట్ల వంటి మందుల వల్ల ప్రయోజనం కలుగుతుంది.

> రక్తం పలచగా ఉండడం వల్ల ఎముకలు, పొట్ట, చర్మం, మెదడు భాగాల్లో అతిగా రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. అందు వల్ల ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా పలు విధాలా ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

జాగ్రత్తలు తప్పవు!

బ్లడ్ థిన్నర్ల వల్ల ఎంతో మంది హృద్రోగులకు ప్రయోజనం కలుగుతుందనేది వాస్తవం. అయితే, కొంత మంది హృద్రోగులు వీటి దుష్ప్రభావాలకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యంగా రక్తం పలచగా ఉండడం వల్ల ఎముకలు, పొట్ట, చర్మం, మెదడు భాగాల్లో అతిగా రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. అయితే, రోగి పడిపోయి గాయాల పాలై, లేదా మరేదైనా ప్రమాదానికి గురైనప్పుడే ఈ దుష్ప్రభావాలు ఎక్కువగా కనిపిస్తాయి. అందువల్ల ఇలాంటి ప్రమాదాల బారిన పడకుండా పలు విధాల ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. అలాగే ఏదైనా సర్జరీ జరగడానికి, లేదా దంతాలను తొలగించడానికి ముందు బ్లడ్ థిన్నర్ మందులను ఆపాల్సి ఉంటుంది. సర్జరీ అయిపోయాక మందులను వేసుకోవడం మళ్లీ కొనసాగించవచ్చు. ఈ కొన్ని జాగ్రత్తలు పాటిస్తే, బ్లడ్ థిన్నర్ల ద్వారా అనేక ప్రయోజనాలు, అవసరమైన ఆరోగ్య రక్షణ పొందవచ్చు.

లంగ్ కేన్సర్ అవేర్‌నెస్ మంత్



ఊపిరితిత్తులకు ప్రథమ శత్రువు ధూమపానం ఒక్కటే కాదు. వాతావరణ కాలుష్యం మొదలు ఎన్నో రకాల ముప్పులు లంగ్స్‌కు పొంచి ఉంటాయి. వాటిని తొలగించుకుంటూ ప్రధానంగా లంగ్ కేన్సర్ ముప్పు నుంచి లంగ్స్‌ను కాపాడుకోవడం అవసరం.

లంగ్స్‌కు లక్ష ముప్పులు

ప్రపంచంలో రెండవ అత్యంత సాధారణ కేన్సర్... లంగ్ కేన్సర్. లంగ్ కేన్సర్ ప్రాణాంతకంగా మారే అవకాశాలు ఎక్కువ. కానీప్రారంభంలోనే లక్షణాలను గుర్తించి, చికిత్స మొదలుపెడితే ఈ కేన్సర్ నుంచి సురక్షితంగా బయటపడవచ్చు. అంతకంటే ముఖ్యంగా ఈ కేన్సర్‌కు గురి కాకుండా ఉండడం కోసం ముందస్తు జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. లంగ్ కేన్సర్ ముప్పును తెచ్చిపెట్టే కారకాలు కోకొల్లలు. అవేంటంటే...



గాలి కాలుష్యం: అత్యధిక ట్రాఫిక్, పారిశ్రామిక కార్యకలాపాలు జరుగుతూ ఉండే నగరాల్లో గాలి కలుషితమవుతూ ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో ధూళి కణాలు, రసాయనాలు లాంటివి కలిసిపోయి ఉంటాయి. ఇవి శ్వాసకోస సమస్యలు, కేన్సర్ ముప్పును పెంచుతాయి. నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్‌లు దీర్ఘకాలంలో ఊపిరితిత్తుల్లోని కణజాలాన్ని దెబ్బతీసి, కేన్సర్ వ్యాధికి ఆస్కారం కల్పిస్తాయి. కాబట్టి ఇంట్లో నుంచి బయట అడుగుపెట్టిన ప్రతిసారీ మాస్క్ ధరించాలి.

సెకండ్‌హ్యాండ్ స్మోక్: ధూమపానం అలవాటు లేకపోయినా, ఆ అలవాటున్న వాళ్లు వదిలే పొగ పీల్చడం వల్ల కూడా లంగ్ కేన్సర్ సోకుతుంది. సిగరెట్ పొగలోని రసాయనాలు ఊపిరితిత్తుల్లోని కణాలను దెబ్బతీసి కేన్సర్ ముప్పును పెంచుతాయి. సెకండ్‌హ్యాండ్ స్మోక్‌కు క్రమంతప్పక బహిర్గతమయ్యేవాళ్లలో లంగ్ కేన్సర్ ముప్పు 30 శాతం మేరకు ఉంటుంది.

రాడాన్ గ్యాస్: ఈ అణుధార్మిక వాయువు సహజసిద్ధంగానే గాలిలో కలిసిపోయి ఉంటుంది. వాసన లేని ఈ వాయువును ప్రత్యేకమైన పరీక్షతో తప్ప పసిగట్టే వీలుండదు. ఈ వాయువు, లంగ్ కేన్సర్‌కు రెండవ ప్రధాన కారణం. కాబట్టి ఇంట్లో రాడాన్ గ్యాస్ పేరుకుపోకుండా, గాలి ధారాళంగా చొరబడేలా చూసుకోవాలి. ఎగ్జాస్ట్ ఫ్యాన్స్ వాడుకోవాలి.



వృత్తుల్లో: వృత్తిలో భాగంగా ప్రమాదకరమైనరసాయనాలు, అణువులకు బహిర్గతమయ్యేవారు కూడా లంగ్ కేన్సర్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. గనుల్లో పని చేసేవారు, భవన నిర్మాణ పనులు చేసేవారు, ఫ్యాక్టరీ వర్కర్లు యాస్‌బెస్టాస్, సిలికా డస్ట్, ఫార్మాల్డిహైడ్ రసాయనాలకు బహిర్గతమవుతూ ఉంటారు. ఈ పదార్థాలు లంగ్స్‌లోకి చేరుకుని, తీవ్రమైన ఇరిటేషన్ తలెత్తేలా చేసి, దీర్ఘకాలంలో లంగ్స్ గట్టిపడి, కేన్సర్‌కు దారి తీయడానికి దోహదపడతాయి.

స్మోకింగ్, వేపింగ్: ధూమపానంతో లంగ్ కేన్సర్ సోకుతుందనే విషయం అందరికీ తెలిసిందే! ధూమపానంతో కేన్సర్ కారకాలు లంగ్స్‌లోకి నేరుగా ప్రవేశించి అక్కడి నుంచి రక్తప్రవాహంలోకి చేరుకుంటాయి. ధూమపానంతో లంగ్స్‌లోని కణాలు దెబ్బతిని ఉత్పరివర్తనాలకు దారి తీస్తాయి. వేప్స్‌లోని ద్రవాల్లోని రసాయనాలు ఇన్‌ఫ్లమేషన్‌కు దారి తీస్తాయి.

కుటుంబ చరిత్ర: కుటుంబ చరిత్రలో కేన్సర్ ఉన్నప్పుడు, వారి సంతానానికి లంగ్ కేన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుంది. టాక్సిన్లను ప్రాసెస్ చేయడంలో, దెబ్బతిన్న కణాలను మరమ్మతు చేయడంలో జన్యువులు కీలక పాత్ర పోషిస్తాయి. కొన్ని సందర్భాల్లో వంశపారంపర్యంగా సంక్రమించిన జన్యు ఉత్పరివర్తనాలు లంగ్ కేన్సర్ వృద్ధికి తోడ్పడుతూ ఉంటాయి.

తీవ్ర శ్వాసకోస ఇన్‌ఫెక్షన్లు: బ్రాంకైటిస్, న్యుమోనియాలతో దీర్ఘకాలంలో లంగ్స్ బలహీనపడతాయి. ఇలాంటి ఇన్‌ఫెక్షన్లతో ఊపిరితిత్తుల్లోని కణజాలం దెబ్బతినడం వల్ల, పలురకాల వ్యాధులు, మరీ ముఖ్యంగా లంగ్ కేన్సర్ ముప్పు పెరుగుతుంది. మరీ ముఖ్యంగా క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్‌తో బాధపడేవాళ్ల ఊపిరితిత్తులు అప్పటికే బలహీనపడిపోయి ఉంటాయి కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లకు లంగ్ కేన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుంది.



తామిచ్చే దుస్తులను ముఖ్యమంత్రి చంద్రబాబుకు చూపుతున్న గోల్డెన్ టెంపుల్ ప్రతినిధులు

5,000 కుటుంబాలకు దుస్తుల పంపిణీ

» సీఎంను కలిసిన వెల్లూరు గోల్డెన్ టెంపుల్ ప్రతినిధులు

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల కోసం తమిళనాడు వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్ ప్రతినిధులు డాక్టర్ కల్యాణ్ సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలో వరద బాధితుల కోసం రూ.85లక్షల విలువైన దుస్తులు అందజేశారు. 5000 కుటుంబాలకు సరిపడే దుప్పట్లు, చీరలు, టవళ్లు, పంచెలు తీసుకొచ్చారు. పంపిణీ నిమిత్తం దేవాదాయ శాఖ కమిషనర్‌కి అప్పగించారు.

మార్కెట్ సెస్ ఒక శాతానికి తగ్గించాలి

» ప్రభుత్వానికి మంత్రుల కమిటీ సిఫారసు

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో నిత్యావసరాల ధరల పెరుగుదల, ప్రభుత్వం తీసుకున్న చర్యలతో వస్తున్న ఫలితాలపై చర్చించడానికి మంత్రుల కమిటీ భేటీ అయింది. సోమవారం సచివాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల, అచ్చెన్నాయుడు, సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రస్తుతం 2శాతంగా ఉన్న మార్కెట్ రుసుము (సెస్)ను ఒక శాతానికి తగ్గించాలని ఈ కమిటీ నిర్ణయించింది. ధరల స్థిరీకరణకు రూ.500 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు దిశగా ప్రభుత్వం చేస్తున్న సమాలోచనలపైనా చర్చించింది. 'క్యూఆర్ కోడ్ ద్వారా తగ్గింపు ధరలతో వంట నూనెలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా ప్రజలకు విక్రయించేలా చర్యలు తీసుకున్నాం. లీటర్ పామాయిల్ రూ.110 లకే అమ్ముతున్నారు. కందిపప్పు, పంచదారను కూడా రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్‌లతో పాటు 2,200 రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా తగ్గింపు ధరలకు విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వివిధ చర్యలతో గత నెలలో ఉల్లి, టమాటా ధరలు తగ్గాయి' అని ధరల నియంత్రణ కమిటీ ఛైర్మన్, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

16.47 లక్షల ఉచిత గ్యాస్ బుకింగులు

» 'టోల్ ఫ్రీ' కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి నాదెండ్ల



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఇప్పటివరకు 16.47 లక్షల మంది బుకింగ్ చేసుకున్నారు. బుక్ చేసుకున్న లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు శుభాకాంక్షల సందేశాలు వెళ్తున్నాయి. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1967 టోల్ ఫ్రీ నంబరుకు ఇప్పటివరకు 3 వేల మంది ఫోన్లు చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో టోల్ ఫ్రీ నంబరు కార్యాలయాన్ని మంత్రి నాదెండ్ల సోమవారం పరిశీలించారు. టోల్ ఫ్రీ నంబరుకు రోజుకు సగటున ఎన్ని కాల్స్ వస్తున్నాయి? ప్రజలు ఎలాంటి సందేహాలను వ్యక్తం చేస్తున్నారు? వివరాలను అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు.

పంట ఉత్పత్తులపై ఆంక్షలు తగదు: వెంకయ్య

విజయవాడ(వన్‌టౌన్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పంటల ఎగుమతిపై నిబంధనలు మంచిది కాదని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏ వస్తువు ఎగుమతిపైనా లేని నిబంధనలు ఒక్క పంటల ఎగుమతి పైనే ఎందుకని ప్రశ్నించారు. విజయవాడ బందరు రోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జాతీయ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆయన ముఖ్య అతిథిగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. రైతులతో మిల్లర్లకు అవినాభావ సంబంధం ఉందన్నారు. మిల్లర్ల సమస్యలపై ఎప్పటికప్పుడు అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేయవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. తాను ఢిల్లీ వెళ్లిన తరువాత కేంద్ర ఆహార మంత్రితో మాట్లాడి మిల్లర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ.. రైతులు, మిల్లర్లు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మహిళల పథకాలపై 'కామన్వెల్త్ సదస్సు'లో చర్చ

» రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను, ప్రత్యేకించి మహిళలకు ఉద్దేశించిన పథకాల గురించి కామన్‌వెల్త్ మహిళా పార్లమెంట్ స్టీరింగ్ కమిటీ మీటింగ్‌లో సవివరంగా చర్చించినట్టు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ సమావేశానికి హాజరైన ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్ చాప్టర్ తరపున ప్రాతినిధ్యం వహిస్తూ.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న మహిళా పథకాలపై కామన్వెల్త్ సదస్సులో చర్చించే అవకాశం తనకు కలిగినందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

వైసీపీ ఎమ్మెల్యే అండతో అక్రమ కేసు

» టీడీపీ ప్రజావేదికలో న్యాయవాది ఆవేదన

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అండతో పోలీసులు తనపై అక్రమ కేసులు పెట్టారని కర్నూలు జిల్లా పెద్దకడబూరుకు చెందిన న్యాయవాది డి.చంద్రయ్య వాపోయారు. తనపై నమోదైన అక్రమ కేసులు తొలగించేలా చూడాలని, అక్రమార్కులకు సహకరిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో కోరారు. గ్రీవెన్స్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మాజీ మంత్రి పీతల సుజాత, టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేష్ వినతులు స్వీకరించారు. వైసీపీ నేతలు తన స్థలంలో నిర్మాణాలు చేపడుతూ, తమపైనే దాడులు చేస్తున్నారని విజయవాడకు చెందిన దాసరి కుమారి వాపోయారు.

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

విశాఖపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో సోమవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి విస్తరించడంతో తమిళనాట వర్షాలు కురుస్తున్నాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రెండు, మూడు రోజుల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా.. సోమవారం రాష్ట్రంలో అనేకచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి.

ఐఏఎస్ వాణీప్రసాద్‌కు తప్పిన ప్రమాదం

» అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

మునగాల, సూర్యాపేట సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఆమె ప్రయాణిస్తున్న ఫార్చునర్ కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమె స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల గ్రామ శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. వాణీప్రసాద్ సోమవారం ఫార్చునర్ కారులో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయల్దేరారు. ఆకుపాముల గ్రామ శివారులో ముందువెళ్తున్న శాంత్రో కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో.. డ్రైవర్ ఆ కారుని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో అదుపుతప్పిన ఫార్చునర్ రోడ్డు దిగి 100 అడుగుల దూరం పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆర్డీవో సూర్యనారాయణ, మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్.. వాణీప్రసాద్‌ను చికిత్స నిమిత్తం తొలుత సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌కు తరలించారు.

రోత పత్రిక.. నీతి చంద్రిక!



(మొదటి పేజీ తరువాయి)

వేధింపులు చట్టవ్యతిరేకం. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు పూర్తి విరుద్ధం. 41ఏ నోటీసు ఇచ్చి వివరణ తీసుకోకుండా కేసు పెట్టి అరెస్టు చేయడం దుర్మార్గం. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛకు విఘాతం. ప్రశ్నించే వారిని భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యం"... ఇవి సోమవారం జగన్ రోత పత్రిక వల్లె వేసిన నీతి సూత్రాలు! ఇదే అంశంపై జగన్ కూడా 'ఎక్స్'లో తీవ్రంగా ఆక్రోశించారు. కూటమి సర్కారులో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తూ... అన్ని ఆధారాలతో చర్యలు తీసుకుంటున్నప్పటికీ... 'ఇది అన్యాయం. రాజ్యాంగంపై దాడి' అని వాపోతుండటమే విచిత్రం. వైసీపీ ఐదేళ్ల పాలనలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్, వారి కుటుంబ సభ్యులను, టీడీపీకి చెందిన మహిళా నేతలను వైసీపీ సోషల్ మీడియాలో ఎంతగా దూషించినా, ఎంత అసభ్యంగా తిట్టిపోసినా పట్టించుకోలేదు. అదే సమయంలో... జగన్ సర్కారును విమర్శిస్తే సీఐడీ ఆగమేఘాలపైన రంగంలోకి దిగేది. ఎవరో పెట్టిన పోస్టులను ఫార్వర్డ్ చేసినా కేసులు పెట్టి, అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మహిళలు, వృద్ధులు అని కూడా చూడకుండా క్రూరంగా వ్యవహరించారు. పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు, చివరకు పార్లమెంటు సభ్యుడికీ వేధింపులు తప్పలేదు. గత ఐదేళ్ల జగన్ పాలనలో అక్రమ కేసులు ఎదుర్కొని వేధింపులకు గురైనవారు వేలల్లో ఉంటారు. ఇక వైసీపీ శ్రేణుల అరాచకాలకు అంతే లేదు. దౌర్జన్యాలు, కబ్జాలు, దాడులు చేసి బాధితులపైనే అక్రమ కేసులు బనాయించారు. అప్పుడు జగన్‌కు కానీ, ఆయన రోత పత్రికకు కానీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, హక్కులు గుర్తుకు రాలేదు. ఇప్పుడు... 'ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం' అని ఆక్రోశిస్తున్నారు.

నాటి అరాచకాలు మచ్చుకుకొన్ని..

- '41ఏ' నోటీసు ఇవ్వకుండా అరెస్టులా అని ఇప్పుడు ప్రశ్నిస్తున్న జగన్... తాను అధికారంలో ఉండగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా నాటి ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబును అర్ధరాత్రి అరెస్టు చేయించారు. అసలు ఏ కేసులో అరెస్టు చేస్తున్నారో కూడా చెప్పలేదు.
- డీజీపీ ఆఫీస్ పక్కనే టీడీపీ పార్టీ కార్యాలయంపై దాడి చేసినా చర్యల్లేవు
- నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ఇంటిపై వైసీపీ మూకల దాడి
- ఎవరో పంపిన పోస్టును ఫార్వర్డ్ చేసిన 65 ఏళ్ల మహిళకు పొద్దు పోయే దాకా సీఐడీ పోలీసుల వేధింపులు
- స్మగ్లింగ్ బంగారం గురించి సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన 70 ఏళ్ల జర్నలిస్టు అర్ధరాత్రి అరెస్టు.. బాధితులపైనే అట్రాసిటీ కేసులు
- మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై చితక బాది పిచ్చాసుపత్రికి తరలింపు
- వైసీపీ నేతల ఇసుక దోపిడీని ప్రశ్నించిన దళిత యువకుడికి పోలీసు స్టేషన్లో శిరోముండనం
- జగన్ పాలనలో లోపాలను ఎత్తిచూపిన మీడియా సంస్థలపై దేశద్రోహం కేసు
- వార్తల కవరేజీలో భాగంగా ఫొటోలు, వీడియోలు తీసిన జర్నలిస్టులపై నిర్భయ చట్టం కింద ఎఫ్ఐఆర్
- సోషల్ మీడియాలో పోస్టు పెడితే నేరపూరిత కుట్రగా చిత్రీకరణ
- రాజధానిలో ఎస్సీ రైతులపై అట్రాసిటీ కేసులు
- సాక్షాత్తూ హైకోర్టు న్యాయమూర్తులనే టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో వైసీపీ మద్దతుదారులు పోస్టింగ్‌లు
- నరసాపురం ఎంపీ రఘురామరాజు(ప్రస్తుతం ఎమ్మెల్యే)పై ఏకంగా దేశద్రోహం కేసు పెట్టి చితకబాదిన సీఐడీ పోలీసులు

సుప్రీం ఉత్తర్వులు వర్తించవా?



సోషల్ మీడియా వినియోగంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని 2018 ఏప్రిల్ 19న ఒక మహిళా జర్నలిస్టు కేసులో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ప్రపంచంలోని ప్రతివ్యక్తి జీవితాన్ని ప్రభావితం చేస్తున్న సోషల్ మీడియా వాడకం తప్పనిసరి అయితే దాని పర్యవసానాలు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించింది. విజయవాడ పోలీసులు ఒకే రోజు 42 కేసులు నమోదు చేశారని రోత పత్రిక రాసింది. ఆ వ్యక్తులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, హోంశాఖ మంత్రి(మహిళ)పై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు ఎంత అభ్యంతరకరంగా ఉన్నాయో ఎందుకు రాయలేదు?

నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, జనసేనాని పవన్ కల్యాణ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత తదితరులపై గుడివాడ నాని, వల్లభనేని వంశీ తదితర వైసీపీ నేతలు నీచాతినీచంగా బూతులు తిట్టారు. వారించాల్సిన నాటి ముఖ్యమంత్రి జగన్ ముసిముసి నవ్వులు నవ్వడం జనం మరచిపోలేరు. ఒక టీడీపీ నాయకుడు నోరు జారాడని డీజీపీ కార్యాలయం పక్కనే ఉన్న ఆ పార్టీ కార్యాలయంపైకి వైసీపీ శ్రేణులు దాడి చేశారు. అదే చంద్రబాబుపై అమరావతిలో రాళ్లు, చెప్పులు విసిరిన వైసీపీ కార్యకర్తలపై ఎలాంటి చర్యలూ లేవు.

ప్రతిపక్షంపై కర్కశత్వం

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందంటూ నాటి డీజీపీ గౌతమ్ సవాంగ్ సెలవిచ్చారు. నాడు చంద్రబాబు ఇంటిపైకి దండయాత్ర చేసిన ఎమ్మెల్యేకి జగన్ మంత్రి పదవి ఇచ్చారు. చంద్రబాబు సొంత జిల్లా పర్యటనకు వెళితే వైసీపీ శ్రేణులు చేసిన బీభత్సకాండ అంతా ఇంతా కాదు. గతంలో ఇదే జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అప్పటి సీఎం చంద్రబాబును కాల్చి చంపాలంటూ తీవ్రమైన వ్యాఖ్యలు చేసినా కేసు పెట్టలేదు. అంతెందుకు గత నాలుగు నెలల్లో కూటమి ప్రభుత్వం జగన్ రెడ్డిని ఎక్కడైనా అడ్డుకుందా? ఎన్ని విమర్శలు చేసినా కేసులు పెట్టిందా?

నాడు హక్కులు గుర్తుకు రాలేదా?

అసెంబ్లీ అయినా, బహిరంగ సభ అయినా, ఆఖరికి మంత్రివర్గ సమావేశమైనా జగన్ మైకు పట్టుకుంటే చాలు 'దుష్టచతుష్టయం' అని తన తప్పులను ఎత్తిచూపించే మీడియాను విమర్శించేవారు. నాటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు మీడియా సంస్థలపై దేశద్రోహం కేసులు.. పాత్రికేయులపై నిర్భయ చట్టం... ఆఖరికి వాట్సాప్ సందేశాలపై నేరపూరిత కుట్ర కేసులు నమోదు చేశారు. అప్పుడు జగన్‌కు, ఆయన రోత పత్రికకు మీడియా హక్కులు గుర్తుకు రాలేదు. అయితే ఇటీవల విజయవాడ వరదల్లో ప్రభుత్వం చేసిన ఖర్చు కన్నా ఎక్కువ అవినీతి జరిగిందని వండి వార్చిన కథనాన్ని ప్రచురించిన రోత పత్రికపై కేసులు పెడితే గగ్గోలు పెడుతున్నారు.

కోర్టు బోనెక్కిన డీజీపీ

అయ్యన్నపాత్రుడి కుమారుడి పెళ్లికి విశాఖ వెళ్లిన చంద్రబాబును విమానాశ్రయంలో పోలీసులు, వైసీపీ శ్రేణులు అడ్డుకున్నారు. తర్వాత పల్నాడులోని ఆత్మకూరులో అధికార పార్టీ దాడులకు గురై గాయపడిన పార్టీ కార్యకర్తల్ని పరామర్శించేందుకు బయలు దేరిన చంద్రబాబును బయటికి రానివ్వకుండా ఇంటి గేటుకు పోలీసులు తాళాలు వేశారు. ఈ రెండు ఘటనల్లో అప్పటి డీజీపీ గౌతమ్ సవాంగ్‌ను కోర్టు పిలిపించింది. చట్టం(సెక్షన్ 151) ఏమి చెబుతోందో చదువు కోలేదా.. అయితే చదవండి అంటూ కోర్టులోనే సీఆర్‌పీసీ చదివించింది.

ఉద్యోగులపై ఉక్కుపాదం

శాంతియుత నిరసనలు చేపట్టేందుకు యత్నించిన ప్రభుత్వ ఉద్యోగులపై నాడు పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఇళ్ల నుంచి బయటకు రాకుండా చేశారు. ఉద్యోగ సంఘాల నేతల్ని అరెస్టు చేశారు. ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లోకి వెళ్లి మరీ స్టేషన్‌కు తీసుకురావడం అరాచకానికి పరాకాష్ఠ.

సోషల్ మీడియా కార్యకర్తల నిర్బంధం దారుణం

» భావవ్యక్తీకరణ హక్కులకు విరుద్ధం: జగన్

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా కార్యకర్తలను నిర్బంధించడమంటే.. వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమేనని.. రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడిచేయడమేనని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆక్రోశించారు. దీనిపై సోమవారం 'ఎక్స్'లో స్పందించారు. పోలీసుల అధికార దుర్వినియోగం క్షమించరానిదని, వారి చర్య భావవ్యక్తీకరణ హక్కులకు విరుద్ధమని తెలిపారు. రాజకీయ ప్రేరేపిత చర్యలను తక్షణమే ఆపాలన్నారు.

గుంటూరు జిల్లా వైసీపీ మీడియా కన్వీనర్ పోలీసుల అదుపులో

తాడేపల్లి టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వైసీపీ మీడియా కన్వీనర్ ఎం వెంకటరామిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సోషల్ మీడియాలో విమర్శనాత్మకంగా పోస్టులు పెట్టారంటూ ఆయన్ను సోమవారం తాడేపల్లి పోలీసులు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు సోమవారం రాత్రి తాడేపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చారు. అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు.



ట్యాక్స్ కట్టకుండానే తోలేశారు

అడ్డదిడ్డంగా అంబులెన్స్‌లు నడిపిన అరబిందో.. గత మూడేళ్లు ప్రభుత్వానికి రోడ్ ట్యాక్స్ ఎగవేత

» సర్కారు మారినా మాయని మమకారం

» అరబిందో ఒక్కో ఎత్తుకు ఉన్నతాధికారుల సాయం

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చివరి మూడేళ్లు అరబిందో సంస్థకు స్వర్ణయుగమనే చెప్పాలి. 108, 104 అంబులెన్స్‌లను నిర్వహించే టెండరును 2021లో ఆ సంస్థ దక్కించుకుంది. అప్పటినుంచి 2024 జూన్ వరకూ అరబిందో అంబులెన్స్‌లు రోడ్లపై అడ్డదిడ్డంగా నడిచాయి. రోడ్ ట్యాక్స్, ఫినెనెస్, బీమా వంటి తప్పనిసరి నిబంధనలనూ గాలికి వదిలేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆ సంస్థకు నిబంధనలు గుర్తుకు వచ్చాయి. రోడ్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆరోగ్యశాఖకు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుకు అరబిందో ప్రతినిధులు లేఖ రాశారు. అప్పుడు ఆరోగ్యశాఖ అధికారులు, ట్రస్ట్ ఉన్నతాధికారులు ఏమనాలి? ముందు రోడ్ ట్యాక్స్ కట్టండి... తర్వాత వినహాయింపు గురించి ఆలోచిద్దామని తేల్చి చెప్పాలి. ట్యాక్స్ కట్టడి చివరి మూడేళ్ల కాలానికి భారీ జరిమానాలు వేసి ముక్కుపిండి వసూలు చేయాలి. కానీ ఆ సంస్థ ఇచ్చిన లేఖను తీసుకుని ఆగమేఘాల మీద ఫైలును నడిపించారు. అరబిందో కోరిన మినహాయింపునకు ఆరోగ్యశాఖ సూత్రప్రాయంగా ఆమోదిస్తూ.. ఫైలును రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(ఆర్‌టీఏ)కి పంపింది. ఫైల్‌ను పరిశీలించిన ఆర్టీఏ అధికారులు షాక్ అయ్యారు. మూడేళ్ల రోడ్ ట్యాక్స్ లేకుండా వాహనాలు ఎలా తిరగనిచ్చారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రోడ్ ట్యాక్స్ మినహాయింపు తమ చేతుల్లో ఉండదని, సీఎం అనుమతి తీసుకోవాలని సూచించారు. ఫైల్ సీఎంకు పెడితే ఏం జరుగుతుందో.. ఉన్నతాధికారులు ముందే గ్రహించారు. ఫైల్‌ను తమ దగ్గరే ఉంచుకున్నారు. మూడేళ్లకుపైగా అరబిందో ఆధ్వర్యంలో వెయ్యికిపైగా అంబులెన్స్ తిరుగుతున్నాయి. వాహనాలు మాత్రమే ప్రభుత్వం అందిస్తుంది. రోడ్‌ట్యాక్స్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్‌లు తానే కట్టుకోవాలన్న నిబంధనను అరబిందో ఉల్లంఘించింది. ఇన్సూరెన్స్‌ల గడువు ఎప్పుడో తీరిపోయింది. అయినా రెన్యువల్‌కు పోలేదు. రోడ్ ట్యాక్స్ కడుతుంటేనే వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లభిస్తుంది. ఫిట్‌నెస్ ఉంటేనే ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకొస్తాయి. ఈ మూడూ లేకపోతే వాహనాలను రోడ్డు మీద తిప్పడానికి వీల్లేదు. అయితే, వీటిల్లో ఒక్క నిబంధన కూడా అప్పటి అధికారులు, అరబిందో పాటించలేదు.

> "వైసీపీ హయాంలో అరబిందో సంస్థ ఆడిందే ఆట.. పాడిందే పాట. ట్యాక్స్ కట్టకుండా అరబిందో అంబులెన్స్‌లు రోడ్డెక్కినా అడిగిన వారు లేరు. ఫిట్‌నెస్ లేదని వాహనాలను టచ్ చేసే సాహసం ఎవరికీ ఆనాడు లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆరోగ్యశాఖలోని ఉన్నతాధికారులు, అరబిందోపై అదే ప్రేమను ఒలకబోస్తున్న తీరు ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం మారగానే అరబిందో వేయడం మొదలుపెట్టిన ఒక్కో ఎత్తుకు సహకారం అందిస్తున్నారు."

అరబిందోకు స్వస్తి..?

108, 104 వాహనాల నిర్వహణ బాధ్యతల నుంచి అరబిందోకు స్వస్తి చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సీఎం చంద్రబాబు దీనిపై అధికారులకు ఎప్పుడో స్పష్టత ఇచ్చారు. 'మేం తప్పు కొంటాం' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంతో ప్రభుత్వం ఈ అంశాన్ని మరింత తీవ్రంగా పరిగణించింది. వెంటనే అరబిందోను తప్పించాలని అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. రంగంలోకి దిగిన అధికారులు.. సంబంధిత ప్రక్రియను ప్రారంభించారు. కాగా, చాలా జిల్లాల్లో అరబిందో.. పెట్రోల్ బంక్‌లకు నెలవారీ బిల్లులు ఎగ్గొట్టినట్టు సమాచారం. దీంతో కొన్ని బంక్‌లు అరబిందో వాహనాలకు డీజిల్ నింపడం నిలిపివేసినట్లు తెలుస్తోంది.

వద్దన్నా మార్గదర్శిపై ప్రెస్‌మీట్లు

» హైకోర్టులో ఉండవల్లిపై లూథ్రా ఆరోపణ

» అలాంటిదేమీ లేదని జవాబు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిందన్న కేసు విచారణ సందర్భంగా సోమవారం హైకోర్టులో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా మధ్య వాగ్వాదం నెలకొంది. మార్గదర్శి కేసుపై మీడియాతో మాట్లాడరాదని చెప్పినప్పటికీ ఉండవల్లి ప్రెస్‌మీట్లు పెడుతున్నారని ఆ సంస్థ తరఫున హాజరైన లూథ్రా ఆరోపించారు. ఇందుకు ఉండవల్లి సమాధానమిస్తూ గత 90 రోజులుగా తాను మీడియాతో మాట్లాడలేదని, లూథ్రా కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రత్యారోపణ చేశారు. ఆర్బీఐ చట్టానికి విరుద్ధంగా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) పేరిట మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిందంటూ ఉండవల్లి కేసు పెట్టారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుల ధర్మాసనం విచారణ చేపట్టింది. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరైన ఉండవల్లి వాదనలు వినిపిస్తూ దాదాపు 69 వేల పేజీల డిపాజిటర్ల వివరాలు భౌతికంగా పుస్తకాల రూపంలో మార్గదర్శి సమర్పించిందని తెలిపారు. ఆ వివరాలను పెన్‌డ్రైవ్‌లో ఎలక్ట్రానిక్ రూపంలో తనకు అందజేయాలని కోరారు. మార్గదర్శి ఎస్క్రో బ్యాంకు ఖాతాలో దాదాపు రూ.5 కోట్లకు పైగా మొత్తం ఉందని, ఈ డబ్బు ఎవరిదో తెలుసుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉంటుందని తెలిపారు. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఈ కేసు ప్రొసీడింగ్స్‌కు సంబంధించి మీడియాలో మాట్లాడరాదని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ఉండవల్లి మీడియాతో మాట్లాడుతున్నారన్నారు. ఉండవల్లి స్పందిస్తూ లూథ్రా కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. జోక్యం చేసుకున్న ధర్మాసనం.. అనవసర విషయాల్లోకి ఇరుపక్షాలు వెళ్లవద్దని వ్యాఖ్యానించింది. తమకు సమయం కావాలని ఆర్బీఐ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ కోరడంతో విచారణ గురువారానికి వాయిదా పడింది.

ఫైబర్‌నెట్ రికార్డులన్నీ అప్పగించండి

» ఎండీ దినేశ్‌కుమార్‌ను కోరిన విజిలెన్స్

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్‌లో గత ఐదేళ్లు సాగిన లావాదేవీల సమస్త రికార్డులను అప్పగించాలని ఆ సంస్థ ఎండీ దినేశ్‌కుమార్‌ను విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కోరింది. జగన్ హయాంలో ఫైబర్‌నెట్ ఎండీగా మధుసూదన్‌రెడ్డి ఉండగా, అడ్డగోలు వ్యవహారాలకు ఈ సంస్థ అడ్డా మారిందన్న ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగతా వ్యవస్థలతోపాటు ఫైబర్‌నెట్ ప్రక్షాళనకూ పూనుకుంది. తదనుగుణమైన ఆదేశాలను ఆగస్టు 27వ తేదీన విజిలెన్స్ అధికారులకు జారీచేసింది. ఈ ఆదేశాలకు 13 రోజుల ముందు.. అంటే, ఆగస్టు 14వ తేదీన విజిలెన్స్ విభాగానికి ఫైబర్ నెట్ కొత్త ఎండీ దినేశ్‌కుమార్ ఒక లేఖ రాశారు. గత ఐదేళ్లలో ఫైబర్‌నెట్‌లో సాగిన లావాదేవీలపై విచారణ జరపాలని ఆ లేఖలో కోరారు. దీంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. 2019 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటిదాకా సంస్థ రికార్డులను సమర్పించాలంటూ దినేశ్‌కుమార్‌కు సోమవారం లేఖ రాశారు. సంస్థలో చేరిన సిబ్బంది, వారి హాజరు పట్టీ, జీతభత్యాల వివరాలు, చెల్లింపుల సమాచారం రికార్డులతో సహా అందించాలని ఆ లేఖలో కోరారు. సిబ్బంది వ్యక్తిగత సమాచారం .. ఆదాయపు పన్ను చెల్లింపుల వివరాలను ఇవ్వాలన్నారు. 2019 నుంచి ఫైబర్‌నెట్ తీసుకున్న రుణాలు .. వాటిపై వడ్డీ చెల్లింపుల వివరాలనూ కోరారు. ఉద్యోగులు ఎప్పుడు చేరారో.. ఎప్పుడు సంస్థను వదిలి పోయారనేది వివరాలు ఇవ్వాలని కోరారు. ఆదాయపు పన్ను, ఆడిట్ రిపోర్టులు, టాన్ నంబర్లు, ఫైబర్ నెట్ బోర్డు తీర్మానాలు, ఆర్థిక లావాదేవీల స్టేట్‌మెంట్లు, వాటికి సంబంధించిన నోట్సు, అకౌంట్ వివరాలను సమర్పించాలన్నారు. అంతేకాకుండా .. బ్యాంక్ అకౌంట్ వివరాలను కోరారు. ఫైబర్‌నెట్‌లో మంజూరు చేసిన పోస్టులు, డిప్యుటేషన్‌పై వచ్చిన సిబ్బంది వివరాలూ ఇవ్వాలన్నారు.

మెడికల్ సీట్ల పెంపునకు వెసులుబాటు కల్పించండి

» విశాఖలో నైపర్‌ను త్వరగా ఏర్పాటు చేయండి

» కేంద్ర మంత్రి నడ్డాకు ఎంపీ లావు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మెడికల్ సీట్లు పెంపునకు వెసులుబాటు కల్పించండి. అందుకు అడ్డుగా ఉన్న 10 లక్షల జనాభాకు 100 మెడికల్ సీట్ల నిబంధనను సవరించండి' అని టీడీపీ లోక్ సభాపక్ష నేత లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. సోమవారం ఢిల్లీలోని నడ్డా కార్యాలయంలో ఆయనను ఎంపీ లావు కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) త్వరగా ఏర్పాటు చేయాలని కోరాను. భూమి కేటాయింపు, బదలాయింపుతో పాటు, అన్ని విధాలుగా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలియజేశా. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి చెయ్యాల్సిన ఆరోగ్య పరీక్ష కేంద్రాలను ఉత్తరాంధ్రలో లేదా రాయలసీమలో ఏర్పాటు చేయాలని కోరాను. పాత 13 జిల్లాల్లోనే కాకుండా కొత్తగా ఏర్పడిన జిల్లాల్లోనూ క్రిటికల్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేయాలని విన్నవించా. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు" అని తెలిపారు.

సింఘాల్ రిలీవ్.. కేంద్ర సర్వీసులోకి


అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర సర్వీసులోకి వెళ్తున్న 1993 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ అధికారి అనిల్ కుమార్ సింఘాల్‌ను రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఈ మేరకు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. రెండేళ్ల ప్రయత్నాల తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆయనను డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ ఎడ్యుకేషన్ అదనపు కార్యదర్శిగా నియమించింది. దీంతో ఆయన స్థానంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాముకు మున్సిపల్ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించింది. కేంద్ర సర్వీసులో ఉన్న ఆయనకు 2017లో చంద్రబాబు టీటీడీ ఈవోగా అవకాశం కల్పించారు. అలా ఆయన కేంద్ర సర్వీసులు వదులుకుని, తన కేడర్ స్టేట్ అయిన ఏపీకి వచ్చారు. టీటీడీ ఈవోతోపాటు ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగానూ ఆయన విధులు నిర్వర్తించారు. ఇప్పుడు తిరిగి కేంద్ర సర్వీస్‌లోకి వెళ్లిపోతున్నారు. అలాగే, సమాచార, ప్రజాసంబంధాల శాఖ డైరెక్టర్ హిమాంశు శుక్లాకు ఏపీ చలనచిత్ర, టీవీ, థియేటర్ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

పార్టీకి ఉపయోగపడని మీకు రాజకీయాలెందుకు?

- మంత్రి సుభాష్‌పై చంద్రబాబు ఆగ్రహం
- పట్టభద్ర ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో అలసత్వంపై అసహనం
- పనితీరు నిరూపించుకోకుంటే ప్రత్యామ్నాయం చూస్తానని హెచ్చరిక



అమలాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం ఉపయోగపడని మీకు రాజకీయాలెందుకని రాష్ట్ర కార్మిక మంత్రి, రామచంద్రపురం ఎమ్మెల్యే వాసంశెట్టి సుభాష్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల నమోదు విషయంలో సీఎం ఆదివారం సాయంత్రం మంత్రులు, ఎమ్మెల్యేలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. తొలుత సుభాష్‌గారూ.. చెప్పండంటూ చంద్రబాబు మొదలుపెట్టారు. మంత్రి స్పందిస్తూ.. ఈ రోజు అధికారులతో పాటు పార్టీ కార్యకర్తలు ఓట్ల నమోదు కోసం వెళ్లారని చెబుతుండగా చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. 'చూడయ్యా.. నువ్వేమీ మాట్లాడొద్దు. ఇంకా నీకు రాజకీయాల పట్ల సీరియస్‌నెస్ రాలేదు. ఫస్ట్ ఎమ్మెల్యేవి, ఫస్ట్ టైమ్ మంత్రివి. నీ నియోజకవర్గం ఎక్కడుంది? ఇప్పటి వరకు 29 శాతం మాత్రమే చేశావు. 9 వేల ఓట్లకుగాను 2,630 ఓట్లు పూర్తి చేశావు. నిన్న ఒక్క రోజే 319 చేశావు. నీలో సీరియస్‌నెస్ ఏదీ? ఫస్ట్‌టైమ్ వచ్చావు. పార్టీ నీకు గౌరవం ఇచ్చి ఎమ్మెల్యేను చేసి మంత్రిని చేస్తే కనీసం పట్టుదల లేకపోతే ఎట్లా? మీరు నా అంచనాలకు తగ్గట్టు పనిచేయలేదు. ఎన్నిసార్లు చెప్పాను మీకు.. 95 సీఎంను అని! నా బాధ్యతగా నేను చేస్తున్నా. మీ బాధ్యతగా మీరు చేయండి. పార్టీకి పనిచేయని రాజకీయాలెందుకు? మీ పనితీరును నిరూపించుకోండి. లేదంటే ప్రత్యామ్నాయం చూస్తా' అని హెచ్చరించారు.



పదకొండు పదనిస..

అసెంబ్లీ సమావేశాల్లో నాలుగు పదకొండ్ల నడుమ వైసీపీ

సభకు జగనొస్తారా? అంటూ సోషల్ మీడియా పోస్టులు హల్‌చల్



అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నిను వీడని నీడను నేనే.. అన్నట్లుంది వైసీపీ విషయంలో 11వ నంబర్. ఈనెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల విషయంలోనూ వైసీపీకి సంబంధించి 11తో ఓ చతుర్ముఖ చిత్రం చోటుచేసుకుంది. ఏ చిన్న విషయం దొరికినా వైరల్ చేసేసే సోషల్ మీడియా యాక్టివిస్టులు దీనిని గుర్తించారు. "11వ నెల అయిన నవంబర్‌లో.. 11వ తేదీన మొదలై.. 11 రోజులు జరిగే అసెంబ్లీ సమావేశాలకు 11 మంది సభ్యులున్న వైసీపీ హాజరవుతుందా? ఆ సభ్యుల్లో ఒకరైన పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు వస్తారా?" అని ప్రశ్నిస్తూ హల్‌చల్ చేస్తున్నారు. దీనికి తగ్గట్లుగానే.. శాసనసభా సమావేశాల్లో పాల్గొనడంపై ఇప్పటిదాకా వైసీపీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. సాధారణంగా చట్ట సభలు ప్రారంభానికి ముందు రాజకీయపక్షాలు సభల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై తమ సభ్యులతో చర్చిస్తాయి. అయితే కొంతకాలంగా వైసీపీ అధినేత ప్రతి శుక్రవారం బెంగళూరులోని ప్యాలెస్‌కు వెళ్లి మంగళవారం తాడేపల్లికి తిరిగి వస్తున్నారు. ఆయన షెడ్యూల్ ప్రకారం ఈ శుక్రవారంలోగా వైసీపీఎల్పీ సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ సమావేశం ఏర్పాటు చేస్తారా? లేదా? అనేదానిపై స్పష్టత లేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

ఐదేళ్లలో అర్హులందరికీ ఇళ్లు

- పీఎంఏవై 2.0 పథకంపై కేంద్రంతో ఎంఓయూ
- వచ్చే ఏడాది కల్లా మరో 7.60 లక్షల ఇళ్లు కట్టాలి
- గృహ నిర్మాణశాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 పథకాన్ని ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. 2029 నాటికి రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించే లక్ష్యంతో పని చేయాలని దిశానిర్దేశం చేశారు. సోమవారం గృహనిర్మాణ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పీఎంఏవై అర్బన్ పథకం కింద 58,578 ఇళ్లు, పీఎంఏవై గ్రామీణ్ పథకం కింద మరో 17,197 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. డిసెంబరు నాటికి లక్ష ఇళ్లు పూర్తవుతాయని, లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించి ఇంటి తాళాలను వారికి అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. వచ్చే ఏడాది కల్లా మరో 7.60 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. డ్రోన్ల ద్వారా పేదల ఇళ్ల నిర్మాణ నాణ్యత పరిశీలన, కొలతలు తీసుకునేందుకు పైలెట్ ప్రాజెక్టును చేపట్టినట్లు హౌసింగ్ అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఇదే సాంకేతికత పరిజ్ఞానాన్ని పెద్ద లేఅవుట్లలో కూడా వినియోగించాలని చంద్రబాబు ఆదేశించారు. సంబంధిత శాఖల సమన్వయంతో రాష్ట్రంలోని అన్ని లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గృహనిర్మాణశాఖలోకి 597మందిని డిప్యుటేషన్‌పై తీసుకునేందుకు హౌసింగ్ అధికారులు చేసిన ప్రతిపాదనకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు.

అర్హులైన పేదలందరికీ పెన్షన్లు: మంత్రి కొండపల్లి

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ సామాజిక భద్రతా పెన్షన్లు అందాలని అధికారులను సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం సచివాలయంలో మంత్రి కార్యాలయంలో సెర్ప్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సెర్ప్ పరంగా ఉన్న సమస్యలను పరిష్కరించి మరింత శక్తివంతంగా పనిచేసేలా తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆటలకు అందలం..!

- ఇతర రాష్ట్రాలకంటే మిన్నగా ఏపీ క్రీడా పాలసీ
- క్రీడా శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



క్రీడా విధానంపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులు

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఇప్పటివరకూ 2 శాతంగా ఉన్న క్రీడా రిజర్వేషన్లను 3 శాతానికి పెంచేందుకు సిద్ధమైంది. ఒలింపిక్స్, ఆసియా గేమ్స్‌లో పతకాలు సాధించే వారికి భారీగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది. కొత్తగా తీసుకొచ్చే క్రీడా పాలసీలో ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. క్రీడా రిజర్వేషన్లను 3 శాతం పెంచాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఆమోదం తెలిపారు. తొలుత దీన్ని యూనిఫాం సర్వీసెస్‌లో అమలు చేయాలని సూచించారు. అమరావతి సచివాలయంలో క్రీడా శాఖపై సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష నిర్వహించారు. 'అందరికీ క్రీడలు' అనే విధానంతో తీసుకొచ్చిన నూతన క్రీడా పాలసీపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కొత్త పాలసీలోని ప్రతిపాదనలు అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రాన్ని, అమరావతిని స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు వీలుగా స్పోర్ట్స్ ఫర్ ఆల్, నర్చర్ టాలెంట్ (ప్రతిభను పెంపొందించడం), స్పోర్ట్స్ ఏకో సిస్టమ్, గ్లోబల్ విజిబిలిటీ.. అనే నాలుగు అంశాల ప్రాతిపదికన నూతన పాలసీని రూపొందించినట్లు చెప్పారు. దీనిలో అందరికీ ఆటలు, టాలెంట్ గుర్తింపు, ప్రపంచ స్థాయి శిక్షణ, సౌకర్యాలు, ప్రోత్సాహకాలు, ఉద్యోగ భద్రత, క్రీడా సంఘాలతో సమన్వయం, టెక్నాలజీ వినియోగం, ప్రైవేటు రంగంతో కలిసి పనిచేయడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఈవెంట్స్ నిర్వహణ, స్పోర్ట్స్ టూరిజం.. వంటి అంశాలకు ప్రాధాన్యమిచ్చామని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లోని క్రీడా పాలసీల కంటే మెరుగైన అంశాలను దీనిలో చేర్చామని, గ్రామస్థాయి నుంచే క్రీడల ప్రోత్సాహకానికి అవసరమైన ప్రణాళికను పొందుపరిచామని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే.. శాప్‌లో గ్రేడ్-3 కోచ్‌ల కోసం అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వారికి 50శాతంరిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు.

భారీ నజరానాలు

ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, వరల్డ్ చాంపియన్‌షిప్స్, జాతీయ క్రీడలు, ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పతకాలు పొందిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాలను కూడా భారీగా పెంచాలని నిర్ణయించారు. ఇప్పటివరకు భారీ ప్రోత్సాహకాల్లో హరియాణా ముందుండేది. అయితే సీఎం చంద్రబాబు సూచనలతో కొత్త పాలసీలో అన్ని రాష్ట్రాల కంటే ఏపీలోనే ఎక్కువ ప్రోత్సాహకాలిచ్చేలా ప్రతిపాదించారు.

పతకం తీసుకొస్తే గ్రూప్-1 ఉద్యోగం

ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వారిని గ్రూప్-1 ఉద్యోగులుగా నియమిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అదే విధంగా స్పోర్ట్స్ సిటీగా అమరావతిని అభివృద్ధి చేయడంతో పాటు తిరుపతి, వైజాగ్, అమరావతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, క్రీడాశాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇవీ ప్రతిపాదనలు..

- గతంలో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేతకు రూ.75 లక్షలు ఇచ్చేవారు. ఇప్పుడు దాన్ని రూ.7కోట్లకు పెంచారు.
- ఒలింపిక్స్ రజత పతక విజేతకు గతంలో రూ.50 లక్షలు ఇస్తుండగా, ఇకపై రూ.5 కోట్లు ఇవ్వాలని నిర్ణయం.
- ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన వారికి రూ.30 లక్షలు ఇస్తుండగా దాన్ని రూ.3 కోట్లు పెంచారు.
- ఒలింపిక్‌లో పాల్గొన్న వారికి రూ.50 లక్షల చొప్పున ప్రోత్సహకం ఇవ్వాలని నిర్ణయించారు.
- ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధిస్తే రూ.4 కోట్లు, రజతానికి రూ.2 కోట్లు, కాంస్యానికి రూ.కోటి .
- ఏషియన్ గేమ్స్‌లో పాల్గొన్నవారికి రూ.10 లక్షలు.
- వరల్డ్ చాంపియన్‌షిప్, వరల్డ్‌కప్‌ల్లో స్వర్ణానికి రూ.50 లక్షలు, రజతానికి రూ.35 లక్షలు, కాంస్యానికి రూ.25 లక్షలు ఇవ్వాలని నిర్ణయం.
- నేషనల్ గేమ్స్‌లో గోల్డ్ సాధించిన వారికి రూ.10 లక్షలు, రజతానికి రూ.5 లక్షలు, కాంస్యానికి రూ.3 లక్షలు ప్రోత్సాహం.
- వీటితో పాటు ఖేలో ఇండియా, నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ప్రోత్సాహకాలు పెంచాలని నిర్ణయం.

11 నుంచి అసెంబ్లీ

- వైసీపీ ఎమ్మెల్యేల హాజరుపై లేని స్పష్టత

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాసనసభ సమావేశాలు ఈ నెల 11వ తేదీ నుంచి జరుగనున్నాయి. ఆరోజు ఉదయం 10 గంటలకు శాసనమండలి, శాసనసభ భేటీ అవుతాయి. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరుతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు ముగియనున్న నేపథ్యంలో సమావేశాల మొదటి రోజే 11వ తేదీన 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహించాలో స్పీకర్ అయన్నపాత్రుడి అధ్యక్షతన జరిగే సభా వ్యవహారాల సలహా మండలి(బీఏసీ)లో నిర్ణయం తీసుకుంటారు. 11 రోజులపాటుజరిగే వీలుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమావేశాలకు 11 మంది ఎమ్మెల్యేలున్న వైసీపీ హాజరవుతుందా లేదా అనే అంశంపై స్పష్టత రాలేదు.

ఓటుకు నోటు కేసు విచారణ నుంచి తప్పుకొన్న జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ

- గతంలో తెలంగాణ హైకోర్టు సీజేగా ఉన్నందున విచారణ చేపట్టలేనని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ తప్పుకొన్నారు. ఓటుకు నోటు కేసు నుంచి తనను తప్పించాలని, తాను నిర్దోషినని పేర్కొంటూ జెరూసలేం మత్తయ్య తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా... గతంలోనే న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. అయితే, ఆ కేసు నుంచి మత్తయ్య పేరును క్వాష్ చేయడాన్ని (తొలగించడాన్ని) 2016 జూలై 6న తెలంగాణ అవినీతి నిరోధక శాఖ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎమ్. త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే.. తాను గతంలో తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పని చేసినందున... ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నానని సతీశ్ చంద్ర శర్మ తెలిపారు. కాగా, ఈ నెల 12న మరో ధర్మాసనం ముందుకు ఈ కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

పొత్తుకు ఇబ్బంది కలిగించే నేతలను వదులుకోడానికైనా సిద్ధమే

- కూటమి నేతల సమావేశంలో మంత్రి నిమ్మల

కర్నూలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు 30 ఏళ్లకు పైగా కొనసాగాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ముందుకు సాగుతున్నారని కర్నూలు జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం స్థానిక హోటల్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో మూడు పార్టీ నాయకుల మధ్య తలెత్తుతున్న సమస్యలు, సమన్వయం లోపం, నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. "రాష్ట్ర స్థాయిలో పొత్తు ధర్మం ఎలా సాగుతుందో అన్ని నియోజకవర్గాల్లోనూ అదే విధానం అవలంభించాలి. కూటమి అధినేత చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు జనసేన అధినేత పవన్ పొత్తు ప్రకటించారు. ఈ పొత్తు 30 ఏళ్లకు పైగా కొనసాగేలా మూడు పార్టీల అధినేతలు పక్కా ప్రణాళిక, సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు. ఎక్కడైనా పొత్తుకు ఇబ్బంది కలిగించే నాయకులు ఉంటే వారిని వదులుకోవడానికైనా సిద్ధం. గత ఎన్నికల్లో కూటమి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించింది. అదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో పని చేయాలి. వైసీపీ వెంటిలేటర్‌పై ఉంది. అబద్ధాలతో బతుకున్న జగన్... వైసీపీ సోషల్ మీడియా ద్వారా ప్రాంతాలు, కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్ర చేస్తున్నారు. కూటమి నేతలు అప్రమత్తంగా ఉండాలి. రాయలసీమ ప్రాజెక్టులకు ఆద్యుడు ఎన్టీఆర్. పుష్కలంగా నిధులు ఇచ్చి, నిర్మాణాలు చేసింది చంద్రబాబు. వీటిని జనంలోకి తీసుకెళ్లడంలో మనం విఫలమయ్యాం. హంద్రీనీవా విస్తరణ కోసం 2021లో టెండర్లు పిలిస్తే వైసీపీ ప్రభుత్వం మూడు రూపాయలు కూడా ఖర్చు చేయలేదు. కూటమి ప్రభుత్వం రాగానే రూ.2,500 కోట్లు మంజూరు చేసింది. త్వరలో పనులు మొదలు పెడతాం. సీమ ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తాం' అని చెప్పారు.

తప్పు చేస్తే వదలొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

ఐదేళ్లు పోలీసు శాఖను ఆవరించిన అలసత్వం ఫలితంగానే ఇప్పుడు నేరాలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. 'ఒకటి రెండు రేప్‌లు జరిగితే ఏమవుతుంది' అని అప్పట్లో వ్యాఖ్యానించారని... దాని ఫలితంగానే నేరగాళ్లు రెచ్చిపోతున్నారని పేర్కొన్నారు. తాను హోం శాఖను తీసుకుని ఉంటే పరిస్థితి వేరేగా ఉండేదని హెచ్చరించారు. "మమ్మల్ని విమర్శించే వారికి చెబుతున్నా! నేను హోంశాఖ బాధ్యతలు తీసుకోవాల్సి వస్తుంది..." అని హెచ్చరించారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో సోమవారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ సమావేశంలో పవన్ పాల్గొన్నారు. "వైసీపీ నాయకులారా... మీరు గీత దాటితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నా. అధికారులు చెప్పిందల్లా వినడం అయిపోయింది. ఇక చేతల్లోనే చూపించే సమయం వచ్చింది. ఎవరు ఏ ప్రయత్నం చేసినా కూటమి ఐక్యంగా ఉంది" అని స్పష్టం చేశారు. ముఖ్యాంశాలు పవన్ మాటల్లోనే...



కాకినాడ జిల్లాలోని పి.వెంకటాపురం గురుకుల పాఠశాలలోని సైన్సు ప్రయోగశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్

వైసీపీ వారసత్వంగా...

మూడేళ్లు, అయిదేళ్లు వయసున్న చిన్నారులు, పసికందులపై రేప్ చేసేవారు అత్యంత నీచులు. ఇప్పుడు మనం చూస్తున్న ఈ సంఘటనలన్నీ గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చినవే. అప్పట్లో చంద్రబాబు సతీమణిని అసెంబ్లీలో దూషించారు. మా అధినేత ఆదేశిస్తే పవన్‌ను చంపేస్తామన్నారు. ఇంట్లో ఆడబిడ్డలను మానభంగం చేస్తామని హెచ్చరించారు. ఫేక్ ఫొటోలు సృష్టించారు. వాటిని నాకే పంపించారు. 30వేల మంది మహిళలు అదృశ్యమైతే గత సీఎం ఒక్క మాట మాట్లాడలేదు. అప్పటి విపక్ష నేతను చంపేస్తామని బెదిరించిన వారిని గత ప్రభుత్వం వదిలేసింది. సోషల్ మీడియాలో ఎన్ని పోస్టులు పెట్టినా అప్పటి డీజీపీ సహా పోలీసు అధికారులు ఎవరూ స్పందించలేదు. గత ప్రభుత్వంలో నన్ను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీస్ అధికారులు... ఇప్పుడు క్రూరంగా మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారు? హోం మినిస్టర్ అనిత కూడా బాధ్యత వహించాలి. నేను అటవీ, పర్యావరణ శాఖ మంత్రిని. హోంశాఖ తీసుకుంటే పరిస్థితులు వేరేలా ఉంటాయి.

క్రిమినల్స్‌ను వెనకేసుకు వస్తారా..

లా అండ్ ఆర్డర్ విషయంలో బలంగా వెళ్లాలని, ధర్మబద్ధంగా పని చేయాలని చెబుతుంటే... పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మూడేళ్ల ఆడబిడ్డను రేప్ చేసిన నిందితుడిని ఎందుకు అరెస్టు చేయరంటే.. కులం అడ్డొస్తుందని అంటున్నారు. ఐపీసీ ఏం చెబుతోంది? క్రిమినల్స్‌ను వెనకేసుకు రావాలని చెబుతోందా? ఇప్పుడున్నదీ గత ప్రభుత్వంలో పనిచేసిన పోలీసులే కదా! ఇప్పుడు ఇంత స్వేచ్ఛ ఇస్తున్నా నేరగాళ్లను ఎందుకు పట్టుకోలేకపోతున్నారు? వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు!

తెగేదాకా లాగొద్దు...

నా సహనం పరీక్షించవద్దు! సహనం ఎంతుందో అంతకు పదింతలు తెగింపు ఉంది. వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెడుతున్నారు. తెగేదాక లాగకండి, అధికారంలో ఉన్నాం కదా అని సహనం పాటిస్తున్నాం. డీజీపీ, ఇంటెలిజెన్స్ అధికారులు, ఎస్పీ లు, కలెక్టర్లకు ఒకటే చెబుతున్నా! రాష్ట్ర అభివృద్ధికి లాఅండ్ ఆర్డర్ కీలకం. తప్పులు చేసిన వారిని వదిలిపెట్టకండి. విమర్శించే నాయకులను హెచ్చరిస్తున్నా! నేనే హోంశాఖ బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇది ప్రతీకార ప్రభుత్వం కాదని చెప్పాం తప్ప చేతగాని ప్రభుత్వం అని చెప్పలేదు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం ఉండదు. పదవి ఉండొచ్చు ఉండకపోవచ్చు. ఆడబిడ్డల మాన ప్రాణాల రక్షణకు కట్టుబడి ఉంటుంది.

యోగిలాగా చేస్తేనే...

ఇటువంటి అత్యాచార ఘటనలు దుబాయి, సింగపూర్ వంటి దేశాల్లో జరిగితే ఇంట్లో ఉన్నా సరే లాక్కొచ్చి అరెస్టు చేసి లోపల వేస్తారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్‌లాగా వ్యవహరిస్తేనే వీటికి అడ్డుకట్ట పడుతుంది. డీజీపీగారు, ఇంటెలిజెన్స్ అధికారులూ.. క్రిమినల్స్‌ను అరెస్టు చేయడానికి మీరు ఎందుకు ముందుకు రావడంలేదు? గత ప్రభుత్వంలో మాదిరిగా అలసత్వంగా ఉండకండి. ఎవరైనా చెడు చేస్తే... అతనికే ఆపాదించండి. కులానికి, మతానికి కాదు.

ఇసుక తినడం అలవాటైపోయింది..

అందరికీ ఇసుకలో తినడం అలవాటైపోయింది. దాన్ని మార్చడానికి సీఎం, నేను ప్రయత్నిస్తున్నాం. ఇసుకపై సీఎం ఒక్కటే చెప్పారు. ప్రజలకు ఉచిత ఇసుక అందాలని, ఇందులో ఇబ్బంది కలిగించే ఎవరైనా, ఎమ్మెల్యేలు అయినా, కూటమి నాయకులైనా వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. తీరప్రాంతంలో అరబిందో, దివీస్ సహా ఇతర ఫార్మా పరిశ్రమలు నుంచి వ్యర్థాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదలడం వల్ల మత్స్యకారులకు తీవ్రనష్టం జరుగుతోంది. అరబిందో యాజమాన్యాన్ని రప్పించి మత్స్యకార సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కలెక్టర్‌కు సూచిస్తున్నాం.

అభివృద్ధి, సంక్షేమాలకు సమప్రాధాన్యం

- ఆ దిశగానే బడ్జెట్‌కు రూపకల్పన
- ఆర్థిక మంత్రి పయ్యావుల దిశానిర్దేశం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమాలకు సమాన ప్రాధాన్యం ఇచ్చేలా బడ్జెట్‌ను తయారుచేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తిచేయడానికి, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఈ నెల 11వ తేదీనే అసెంబ్లీలో ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో సోమవారం సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో ఆర్థిక శాఖ 2024-25 ప్రీ-బడ్జెట్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయా శాఖల ప్రతినిధులు తమ బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు సమర్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత ఆదాయాన్ని రూ.2 లక్షల కోట్లకు పెంచాలని ప్రభుత్వం తలపోస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత ఆదాయం రూ.1,73,963 కోట్లు రాగా.. రూ.61,789 కోట్ల అప్పులు తెచ్చారు. అప్పులు, ఆదాయం కలిపి ఖజానాకు వచ్చింది రూ.2,35,753 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల్లో రాష్ట్రానికి రూ.68,463 కోట్ల ఆదాయం వచ్చింది. సెప్టెంబరు ఆఖరునాటికి రాష్ట్రప్రభుత్వం రూ.57,159 కోట్ల అప్పులు తెచ్చింది. అప్పులు, ఆదాయం కలిపి 6 నెలల్లో రూ.1,25,623 కోట్లు వచ్చాయి. ఈ 6 నెలల ఖర్చు 1,27,637 కోట్లు. ఈ నేపథ్యంలో రాష్ట్ర సొంత ఆదాయం రూ.2 లక్షల కోట్లు దాటే అవకాశం లేదు. కానీ అప్పులతో కలిపివేత రూ.2 లక్షల కోట్లు సులభంగా దాటుతుందని అర్థమవుతోంది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మొదటి 6 నెలల్లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ఆదాయం, ఎక్సైజ్ ఆదాయం, సేల్స్‌ట్యాక్స్ స్వల్పంగా తగ్గాయి. ఇంకోవైపు.. తమకు ఈ బడ్జెట్‌లో రూ.14,000 కోట్లు కేటాయించాలని జలవనరుల శాఖ ప్రతిపాదించింది. రూ.12,000 కోట్ల వరకు ఇవ్వగలమని ఆర్థిక శాఖ చెప్పినట్లు అధికారులు వెల్లడించారు. దీనిపై ఇంకా చర్చలు జరగాల్సి ఉందని తెలిపారు. అలాగే విద్యుత్ శాఖ రూ.20,000 కోట్లు కావాలని ప్రతిపాదించింది. ఇందులో ప్రభుత్వ సబ్సిడీల వాటా రూ.15,000 కోట్లు.

జగన్ జమానాలో బడి బయట పిల్లలు

- టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జగన్ జమానాలో 2.3 లక్షల మంది విద్యార్థులు ఎందుకు పాఠశాలలను వదిలేయాల్సి వచ్చిందో చెప్పగలరా? అంటూ టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ప్రశ్నించారు. 'లక్షలాది మంది స్కూళ్ల నుంచి వెళ్లిపోవడం, డ్రాపవుట్స్‌గా విఎగిలిపోవడానికి వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే కారణం. 2019-20 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో మొత్తం 63,463 పాఠశాలలు ఉన్నాయి. జగన్ జమానాలో 2023-24 సంవత్సరానికి రాష్ట్రంలో 58,754 స్కూల్స్ మాత్రమే మిగిలాయి. టీడీపీ హయాంలో 2019-20లో 2234 ఎయిడెడ్ పాఠశాలలు ప్రభుత్వంలో ఉంటే.. జగన్ జమానాలో ఆ సంఖ్య 787కు పడిపోయింది. స్కూళ్లను విలీనం చేయడంతో పాటు మూసేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముందుగా జీఓ నం.117ను రద్దు చేసి పాఠశాలల విలీనాలు ఉండవని ఆదేశాలిచ్చింది' అని విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

దళిత విద్యార్థినిపై లైంగిక దాడి

- పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా ఘటన

ఎర్రావారిపాలెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి ఇంటికి వెళుతున్న 9వ తరగతి చదువుతున్న ఓ దళిత విద్యార్థిని(14)పై ఇద్దరు దుండగులు లైంగిక దాడి చేశారు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలంలో సోమవారం సాయంత్రం ఈ దారుణం చోటుచేసుకుంది. పాఠశాల నుంచి సుమారు 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇంటికి నడిచి వెళుతుండగా మార్గమధ్యంలో ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు బాలికను అటకాయించి లైంగికదాడి చేశారు. అరిస్తే చంపేస్తామని బెదిరించడంతో బాలిక స్పృహతప్పి పడిపోయింది. కుమార్తె ఇంటికి రాకపోవడంతో వెతుక్కుంటూ వెళ్లిన ఆమె తల్లి.. జరిగిన దారుణాన్ని తెలుసుకొని బోరుమంది. బాలికను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సీఐ ఇమ్రాన్ బాషా, ఎస్ఐ ఎర్రిస్వామి సోమవారం రాత్రి ఆస్పత్రికి చేరుకుని బాలికను పరామర్శించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేస్తామని తెలిపారు.

నేను ఫెయిలయ్యానని పవన్ అనలేదు

- డిప్యూటీ సీఎం మాటలను వక్రీకరిస్తున్నారు
- సోషల్ మీడియాకు నేనూ బాధితురాలినే
- మహిళలు రాజకీయాల్లోకి రావాలంటే ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టాలా: అనిత

అమరావతి, అనంతపురం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏం మాట్లాడారు? ఏం సందర్భంలో మాట్లాడారో కూడా తెలుసుకోకుండా సంబరపడుతున్నారంటూ హోం మంత్రి అనిత ఎద్దేవా చేశారు. అనిత విఫలమయిందని పవన్ కల్యాణ్ అన్నట్లు చూపించాలని ఆమె ఓపెన్ చాలెంజ్ చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలో పోలీస్ అధికారులతో సమీక్ష అనంతరం సోమవారం రాత్రి మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. 'పవన్ కల్యాణ్ బాధతో అన్న మాటలను వక్రీకరిస్తున్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిని, కట్టు తప్పి ప్రవర్తిస్తున్న వారినీ అదుపులోకి తీసుకోవడంపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. అయినా అక్కడక్కడా పోలీసులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారు. అది చూసి కడుపు మండి ఎవరైనా మాట్లాడతారు. రాజకీయం ముసుగులో నేరస్థులు చేసిన పనులకు పర్యవసానం నేడు చూస్తున్నాం. నేను చేస్తున్న పనికి ఆయన మద్దతిచ్చినట్లయింది. మరింత తీవ్రమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. మరింతగా సమీక్షించాల్సిన అవసరం ఉందని చెప్పారు. డిప్యూటీ సీఎంగా ఆయన చెప్పిన దానిని పరిగణలోకి తీసుకుంటాను. సోషల్ మీడియాకు నేనూ బాధితురాలినే. పవన్ కల్యాణ్ బయటపడ్డారు. నేను బయటపడలేదు అంతే. రాబందుల్లా మీద పడుతున్నారు. ఆ పెట్టే పోస్టులు నా పోలీస్ ఆఫీసర్లకే పంపించాలి. సిగ్గుతో పంపించలేక దిగమింగుకుంటున్నా' అంటూ గద్గద స్వరంతో అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛా పేరుతో భయంకరమైన దాడి చేస్తున్నారంటూ... 'ఎవడో మా ఇళ్లల్లోని ఆడపిల్లల మీదకు వస్తామని పోస్టులు పెడుతుంటే చేతలు కట్టుకొని కూర్చోవాలా? సోషల్ మీడియాలో మూకుమ్మడిగా దాడి చేస్తున్నారు. ఆడవాళ్లు రాజకీయాల్లో రావాలంటే దిగజారాలా? మా ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టాలా' అని మంత్రి అనిత అన్నారు. ఏదైనా సంఘటన జరిగినపుడు కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకోవడమే కాదు... ఉన్నతాధికారుల పనితీరుపైనా సమీక్షిస్తామని హోం మంత్రి స్పష్టం చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో గ్యాంగ్ రేప్ బాధాకరమని, గతంలోనే ఇలాంటి వారిపై చర్యలు తీసుకొని ఉంటే ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేవని అనిత అన్నారు.



పవన్ వ్యాఖ్యల్లో వివాదం ఏమీ లేదు..

హోంశాఖను తాను తీసుకుంటానని పవన్ ఎక్కడా చెప్పలేదని, ఆయన వ్యాఖ్యల్లో వివాదానికి తావేమీ లేదని మంత్రి నారాయణ చెప్పారు. కొన్ని ఘటనల్లో న్యాయ, చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు పోలీసులకు ఇబ్బందులు ఉండొచ్చని, దాని వల్ల కేసులు విచారణ ఆలస్యం కావచ్చన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఎవరి మధ్యా పొరపొచ్చాలు లేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అందరినీ ఒకే తాటిపై నడిపిస్తున్నారని అన్నారు.

సత్యనారాయణ అక్రమాలపై.. నివేదిక ఇస్తారా.. నీరుగారుస్తారా?

- జీఏడీకి ఇంకా రిపోర్టు ఇవ్వని ఆర్థిక శాఖ
- మాజీ కార్యదర్శికి ఇప్పటికీ పెద్దలు, అధికారుల అండ!
- సీఎఫ్ఎంఎస్‌లో పనిచేస్తున్న ఆయన సోదరుడు

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణపై చర్యలకు కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన అక్రమాలపై ఆర్థిక శాఖ ఇప్పటికీ రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగాని(జీఏడీ)కి నివేదిక ఇవ్వలేదు. సత్యనారాయణ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని.. వైసీపీ నేతల బిల్లులు మాత్రమే చెల్లించారని, వైసీపీ కార్యకర్తలా వ్యవహరించారంటూ బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ కేంద్ర సిబ్బంది-శిక్షణ శాఖ(డీవోపీటీ)కి ఫిర్యాదు చేయడం.. ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని డీవోపీటీ.. జీఏడీని ఆదేశించడం.. దీనిపై నివేదిక ఇవ్వాలని జీఏడీ ఆర్థిక శాఖను ఆదేశించడం.. దీని నుంచి బయటపడేందుకు తనను రిలీవ్ చేస్తే మాతృశాఖకు వెళ్లిపోతానని ఐఆర్ఏఎస్‌కు చెందిన సత్యనారాయణ సీఎస్‌ను కోరడం తెలిసిందే. తమ బిల్లులు చెల్లించడం లేదంటూ హైకోర్టులో 4 లక్షల కేసులు దాఖలవడంతో తక్షణమే బాధితులకు బిల్లులు చెల్లించాలని కోర్టు తీర్పిచ్చిందని సీఎం రమేశ్ డీవోపీటీ దృష్టికి తీసుకొచ్చారు. బేవరేజెస్ కార్పొరేషన్, స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఖజానాకు రావలసిన పన్నులను దారి మళ్లించారని టీడీపీ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో కూడా పేర్కొంది. 30కి పైగా కార్పొరేషన్ల నుంచి రూ.4,738 కోట్ల నిధులను వైసీపీ రాజకీయ ప్రతిష్ఠ పెంచేందుకు మళ్లించారని తెలిపింది. స్థానిక సంస్థల నిధులు, ఉద్యోగుల పొదుపు మొత్తాలను కూడా విచ్చలవిడిగా జగన్, వైసీపీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం వాడుకున్నారని వెల్లడించింది. నిధుల దారిమళ్లింపులు, ఉల్లంఘనలన్నీ ఆర్థిక శాఖ పర్యవేక్షణలోనే జరిగాయి. ఆ సమయంలో సత్యనారాయణే అక్కడ కీలకంగా ఉన్నారు. అయితే కొత్త ప్రభుత్వం వచ్చినా.. ఆయనకు అధికార కూటమి నేతలు, తోటి అధికారుల అండదండలు పూర్తిస్థాయిలో ఉన్నాయని వినవస్తోంది. అలాగే ఆయన సోదరుడు సీఎఫ్ఎంఎస్‌లో పనిచేస్తున్నారు. ఆయన్ను తీసేయాలని ఉన్నతాధికారులు ప్రతిపాదించినప్పటికీ.. అధికార పార్టీ నాయకుల అండతో ఇంకా ఆయన అక్కడే కొనసాగుతుండడం విశేషం. ఆయన మాతృ శాఖకు వెళ్లిపోతే గత ఐదేళ్ల ఆర్థిక అవకతవకలకు ఎవరిని జవాబుదారీ చేస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది.

నాపై పెట్టిన కేసులు కొట్టివేయండి

- హైకోర్టును ఆశ్రయించిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో వెంకటాచలం, ముత్తుకూరు పోలీసులు తనపై నమోదు చేసిన రెండు వేర్వేరు కేసులను కొట్టివేయాలని మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ వద్ద విచారణకు రానున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై అసత్యాలు ప్రచారంతో విద్వేషాలు రెచ్చగొడుతున్నారంటూ టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ముత్తుకూరు పోలీసులు కాకాణి పై కేసు నమోదు చేశారు. అలాగే పత్రికా సమావేశాలు నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబు గౌరవానికి భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్నారని వెంకటాచలం మండలం టీడీపీ నాయకులు కాకాణిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాజీ ఎంపీ ఎంవీవీ బెయిల్ పిటిషన్లు వెనక్కి

విశాఖలోని హయగ్రీవ భూముల వ్యవహారంలో ఈ ఏడాది అక్టోబరు 19న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వేసిన పిటిషన్‌ను వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఉపసంహకరించుకున్నారు. వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతించాలని సోమవారం పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యర్థించగా న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సానుకూలంగా స్పందించారు.

ఉత్తరాంధ్ర సిగలో

మరో ఉక్కు!



(మొదటి పేజీ తరువాయి)

సమన్వయం చేసుకుని అవసరమైన భూసేకరణ కూడా పూర్తి చేశారు. నక్కపల్లి మండలంలోని బుచ్చిరాజుపేటలో 102.18 ఎకరాలు, చందనాడలో 840.20 ఎకరాలు, డీఎల్ పురంలో 674.39 ఎకరాలు, రాజయ్యపేటలో 36.62 ఎకరాలు, వేంపాడులో 510.92 ఎకరాలు కలిపి మొత్తం 2,164.31 ఎకరాల భూములను సిద్ధం చేశారు. ఒకే బ్లాక్ కింద ఉన్న ఆ భూములు ప్రస్తుతం ఏపీఐఐసీ స్వాధీనంలోనే ఉన్నాయి. ముల్లాపురా (శివారు గ్రామం)ను రీ లొకేషన్ చేయడానికి ఆర్అండ్ఆర్ సెటిల్‌మెంట్ ప్లాన్ పురోగతిలో ఉంది. ఈ ప్రతిపాదిత భారీ ప్రాజెక్టుకు సంబంధించిన స్టేటస్ రిపోర్టు ఇప్పటికే సీఎం చంద్రబాబుకు చేరింది. ముఖ్యమంత్రి నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే రాష్ట్ర కేబినెట్ ఆమోదం కోసం పంపడానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి.

ప్రాజెక్టు నేపథ్యమిదీ..

ఆర్సెలర్ మిట్టల్, నిప్పన్ స్టీల్ కార్పొరేషన్.. ప్రపంచంలోనే దిగ్గజ ఉక్కు తయారీ సంస్థలుగా గుర్తింపు తెచ్చుకున్నాయి. యూరప్‌లోని లక్సెంబర్గ్‌కు చెందిన ఆర్సెలర్ మిట్టల్, జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ సంస్థలు కలసి జాయింట్ వెంచర్‌ను ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయి. ఈ రెండు సంస్థలు కలిసి 'ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్' (ఏఎంఎన్ఎస్ఐ)గా సరికొత్త బ్రాండ్‌తో భారత్‌లో 20 శాతం ఉక్కు తయారీ సామర్థ్యాన్ని సొంతం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. 2035 నాటికి 40 ఎంఎంపీటీఏ (మిలియన్ మెట్రిక్ టన్నులు) ఉక్కును ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. తూర్పు తీరంలో కో-టెర్మినస్ పోర్ట్ ఆధారిత క్లస్టర్‌తో అతి భారీ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాన్ని అన్వేషిస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్‌పై దృష్టి పడింది. రాష్ట్రంలో ఉన్న విశాల తీరప్రాంతం భారీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైనదిగా గుర్తించాయి. దీనికితోడు రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానాలను అమలులోకి తీసుకువచ్చి పెట్టుబడిదారులకు రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతుండటం... రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టి ఎక్కువ ఉద్యోగాలు కల్పించే సంస్థలకు అవసరమైన భూములు, ఇతర మౌలిక సదుపాయాలు, భారీ ప్రోత్సాహకాలు ప్రకటించడం వాటిని ఆకర్షించాయి. దీంతో రాష్ట్రంలో జాయింట్ వెంచర్‌ను ప్రారంభించి భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్నాయి. పోర్ట్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు విశాఖపట్నం సమీపంలోని అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నాయి. అక్కడ అవసరమైన భూములు ఏపీఐఐసీ అధీనంలో ఉండటం... అవి 16వ నంబరు జాతీయ రహదారికి అనుసంధానంగా ఉండటం... భౌగోళికంగా సువిశాలమైన సముద్ర తీరం, పీఎల్ఎంసీ నుంచి నీటి వనరులు అందుబాటులో ఉండటం... చెన్నై గ్రాండ్ ట్రంక్‌కు రైలు లింక్ అనుసంధానం అయి ఉండటంతో నక్కపల్లి ప్రాంతాన్ని అనువైన ప్రదేశంగా గుర్తించారు. సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో తమ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించాయి.

2029 జనవరికి మొదటి దశ

ప్రాజెక్టు మొదటి దశను రూ.70 వేల కోట్ల పెట్టుబడితో 7.3 ఎంఎంపీటీఏ సామర్థ్యంతో 2029 జనవరి నాటికి పూర్తి చేయనున్నట్లు ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ తన ప్రతిపాదనల్లో పేర్కొంది. మొదటి దశ పూర్తయితే 20 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపింది. దీనికి 2,200 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వాన్ని కోరింది. మరో రూ.80 వేల కోట్ల పెట్టుబడితో 7.3 నుంచి 24 ఎంఎంపీటీఏ సామర్థ్యంతో 2033 నాటికి రెండో దశ పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయి ఉత్పత్తిలోకి తీసుకువస్తామని ప్రతిపాదనల్లో వివరించింది. రెండో దశ ప్రాజెక్టు పూర్తయితే మరో 35 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొంది. రెండో దశ పనులకు 3,800 ఎకరాల భూములు అవసరమవుతాయని ప్రభుత్వాన్ని కోరింది.

అనుబంధంగా పోర్ట్

ప్రాజెక్టుకు అనుబంధంగా కో-టెర్మినస్ క్యాప్టివ్ పోర్ట్ నిర్మాణం కోసం సముద్ర తీరాన 128 హెక్టార్ల భూమి కావాలని ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ కోరింది. తొలిదశలో 1.5 కిలోమీటర్ల మేర 5 బెర్తులు, రెండో దశలో 3.8 కిలోమీటర్ల పొడవున 12 బెర్తులు నిర్మించనున్నట్లు ప్రతిపాదనల్లో పేర్కొంది. ఈ పోర్టులో మొదటి దశలో 5,816 కోట్లు, రెండో దశలో మరో 5,383 కోట్లు కలిపి మొత్తం రూ.11,199 కోట్ల పెట్టుబడితో 8 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపింది. ఈ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే రాష్ట్ర చరిత్రలోనే భారీ ప్రాజెక్టుగా నిలిచిపోనుంది. ఈ ఉక్కు పరిశ్రమకు అనుబంధంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుతో మరికొన్ని వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. విశాఖపట్నం మాదిరిగానే నక్కపల్లి మండలం కూడా మరో ఉక్కు నగరంగా అభివృద్ధి చెందే అవకాశముందని పారిశ్రామికవర్గాలు చెబుతున్నాయి. 1982లో నెలకొల్పిన విశాఖ ఉక్కు వేల కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోంది.

ఒక్కో ప్రాంతానికి.. ఒక్కో మెనూ!

- ఇకపై రాష్ట్రంలో నాలుగు రకాల మెనూలు
- మధ్యాహ్న భోజన పథకంపై మంగళగిరిలో వర్క్‌షాప్



మధ్యాహ్న భోజన పథకం వర్క్‌షాప్‌లో విద్యార్థులకు అందించే ఆహారాన్ని పరిశీలిస్తున్న పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐఏఎస్‌లు కృతికా శుక్లా, నాగలక్ష్మి, శ్రీనివాసరావు తదితరులు

అమరావతి/గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మారిపోనుంది. ప్రస్తుతం రాష్ట్రం మొత్తం ఒక్కటే మెనూ అమల్లో ఉండగా.. వేర్వేరు ప్రాంతాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఇకపై నాలుగు రకాల మెనూలు అమలు చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. తొలుత జిల్లాకో మెనూ అమలు చేయాలని భావించినప్పటికీ, కొన్ని జిల్లాల్లో ఒకే విధమైన ఆహారపు అలవాట్లు ఉన్నందున జోన్‌కు ఒక విధమైన ఆహారం పెట్టనున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంపై సోమవారం మంగళగిరిలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ జరిగింది. ప్రభుత్వ సూచనల మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు ఆయా ప్రాంతాల్లో విద్యార్థులు ఇష్టపడే, పౌష్టికాహారం ఉండే భోజన మెనూలను తయారు చేశారు. వాటిని వర్క్‌షాప్ స్టాల్స్‌లో ప్రదర్శించారు. మధ్యాహ్న భోజనంపై తుది నిర్ణయానికి జాతీయ స్థాయి నిపుణులతో పాఠశాల విద్యాశాఖ ఒక కమిటీ ఏర్పాటు చేసింది. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆ కమిటీతో కలిసి స్టాల్స్‌ను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో ఉడికించిన గుడ్లు తినేందుకు విద్యార్థులు ఇష్టపడట్లేదని వర్క్‌షాప్‌లో అధికారుల దృష్టికొచ్చింది. దీంతో గుడ్లనే ప్రత్యామ్నాయ పద్ధతిలో పెట్టాలని నిర్ణయించారు. అలాగే హాట్ పొంగల్‌ను పూర్తిగా తొలగించనున్నారు. ఈ మెనూలను మరోసారి ప్రభుత్వం ముందుంచి ఖరారు చేయనున్నారు. డిసెంబరు 1 నుంచి కొత్త మెనూలు అమల్లోకి వచ్చే అవకాశముంది.

ఏటా రూ.2 వేల కోట్ల ఖర్చు

వర్క్‌షాప్‌లో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకానికి ఏటా రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తుంటే, కేంద్రం తన వాటా కింద రూ.400 కోట్లు ఇస్తోందన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రలో వేర్వేరు ఆహారపు అలవాట్లు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో కూరగాయల లభ్యత కూడా వేరుగా ఉందని, అందుకు అనుగుణంగా మెనూలు తయారు చేస్తున్నామన్నారు. సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం విద్యార్థుల డ్రాపౌట్ రేటును తగ్గించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

గేమ్ చేంజర్‌గా ప్రకృతి సేద్యం

- సాంకేతికతతో సాగు ఖర్చు తగ్గించాలి
- డ్రోన్ల టెక్నాలజీ వినియోగించుకోవాలి
- వ్యవసాయ శాఖకు సీఎం చంద్రబాబు నిర్దేశం

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతును నిలబెట్టేలా.. పంటల సాగును మరింత ప్రోత్సహిస్తూ, వ్యవసాయ శాఖ నూతన సాంకేతిక విధానాలను అమలు చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. నేటి సాంకేతికతను వినియోగించి.. సాగు ఖర్చు గణనీయంగా తగ్గించవచ్చన్నారు. నాడు ఐటీ ఎలాగైతే గేమ్ చేంజర్ అయిందో.. రానున్న రోజుల్లో ప్రకృతి సేద్యం కూడా గేమ్ చేంజర్ అవుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంలో ఏపీ పయనీర్‌గా నిలవాలన్నారు. సోమవారం అమరావతి సచివాలయంలో వ్యవసాయ శాఖపై ఆయన సమీక్ష జరిపారు. 'ప్రకృతి సేద్యం-అగ్రి డీప్ టెక్ విధానంతో దేశానికి రాష్ట్ర వ్యవసాయ రంగం దిక్సూచి అయ్యేలా చేయాలి. అందుకు ప్రణాళికలు తయారు చేసి, అమలు చేయాలి. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా భూసార పరీక్షలు చేసి, రైతులకు అవసరమైన పోషకాలు అందించే పరిస్థితి రావాలి. వ్యవసాయంలో డ్రోన్ల వాడకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలి' అని సూచించారు. రాష్ట్రంలో 40 వేల డ్రోన్లు అవసరమవుతాయని, వాటి ద్వారా పిచికారీతో 30%పైగా పురుగు మందులు, 95% సమయం, నీరు, విద్యుత్ ఆదా చేయవచ్చని, తద్వారా రైతుకు సాగు ఖర్చు తగ్గుతుందని అధికారులు చెప్పారు. రసాయనాలు వాడే పంటలు 100% దెబ్బతింటే.. ప్రకృతి సేద్యంలో పంటలు 10% మాత్రమే దెబ్బతిన్నట్లు వివరించారు.

రబీలో పాత పంటల బీమానే..: మంత్రివర్గ ఉపసంఘం సూచనల మేరకు ఈ రబీ నుంచి పాత పద్ధతిలోనే పంటల బీమా అందుబాటులోకి తెస్తున్నట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గత జూలైలో పంట నష్టానికి రూ.37 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా, నిధుల విడుదలకు సీఎం అంగీకారం తెలిపారు.

మరో జగన్ దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనలు చేశాయి. వీటిపై శుక్రవారం ఈఆర్‌సీ స్పందించింది. ఈ ప్రతిపాదనలపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 19 లోగా లిఖిత పూర్వకంగాను, మెయిల్ ద్వారాను స్పందించాలని ఈఆర్‌సీతో పాటు డిస్కమ్‌లు కోరాయి. అయితే, ఈఆర్‌సీ తీరుపై వినియోగదారుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే దాదాపు రూ.6,072 కోట్లు,రూ.11,826.47 కోట్లు..మొత్తం రూ.17898.47 కోట్ల ట్రూఅప్ భారంపై నిర్ణయాన్ని తీసుకునేందుకు ఈఆర్‌సీ సిద్ధం కావడంపై ప్రజా సంఘాలు నిరసనలకు సిద్ధమవుతున్నాయి.

కేంద్ర నిబంధనలకు విరుద్ధంగా...

విద్యుత్తు పంపిణీ సంస్థలకు విద్యుత్తు ఉత్పత్తి వ్యయాలు .. కొనుగోలు చార్జీలు భారంగా మారకూడదని .. ట్రూఅప్, ట్రూడౌన్ చార్జీల విధానాన్ని కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ) తీసుకువచ్చింది. డిస్కమ్‌లు ప్రతిపాదించే ట్రూఅప్ లేదా ట్రూడౌన్ చార్జీల ప్రతిపాదనలను పెండింగ్‌లో పెట్టొద్దని రాష్ట్రాల విద్యుత్తు నియంత్రణ మండలి (ఎస్ఈఆర్‌సీ)లకు స్పష్టంగానే పేర్కొంది. దానివల్ల వినియోగదారులపై మోయలేని భారం పడుతుందని హెచ్చరించింది. ఇలాంటి ప్రతిపాదనలపై 90 రోజుల్లోగా ఆదేశాలివ్వాలని మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే.. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం .. విద్యుత్ రంగాన్ని దెబ్బతీసే నిర్ణయాలెన్నో తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలోని విద్యుత్తు కొనుగోళ్లపైనా సమీక్షించింది. 2014-15లోనూ .. 2015-16లోనూ విద్యుత్తు కొనుగోలు భారం పెద్దగా లేకపోవడంతో .. ట్రూఅప్ ప్రతిపాదనలను ఏపీఈఆర్‌సీకి డిస్కమ్‌లు పంపలేదు. 2016-17లో రూ.3,058 కోట్లకు ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలు పంపితే ఈఆర్‌సీ కేవలం రూ225 కోట్లకు ఆమోదించింది. 2017-18కు రూ434 కోట్లకు ప్రతిపాదనలు పంపితే, రూ.599 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదించింది. 2018-19కి రూ.1,538 కోట్లకు ట్రూఅప్ ప్రతిపాదనలు పంపితే.. రూ.9,40 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదించింది. 2019-20లో రూ.461.92 కోట్లకు ప్రతిపాదనలు పంపితే ..204.82 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదించింది. 2019 మే నెలలో జగన్ నేతృత్వంలో వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చింది. అప్పటికి గడచిన ఐదేళ్లలో చేపట్టిన విద్యుత్ సంస్కరణ ప్రభావం కారణంగా .. ట్రూఅప్ భారం అంతంత మాత్రంగానే ఉంది. జగన్ వచ్చిన తొలి ఏడాదిలో 2020-21కుగాను రూ.1,685 కోట్ల ట్రూడౌన్‌ను డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. అప్పటినుంచి వరుసగా 2021-22లో రూ.980 కోట్లు, 2022-23లో 8,114 కోట్లు, 2023-24లో 11,826 కోట్లు ప్రతిపాదించాయి. జగన్ అధికారంలోకి వచ్చాక విచ్చలవిడితనం పెరిగిపోయిందనేందుకు ఇదే నిదర్శనమని విద్యుత్తురంగ నిపుణులు చెబుతున్నారు. 2021-22 దాకా డిస్కమ్‌లు చేసిన ప్రతిపాదనలపై సకాలంలో నిర్ణ యాలను తీసుకున్న రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి...2022-23 నుంచి ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట విధించే ట్రూఅప్‌లపై నిర్ణయం తీసుకోకుండా పక్కన పడేసింది. 2022-23 ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలను సీఎంగా జగన్ ఆదేశాల మేరకు 2022 సెప్టెంబరులోనే డిస్కమ్‌లు సమర్పించినా .. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యేంతవరకూ నిర్ణయం తీసుకోలేదు. అదేవిధంగా 2023-24 సంవత్సరానికి రూ.11,826.42 కోట్లకు సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందే ఈఆర్‌సీకి డిస్కమ్‌లు సర్దుబాటు ప్రతిపాదనలను సమర్పించాయి. 2022-23 ఇంధన సర్దుబాటు ప్రతిపాదనలపై నిర్ణయాన్ని ప్రకటించకుండానే .. విద్యుత్తు టారిఫ్‌ను ఈఆర్‌సీ జారీ చేసింది. గత నెల 29వ తేదీన ఈఆర్‌సీ చైర్మన్‌గా పదవీ విరమణ చేసే ముందురోజున .. అంటే .. అక్టోబరు 28వ తేదీన ఈఆర్‌సీ 2022-23 సర్దుబాటు ప్రతిపాదనలు రూ.8,114 కోట్లకు గాను రూ.6,072 కోట్లకు ఆమోదిస్తూ ఆదేశాలు ఇచ్చింది. 2023-24కు ప్రతిపాదించిన రూ.11,826.42 కోట్లకు మాత్రం నిర్ణయం తీసుకోలేదు. ఈఆర్‌సీ ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతలను సభ్యుడు ఠాకూర్ రామ్‌సింగ్ చేపట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం 2023-24 ఇంధన సర్దుబాటు చార్జీలపై నిర్ణయాన్ని తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

> **కొసమెరుపు:** రాష్ట్ర ప్రజలపై ఈ నెల నుంచి రూ.6,200 కోట్ల భారాన్ని 15 నెలల పాటు వసూలు చేస్తారు. అందువల్ల 2023-24 సర్దుబాటు భారాన్ని ..15 నెలల తర్వాత నుంచి వసూలు చేస్తామని డిస్కమ్‌లు చెబుతున్నాయి. అంటే.. చార్జీల మోతను తట్టుకునేందుకు ఇప్పటి నుంచి మానసికంగా సిద్ధపడాలని డిస్కమ్‌లు చెబుతున్నాయి.

ప్రభుత్వ అవినీతికి ప్రజలను బలి చేస్తారా?

- సర్దుబాటు ప్రతిపాదనలు ఉపసంహరించాలి: సీపీఎం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజలపై ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో భారం వేయడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకించింది. 'గత నెల 28న రూ.6,072 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీలను 2022-23కి వేసిన ఈఆర్‌సీ... ఇప్పుడు 2023-24కి డిస్కమ్‌లు ప్రతిపాదించిన రూ.11,826.47 కోట్ల సర్దుబాటు చార్జీలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు సిద్ధం కావడం సరికాదు. నిరుపేదలు ఇప్పటికే యూనిట్‌కు రూ.1.90 చెల్లిస్తున్నారు. ఈ భారం మోపితే మరో 130 శాతం అధికంగా చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వ అవినీతి, అక్రమాలకు ప్రజలను బలిచేస్తారా?ట్రూఅప్ ప్రతిపాదనలను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో నిరసనలు చేపడతాం' అని హెచ్చరించింది.

విశాఖ ఉక్కును కాపాడాలి

న్యూఢిల్లీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని సీపీఎం కోరింది. కడప స్టీల్ ప్లాంట్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేసింది. ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో మూడురోజుల పాటు జరిగే సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాలకు ఏపీ, తెలంగాణ నేతలు హాజరయ్యారు. రెండో రోజైన సోమవారం ఏపీ నేతలు మీడియాతో మాట్లాడారు. 'ఏపీలో సామరస్య ధోరణిలో పాలన చేయాలి. టీటీడీలో హిందువేతరులను బాధ్యతల్లో ఉండనివ్వబోమని చైర్మన్ నాయుడు చెప్పడం సరికాదు. దళితుడిని పూజారిగా నియమిస్తే బీఆర్ నాయుడు చరిత్రలో నిలిచిపోతారు. ప్రజా సమస్యల సాధన కోసం 14న ప్రజాపోరు నిర్వహిస్తాం' అని పేర్కొన్నారు.

గంజాయి కట్టడికి గట్టి చర్యలు

- ఐదుగురు మంత్రులకు మరిన్ని బాధ్యతలు
- ఏఎన్‌టీఎఫ్ ఏర్పాటుకు త్వరలో ఉత్వర్వులు

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నేరాలకు మూలమవుతున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల కట్టడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. గంజాయి కట్టడికి ప్రణాళికా బద్ధంగా చేపడుతోన్న చర్యల్లో భాగంగా మంత్రివర్గ ఉపసంఘాన్ని జూన్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం అందులోని మంత్రులకు కీలకమైన బాధ్యతలు అప్పగించింది. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సభ్యులుగా ఏర్పాటైన కమిటీ.. గంజాయి సాగు, సరఫరా అవుతున్న విధానం తదితర అంశాలపై ఇప్పటికే రెండు సార్లు సమావేశమై చర్చించింది. అదే సమయంలో యాంటి నార్కోటిక్ టాస్క్ ఫోర్స్(ఏఎన్‌టీఎఫ్) ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఐజీ ర్యాంకు అధికారి ఆకే రవికృష్ణను ఏఎన్‌టీఎఫ్ అధిపతిగా నియమించిన ప్రభుత్వం 450 మంది వివిధ స్థాయి పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖల నుంచి తీసుకుని గంజాయి, మత్తు పదార్థాలు, నాటు సారా కట్టడికి సిద్ధమైంది.

ఎవరెవరు ఏమేమి చేయాలి..

తమ శాఖల ద్వారా ఏమి చేస్తే సత్ఫలితాలు వస్తాయో కమిటీలోని మంత్రులు సూచించాలంటూ ప్రభుత్వం కొత్తగా బాధ్యతలు అప్పగించింది. గంజాయి సాగు నుంచి సరఫరా వరకూ అన్నింటి కట్టడికి హోంశాఖ మంత్రి సూచనలు చేయాలి. విద్యార్థుల్లో చైతన్యం తీసుకువచ్చే అంశాన్ని విద్యాశాఖ మంత్రి సిఫారసు చేయాలి. మత్తు బారిన పడ్డ వారికి వైద్యం, విముక్తి కల్పించడంపై వైద్య శాఖ మంత్రి.. గిరిజనులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం ఇచ్చి గంజాయి సాగుకు దూరం చేయడం ఎలా? అనే అంశంపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తెలియజేయాలి. పూర్తిగా మత్తు విముక్తికి చేపట్టాల్సిన చర్యలు ఎక్సైజ్ శాఖ మంత్రి ప్రభుత్వానికి నివేదించాలంటూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు, మూడు రోజుల్లో ఏఎన్‌టీఎఫ్ ఏర్పాటుపై అధికారికంగా జీవో వెలువడే అవకాశం ఉందని, కూకటివేళ్లతో మత్తు, గంజాయి నిర్మూలనకు కృషి చేస్తామని పోలీసు శాఖ చెబుతోంది.

హెచ్ఆర్సీకి చైర్‌పర్సన్‌ను నియమించేలా ఆదేశాలివ్వండి

- హైకోర్టులో పిల్ దాఖలు

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మానవహక్కుల కమిషన్‌కు చైర్‌పర్సన్‌తో పాటు సభ్యులను నియమించకపోవడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. హైకోర్టు న్యాయవాది తాండవ యోగేశ్ ఈ పిల్ వేశారు. చైర్‌పర్సన్‌తోపాటు సభ్యుల నియామక ప్రక్రియను నెలరోజుల్లో పూర్తి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శులను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.







జస్టిస్ మహేశ్వరరావు, జస్టిస్ గుణరంజన్, జస్టిస్ చంద్ర ధనశేఖర్‌లను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

న్యాయమూర్తులకు ఘన సన్మానం

అమరావతి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టులో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ముగ్గురు న్యాయమూర్తులు జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లను ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం సోమవారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘంతో తమకు ఉన్న అనుబంధాన్ని న్యాయమూర్తులు గుర్తు చేసుకున్నారు. స్నేహపూర్వకంగా కోర్టు కార్యకలాపాలను నిర్వహిస్తామన్నారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీహరి, కార్యవర్గ సభ్యులు, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పసల పొన్నారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మళ్లీ టెండర్లు!

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని పనులకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు జనవరిలోపు కొత్త టెండర్లు పిలుస్తారు. మిగిలిన అన్ని పనులకు డిసెంబరు 31లోగానే టెండర్లను ఆహ్వానిస్తారు. సమావేశ వివరాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు.

ఇలా పరిష్కారం...

అమరావతి నిర్మాణ పనుల పునరుద్ధరణకు పాత టెండర్లు అడ్డంకిగా మారాయి. వాటిని క్లోజ్ చేసేందుకు విధి విధానాలను రూపొందించేందుకు జూలై 24న ప్రభుత్వం చీఫ్ ఇంజనీర్లతో కూడిన సాంకేతిక కమిటీని నియమించింది. దాదాపు 23 అంశాలతో ఈ కమిటీ గత నెల 29న ఒక నివేదికను సమర్పించింది. సోమవారం జరిగిన సీఆర్డీయే సమావేశంలో ఆ నివేదికపై చర్చించి ఆమోదించారు. కమిటీ సిఫారసు ప్రకారం పాత టెండర్లను క్లోజ్ చేసి... కొత్త టెండర్లను పిలుస్తారు. "రానున్న మూడేళ్లలో అమరావతి అభివృద్ధి పనులన్నీ పూర్తిచేస్తాం. ఐదేళ్లలో ప్రపంచంలోని ఐదు ఉత్తమ నగరాల్లో అమరావతి ఒకటిగా విరాజిల్లుతుంది" అని మంత్రి నారాయణ పేర్కొన్నారు. అమరావతి నిర్మాణానికి ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం అంచనాలు రూపొందించి కొత్త టెండర్లు పిలుస్తామని మంత్రి చెప్పారు. ఎస్ఎస్ఆర్ రేట్లను రివైజ్ చేస్తారన్నారు. మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాలంటే కనీసం 10-15 శాతం ధరలు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. కాంట్రాక్టు కంపెనీలకు గతంలో రూ.5 వేల కోట్లు చెల్లించామని, ఇప్పుడు రూ.600 కోట్ల వరకు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఏజెన్సీలు తమ పాత టెండర్లను మూసివేయడానికి చీఫ్ ఇంజనీర్ల కమిటీతో చర్చించామన్నారు. కాంట్రాక్టర్లకు నష్టపరిహారం చెల్లించాల్సిందేమీ లేదన్నారు.

వరద నివారణకు మినీ రిజర్వాయర్లు..

అమరావతి అభివృద్ధి పనులకు సంబంధించి ప్రపంచ బ్యాంక్ రూ.15 వేల కోట్లు ఇవ్వడానికి అంగీకారం తెలిపిందని, అయితే వరద నివారణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆ బ్యాంకు ప్రతినిధులు కోరారని మంత్రి నారాయణ తెలిపారు. సీడ్ కేపిటల్‌లో 48 కిలోమీటర్ల మేర మూడు కాల్వలు వస్తున్నాయన్నారు. రాజధాని అమరావతిలోని 217 చదరపు కి.మీ. కోర్ క్యాపిటల్ పరిధిలోను, ఆ వెలుపల పలుచోట్ల మినీ రిజర్వాయర్లు నిర్మించాలన్నారు. నీరుకొండ వద్ద .04 టీఎంసీలు, కృష్ణాయపాలెం వద్ద .01 టీఎంసీలు, శాఖమూరు వద్ద .01 టీఎంసీల నిల్వకు రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పుడు ఉన్న లిఫ్ట్ కాకుండా ఉండవల్లి వద్ద 7,300 క్యూసెక్కులు పంపింగ్ చేసే మరొక లిఫ్ట్ ఏర్పాటు చేస్తామన్నారు. వైకుంఠపురం వద్ద 5,600 క్యూసెక్కుల వాటర్ పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నెదర్లాండ్స్ కన్సల్టెన్సీ సూచించిందని చెప్పారు. అలాగే లాం వద్ద 0.3 టీఎంసీలు, పెదపరిమి వద్ద 0.33 టీఎంసీలు, వైకుంఠపురం వద్ద .17 టీఎంసీల రిజర్వాయర్లు ఏర్పాటుకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపిందన్నారు.

రైల్వే లైన్‌కు ల్యాండ్ పూలింగ్..!

అమరావతిలో కొత్త రైల్వేలైను వెళ్లే వడ్డమాను, వైకుంఠపురం తదితర గ్రామాల రైతులు తమ భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇవ్వడానికి ముందుకొచ్చారని, దీనికి సీఎం చంద్రబాబు కూడా సుముఖత వ్యక్తం చేశారని మంత్రి తెలిపారు. దీనిపై పది రోజుల్లోగా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇక ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కావాల్సిన భూమి విషయంలో ల్యాండ్ పూలింగ్‌కు వెళ్లాలా, లేక సేకరణ ద్వారా తీసుకోవాలా అనే విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. గతంలో నిర్ణయించినట్టు ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, ఈస్ట్, వెస్ట్ బైపాస్‌ల నిర్మాణం చేస్తామన్నారు. రాజధాని పనులు ఓపెన్ టెండర్ల ద్వారా పిలుస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. గతంలో అమరావతిలో ప్రభుత్వం భూములిచ్చిన వారందరినీ పిలిచి మాట్లాడాలని సీఎం చెప్పారని, ఆయన కూడా టాటా, బిర్లా తదితరులతో మాట్లాడుతున్నారని మంత్రి తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.